ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 7, సెప్టెంబరు 2025


నిమజ్జనం కోసం కొత్తపట్నం తీరానికి తెచ్చిన వినాయక విగ్రహాలు


గంగ ఒడికి చేరిన గణనాథుడు


నిమజ్జనం కోసం విగ్రహాన్ని కడలిలోకి తీసుకెళ్తున్న భక్తులు

# వినాయకా.. వీడ్కోలిక

- ముగిసిన నవరాత్రులు
- వైభవంగా నిమజ్జనాలు
- తీరప్రాంతానికి పెద్దఎత్తున తరలిన విగ్రహాలు
- భక్తులతో కోలాహలం

జిల్లావ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు శనివారం ఉత్సాహంగా సాగాయి. మేళతాళాలు.. డీజే శబ్దాలు.. డప్పు వాయిద్యాలు.. బాణ సంచా మోతల మధ్య గణనాథుడిని భక్తులు ఊరేగింపుగా తీసుకెళ్లి గంగ ఒడికి చేర్చారు. తీరంలో ఉన్న కొత్తపట్నం, కె.పల్లెపాలెం, ఈతముక్కల, మడనూరు, గుండమాల, కనపర్తి, పాకల తదితర ప్రాంతాలకు పెద్దఎత్తున విగ్రహాలతోపాటు భక్తులు పోటెత్తారు. ఒంగోలు-కొత్తపట్నం రోడ్డులో ఉదయం నుంచే కోలాహలం నెలకొంది. మిగిలిన ప్రాంతాల్లో ఎక్కడికక్కడ జలవనరుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

- కొత్తపట్నం, ఆంధ్రజ్యోతి




వినాయక విగ్రహం ముందు భక్తుల సందడి


దర్శిలోని కాటేరు వాగు భూమిలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహం (ఫైల్)

# ఆక్రమణదారుల సరికొత్త ఎత్తులు

- ప్రభుత్వ స్థలాల్లో దేవుని విగ్రహాలను ఏర్పాటు చేసి ఉద్రిక్తతలు సృష్టిస్తున్న వైనం
- ఉదాసీన వైఖరి అవలంబిస్తున్న అధికారులు
- రూ.కోట్ల ప్రభుత్వ భూములు పరులపరం

దర్శి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విలువైన ప్రభుత్వ స్థలాలను కొట్టేసేందుకు అక్రమార్కులు కొత్త ఎత్తులు వేస్తున్నారు. నేరుగా ఆక్రమణలకు అవకాశం లేనిచోట దేవుళ్ల విగ్రహాలను నెలకొల్పి సెంటిమెంట్‌ను రేకెత్తిస్తున్నారు. కొంతకాలం తర్వాత ఆ స్థలాలను సొంతం చేసుకుంటున్నారు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు పరులపరమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఆ పార్టీ నాయకులు రూ.కోట్ల ఆస్తులను స్వాహా చేశారు. దర్శి-పొదిలి రోడ్డులో వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న కాటేరువాగు అధిక శాతం ఆక్రమణకు గురైంది. దర్శి-పొదిలి ప్రధాన రహదారికి దగ్గరలో ఉన్న సుమారు ఎకరం స్థలం కోట్ల రూపాయల ధర పలుకుతోంది. ఆ రోడ్డుకు సమీపంలో కాటేరు వాగుకు సంబంధించిన భూమిని కొట్టేసేందుకు వైసీపీ నాయకుడు మూడేళ్ల క్రితం ప్రయత్నించాడు. అది సాధ్యం కాకపోవడంతో సరికొత్త ఎత్తుగడ వేశాడు. కొంతమంది అక్రమార్కులతో కలిసి ఆ భూమిలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశాడు. ప్రభుత్వ అధికారులు అక్కడ హెచ్చరిక బోర్డులు పెట్టి వదిలేశారు. ఆ స్థలం సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా ముండ్లమూరు మండలంలోని పసుపుగల్లులో వైసీపీ నాయకుడు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టగా పోలీసు అధికారులు తొలగించారు. అయితే వైసీపీ నాయకుడు ఆ స్థలాన్ని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో రెండు రోజుల క్రితం అక్కడ

మిగతా 6వ పేజీలో

# నిమజ్జనంలో అపశ్రుతి

- సముద్రంలోకి దిగి ఇద్దరు మృతి
- ఒకరిని కాపాడే ప్రయత్నంలో కొట్టుకుపోయిన మరొకరు
- గుండమాల తీరంలో ఘటన


నాగరాజు మృతదేహం


పాలచంద్రరావు మృతదేహం

కొత్తపట్నం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జనంలో చివరి రోజైన శనివారం అపశ్రుతి చోటుచేసుకుంది. సముద్రంలో స్నానానికి దిగి మోటుమాలకు చెందిన పురిణి నాగరాజు (50), పురిణి పాలచంద్రరావు (45) మృతి చెందారు. ఈ ఘటన గుండమాల తీరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను గ్రామస్థులు ఒకే రోజు నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆ ప్రకారం శనివారం విగ్రహాలను గుండమాల తీరానికి తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. ఆతర్వాత కొంత మంది సముద్రంలో స్నానాలకు దిగారు. వీరిలో నాగరాజు లోతుకు వెళ్లి స్నానం చేస్తున్న సమయంలో సముద్రంలోకి కొట్టుకుపోతుండటంతో పురిణి పాలచంద్రరావు రక్షించేందుకు ప్రయత్నించాడు. అయితే అతను కూడా లోపలికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో మోటుమాలలో విషాదఛాయలు నెలకొన్నాయి. అప్పటివరకు విగ్రహాల నిమజ్జన కార్యక్రమాల్లో హుషారుగా ఉన్న గ్రామస్థులు ఒక్కసారిగా దుఃఖసాగరంలో మునిగిపోయారు. పాలచంద్రరావుకు ఇద్దరు

మిగతా 6వ పేజీలో

జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లెలు మంచం పట్టాయి. పట్టణాల్లోనూ జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగానే ఉంది. నెల నుంచి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా లక్షా రెండు వేల మందికి పైగా జ్వర బాధితులు ఉన్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ లెక్కలు కేవలం ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్సకు వచ్చిన వారివి మాత్రమే. ఇక ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్ఎంపీలు, పీఎంపీల వద్ద మరో లక్ష మందికిపైగా వైద్యం చేయించుకుని ఉంటారనేది అంచనా.


ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

# వణికిస్తున్న జ్వరాలు

- జిల్లావ్యాప్తంగా అధికారికంగా లక్షా రెండువేల మందికిపైగా పీడితులు
- అనధికారికంగా మరో లక్ష మందికిపైనే..
- ఒంగోలు మండలంలో అత్యధికంగా 9,369 మంది
- మొక్కుబడిగా ఫీవర్ సర్వే

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారడంతో ఈ పరిస్థితి నెలకొంది. పారిశుధ్య నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించినా క్షేత్రస్థాయిలో ఇంకా పరిస్థితి మెరుగుపడలేదు. ఇటీవల కురిసిన వర్షాలతో చెత్తాచెదారం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. తద్వారా దోమల ఉత్పత్తి పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. సాధారణంగా సీజనల్ వ్యాధులు వస్తూపోతుంటాయి. ఆ సమయంలో వైద్యశాఖతోపాటు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం ద్వారా వాటిని అరికట్టడం సాధ్యమవుతుంది. అయితే ప్రస్తుతం గ్రామాల్లో ఆ పరిస్థితి లేకపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

**ఫీవర్ సర్వే అంతంతమాత్రమే!**

సాధారణంగా ప్రస్తుత సమయంలో వైద్యశాఖ ద్వారా ఫీవర్ సర్వే నిర్వహించి తద్వారా వచ్చిన సమాచారానికి అనుగుణంగా వైద్యశాఖ క్షేత్రస్థాయిలోని వైద్యులను అప్రమత్తం చేయాల్సి ఉంది. అయితే అంతా మొక్కుబడిగా సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫీవర్ సర్వే ద్వారా ఏ కుటుంబంలో ఎంతమంది ఉన్నారు, వారిలో ఎవరైనా వ్యాధుల బారిన పడ్డారా అన్న విషయాలు తెలుస్తాయి. ఆ ప్రకారం బాధితులకు సకాలంలో వైద్యసేవలు అందించవచ్చు. కానీ జిల్లాలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

**జిల్లాకేంద్రం చుట్టుపక్కలే భారీగా...**

జిల్లాలోని ఒంగోలు మండలంలో అత్యధికంగా నెల వ్యవధిలో 9,369 జ్వర కేసులు నమోదు కాగా అతి తక్కువగా కొండపి మండలంలో కేవలం 510 మంది మాత్రమే ఉన్నారు. అలాగే అన్ని మండలాల్లో వందలాది మంది జ్వరాలతో బాధపడుతున్నారు. చీమకుర్తి మండలంలో 6,130 మంది, కనిగిరిలో 5,790 మంది, గిద్దలూరులో 4,589 మంది, మార్కాపురంలో 4,150 మంది, మద్దిపాడు మండలంలో 3,108 మంది, హెచ్ఎంపాడు

మిగతా 6వ పేజీలో



# గండి చెరువుకు లీకులు

- వృథాగా పోతున్న వరద నీరు
- ఆందోళనలో రైతులు

7

# ముమ్మరంగా వరినాట్లు

- కాలువల్లో పుష్కలంగా నీరు
- ఈ ఏడాది పెరగనున్న విస్తీర్ణం

7

## జిల్లా పంచాయతీ అధికారి వెంకటనాయుడు బదిలీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు బదిలీ అయ్యారు. ఆయన్ను అన్నమయ్య జిల్లా డ్వామా అడిషనల్ పీడీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. వెంకటనాయుడు గత నెల 26న వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్‌శాఖలో బదిలీలు జరిగాయి. ఆ జాబితాలో వెంకటనాయుడు కూడా ఉన్నారు.

## వైద్యశాఖలో ఉద్యోగాలకు మెరిట్ జాబితాల ప్రకటన

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని జీజీహెచ్, జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్ నర్సులు, ఎఫ్ఎన్‌వోలు, ఎస్‌పడబ్ల్యూ ఉద్యోగాల నియామకాల మెరిట్ జాబితాలను వైద్యశాఖ శనివారం ప్రకటించింది. వాటిని ఆశాఖ వెబ్‌సైట్‌లో ఉంచింది. తిరస్కరించిన వారి జాబితాను కూడా అందులోనే పొందుపరిచినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు.

**చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి**
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

7

# 'ఉపాధి' నిధులతో పంచాయతీ భవనాలు

- ఒక్కోదానికి రూ.32 లక్షలు
- ఆర్‌జీఎస్‌ఏ కింద 80శాతం
- మరో 20శాతం ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కోటా
- జిల్లాకు 19 భవనాలు మంజూరు

ఒంగోలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం మెటీరియల్ కోటా నిధులతో పంచాయతీ భవనాలను ప్రభుత్వం నిర్మించనుంది. అందుకు కేంద్ర ప్రభుత్వ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) పథకం ద్వారా సుమారు 80శాతం మంజూరు కానున్నాయి. మరో 20శాతం రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి పథకం మెటీరియల్ కోటా నిధుల నుంచి సమకూర్చాలని నిర్ణయించింది.



అలా రాష్ట్రంలో రెండు విడతలుగా 557 పంచాయతీల్లో భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అందులో జిల్లాకు సంబంధించి 19 ఉన్నాయి. ఇప్పటి వరకు భవనాలు లేని పంచాయతీల్లో వీటిని నిర్మించనున్నారు. గతంలో 2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అనేక గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణాలు చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తెచ్చింది. వాటికి భవన నిర్మాణాలను చేపట్టింది. జిల్లాలోనూ అత్యధిక గ్రామాల్లో అటు పంచాయతీ, ఇటు సచివాలయ భవనం ఏదో ఒకటి ఉన్నాయి. కొద్ది

మిగతా 6వ పేజీలో



# ట్రంకు రోడ్డు విస్తరణ 80 అడుగులే!

- 12న కౌన్సిల్ సమావేశంలో ఆమోదం
- హైకోర్టును ఆశ్రయించిన వ్యాపారులు
- వారు అడిగినవన్నీ ఇచ్చేందుకు కార్పొషన్ అధికారులు సిద్ధం
- త్వరలో పనులు ప్రారంభం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో కీలకమైన ప్రధాన రహదారి ట్రంకు రోడ్డు విస్తరణ దాదాపు ఖరారైంది. నాలుగు నెలలుగా వాయిదా పడుతూ వచ్చిన ఈ అంశం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులకు విస్తరించాలని అధికారులు తొలుత భావించగా వ్యాపారుల నుంచి అభ్యంతరాలు ఎదురయ్యాయి. వారితో అనేకసార్లు అటు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఇటు కార్పొరేషన్ అధికారులు చర్చించినా ఫలితం కన్పించలేదు. రోడ్డు విస్తరణపై తమ అభ్యంతరాలు

మిగతా 6వ పేజీలో

**వ్యాపారులకు నష్టం వాటిల్లకుండా చర్యలు**

ట్రంకు రోడ్డును 100 అడుగులకు విస్తరిస్తే 125 షాపులు పూర్తిగా కోల్పోనున్నారు. ప్రస్తుతం 80 అడుగులకు మాత్రమే పరిమితం చేస్తున్నందున 73 షాపులు పూర్తిగా పోయే అవకాశం ఉంది. పూర్తిస్థాయిలో షాపులు కోల్పోయిన వారికి స్థానిక పాత మార్కెట్ వద్ద కొత్తవి నిర్మించి ఇవ్వనున్నారు. వారికి నాలుగు రెట్లు టీడీఆర్ బాండ్‌లు.. 2003, 2013 బిల్డింగ్ యాక్ట్, రీసెటిల్మెంట్ ప్రకారం తొలగించిన భనాల నిర్మాణాల ఖర్చును కూడా నగరపాలక సంస్థే ఇవ్వనున్నట్లు తెలిసింది. ఒకవైపు నగర అభివృద్ధితోపాటు, మరోవైపు వ్యాపారుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు చర్యలు చేపట్టారు. త్వరితగతిన ట్రంకు రోడ్డు విస్తరణ చేస్తే భవిష్యత్ తరాలకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

## ప్రతి ఇంటికీ తాగునీరు

● పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రతి ఇంటికీ రోజూ తాగునీరు అందించాలని, ఆదిశగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. సమావేశంలో ఆశాఖ ఇంజనీరింగ్ చీఫ్ ఎం.ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్ సుధాకర్, నెల్లూరు సర్కిల్ సూపరింటెండెంట్ మోహన్, ఒంగోలు పబ్లిక్ హెల్త్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాససంజయ్, ఎస్ఈ నగేష్‌బాబు, డీఈ శ్రీనివాసరావు, గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఏఈలు సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు ప్రజలకు రోజువారీగా తాగునీరు అందించడం లక్ష్యమని, ఈ నీటి సరఫరా పథకం పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఏఐఐటీ నీటి సరఫరా పథకం అమలుపై సమీక్షించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు తక్షణమే తాగునీరు అందించాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

## పెండింగ్ బిల్లులు వసూలు చేయాలి

● విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం విద్యుత్ సబ్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న నివాసగృహాల కరెంట్ బిల్లులను వారంలోపు వసూలు చేయాలని ఏపీడీసీఎల్ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు అన్నారు. సబ్ డివిజన్ ఎలక్ట్రికల్ ఉద్యోగులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. వైపాలెంలో 843 ఇళ్ల సర్వీసులు పెండింగ్ బిల్లులు రూ.60లక్షలు, త్రిపురాంతకం మండలంలో 280 సర్వీసులకు సంబంధించి రూ.1,5,072లక్షలు, పుల్లలచెరువు మండలంలో 287 సర్వీసులకు పెండింగ్ బిల్లులు రూ.1,4,060 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. డీఈ నాగేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రంగనాయక స్వామికి ప్రత్యేక పూజలు

రాచర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీ చెరువు అటవీ ప్రాంతంలోని నెమలిగుండ్ల రంగనాయ స్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూజలు అనంతరం స్వామివారి ప్రసాదాలను అందజేశారు. దర్శనానికి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయంలోని పలు సత్రాల్లో భక్తులకు ఉచితంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు కన్నసాని గోపాలరావు, తోట చంద్రయ్య తెలిపారు.

## మొబైల్‌యాప్‌లో ఆర్‌టీఐ సేవలు

● ఆ శాఖ చీఫ్ ఇన్‌ఫర్‌మేషన్ కమిషనర్ మహబూబ్ బాషా

అద్దంకిటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రూ.1.80 కోట్లతో రానున్న రోజులలో ఫోను నుంచి ఆర్‌టీఐ సేవలను అందజేయనున్నట్లు ఆ శాఖ చీఫ్ సమాచార కమిషనర్ ఆర్‌మహబూబ్ బాష అన్నారు. శనివారం అద్దంకి వచ్చిన ఆయన స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకర్లతో మాట్లాడారు. 2005లో పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడంతో ఆర్టీఐ చట్టం ఏర్పడిందన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వశాఖ కార్యాలయాలల్లో సమాచార అపిలేట్ అధికారులకు రూ.10 చెల్లించి స్టాంపుతో లెటర్ ద్వారా మనకు కావాల్సిన సమాచారాన్ని అడిగి 30 రోజులలోపు తీసుకోవచ్చన్నారు. త్వరలో మొబైల్‌లో కూడా సేవలు అందజేయనున్నట్లు తెలిపారు.



సుజాతనగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంను సన్మానిస్తున్న లైవ్ స్టాక్ సీఈవో శ్రీనివాసరావు

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తోడ్పాటు అందిస్తాం

బల్లికురవ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తమవంతు సహకారం అందిస్తామని ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ ఆథారిటీ సీఈవో ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని ఎస్ఎల్.గుడిపాడు గ్రామ పరిధిలోని సుజాతనగర్ ప్రభుత్వ పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏడాది పాటు విద్యార్థులకు తాము ఉచితంగా మినరల్ వాటర్ అందిస్తామన్నారు. ముందు ముందు విద్యార్థులకు పలు వసతులు కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం గుంటుపల్లి పార్థసారధితో పాటు మరో ఉపాధ్యాయురాలు లావణ్యను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గూగుల్ సంస్థ రీజనల్ ఈవీసర్ ప్రణవి, ఉపాధ్యాయులు రాజశేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.



# రోగులకు మెరుగైన వైద్య సేవలు

సీహెచ్‌సీ 50 పడకల ఆసుపత్రిగా మార్పునకు ప్రతిపాదనలు

డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మావతి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యశాలలో మరిన్ని వసతులు, అభివృద్ధి చర్యలు చేపట్టినట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ పి. పద్మావతి తెలిపారు. 30 పడకలుగా ఉన్న అద్దంకి సీహెచ్‌సిని 50 పడకల ఆసుపత్రిగా మార్పునకు ప్రతిపాదించినట్లు తెలిపారు. శనివారం సాధారణ తనిఖీలో భాగంగా అద్దంకి సిహెచ్‌సిని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని ల్యాబ్‌లో ఉన్న అధునాతన మిషన్ పనిచేయకపోవడాన్ని ఆమె గమనించారు. వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. వైద్యశాలలో సాధారణ కాన్పులు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వహిల చౌదరి తెలిపారు. ప్రతి రోజు వచ్చే ఓపీలు, ఇన్‌పేషట్‌లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వైద్యశాల అభివృద్ధికి సంబంధించి రూ.40 లక్షలు మంజూరయ్యాయని, సంబంధిత కాంట్రాక్టర్ ఇంకా పనులు ప్రారంభించలేదని వాహిల చౌదరి తెలియజేశారు. త్వరలో పనులు జరిగేలా చూడాలన్నారు. ఆమె వెంట వైద్యాధికారులు డాక్టర్ అనిత, డాక్టర్ ప్రదీప్తి, డాక్టర్ తేజశ్వని, డాక్టర్ ప్రదీప్‌కుమార్ తదితరులు ఉన్నారు. వైద్యాధికారులు డాక్టర్ పద్మావతిని శాలువతో సత్కరించారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి

# ఉపాధి నిధులతో పంచాయతీ భవనాలు

(5వ పేజీ తరువాయి)

గ్రామాల్లో ఏ భవనం లేకుండా అద్దె గదులు లేదా సర్పంచ్‌ల ఇళ్లలోనే పంచాయతీ కార్యాలయాలను కొనసాగిస్తున్నారు.

**వచ్చే ఏడాది మార్చి 31లోపు భవనాల నిర్మాణం పూర్తి**

స్థానిక పరిపాలనా వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా ఆర్‌జీఎస్‌ఏ పథకం కింద పంచాయతీ భవన నిర్మాణాలకు కేంద్రం సంకల్పించింది. 2022 ఏప్రిల్ నుంచి 2026 మార్చి 31 వరకు ఈ పథకం అమలులో ఉంటుంది. ఆలోపు పంచాయతీ భవనాలు పూర్తికి కేంద్రం నిర్ణయించింది. అందుకు గాను కేంద్రం 80శాతం నిధులు సమకూర్చుతోంది. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 20శాతం భరించాలి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను ఉపాధి పథకం మెటీరియల్ కోటా ద్వారా కేటాయింపునకు నిర్ణయించింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.32 లక్షలు వ్యయం అంచనా కాగా అందులో రూ.7 లక్షలను ఉపాధి పథకం మెటీరియల్ కోటా నుంచి కేటాయించనున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు సొంత భవనం లేని గ్రామాలు, సచివాలయాలు.. అలాగే తక్షణం భవన నిర్మాణానికి ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న గ్రామ పంచాయతీలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చారు.

**భవనం మంజూరైన పంచాయతీలు ఇవీ..**

తొలివిడత రాష్ట్రంలో 140 భవనాలు మంజూరు కాగా జిల్లాకు సంబంధించి ఒకే ఒక్కటి వెలిగండ్ల మండలం పందువ గ్రామ పంచాయతీ ఉంది. రెండో విడతలో పెద్దయాచవరం, నికరంపల్లి, పడమటిపల్లి, కె.కొత్తపల్లి, గంటవానిపల్లె, బాడేనాయక్ తండా, రామాయపాలెం, ఉమ్మనపల్లె, జోళ్లపాలెం, మోటుపల్లె, బూరేపల్లి, బాదినేనిపల్లి, ఎస్.కొత్తపల్లి, జయరాంపురం, సంగాపురం, సంగంతండా పంచాయతీలకు భవనాలను మంజూరు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా త్వరలో నిర్మాణాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్ తెలిపారు.

## ట్రంకు రోడ్డు విస్తరణ 80 అడుగులే!

(5వ పేజీ తరువాయి)

తెలియజేస్తూ ఇటీవల వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. తమకు అన్యాయం జరగకుండా 2013 రీసెటిల్మెంట్ యాక్ట్ ప్రకారం న్యాయం చేయాలని కోరారు. అయితే వ్యాపారులు అడిగినవన్నీ ఇచ్చేందుకు తాము సిద్ధమని నగర పాలక సంస్థ అధికారులు కోర్టుకు తెలియజేశారు. అందుకు అనుగుణంగా కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డును 80 అడుగులకే విస్తరించాలని నిర్ణయించారు.

**ఈనెల 12 కౌన్సిల్‌లో ఆమోదం?**

కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ట్రంకురోడ్డు విస్తరణ అంశం పలుమార్లు వాయిదా పడింది. అదేసమయంలో ఎమ్మెల్యే దామచర్ల కూడా స్వయంగా వ్యాపారులతో సమావేశమై సహకరించాలని, నగర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. కానీ వ్యాపారుల నుంచి ఒకవైపు స్పష్టమైన నిర్ణయం రాకపోవడం, మరోవైపు కొందరు కోర్టును ఆశ్రయించడంతో వాయిదా పడింది. ఇకపై ట్రంకురోడ్డు విస్తరణ పనులు వాయిదా పడకుండా త్వరితగతిన చేపట్టేందుకు 100 అడుగులు కాకుండా 80 అడుగులకే విస్తరించేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది. ఆ ప్రతిపాదనకు ఈ నెల 12న జరిగే కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఆమోద ముద్ర పడనుంది.

## నిమజ్జనంలో అపశ్రుతి

(5వ పేజీ తరువాయి)

కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నాగరాజుకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్దిసేపటికి ఒడ్డుకు చేరిన ఇద్దరి మృతదేహాలను కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్ పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

**గస్తీని పెంచిన పోలీసులు**

ఇప్పటి వరకు నిమజ్జనాల్లో చిన్నపాటి అవాంఛనీయ ఘటన కూడా చోటు చేసుకోకుండా చూసిన పోలీసులు గుండమాల ప్రమాదంతో అప్రత్తమయ్యారు. కొత్తపట్నం మండలంలోని తీరప్రాంత గ్రామాల వద్ద గస్తీని పెంచారు. ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు హుటాహుటిన తీరానికి చేరుకున్నారు. కొత్తపట్నంతోపాటు నిమజ్జన ప్రాంతాలను పరిశీలించారు.

**మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల సంతాపం**

నిమజ్జనం సందర్భంగా ఇద్దరు మృతి ఘటనపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. నిమజ్జనాల్లో భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ మృతుల కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. యవారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## వణికిస్తున్న జ్వరాలు

(5వ పేజీ తరువాయి)

మండలంలో 2,618 మంది జ్వరపీడిత కేసులు నమోదయ్యాయి. పామూరు మండలంలో 3,941 మంది, పొదిలిలో 3,571 మంది, దర్శిలో 3,585 మంది, త్రిపురాంతకం 2,954 మంది, వైపాలెం 2,969 మంది, ముండ్లమూరు 2,723 మంది, సింగరాయకొండ 2,407 మంది, తాళ్లూరు 2,420 మంది జ్వరపీడితులు ఉన్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా ఇతర మండలాల్లో 500 మంది నుంచి 2వేల మందికిపైగా జ్వరపీడితులు ఉన్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**వైద్యాధికారులను అప్రమత్తం చేశాం**

**డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో**

జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులను అప్రమత్తం చేశాం. ఫీవర్ సర్వే ద్వారా జ్వరాలు అధికంగా ఉన్నట్లు గుర్తించిన గ్రామాల్లో వైద్యాధికారులు సేవలు అందిస్తున్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాం. ప్రజలు కూడా తమ సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలల్లో చూపించుకొని అవసరమైన మందులు వాడటం ద్వారా వ్యాధిని తగ్గించుకోవచ్చు.

## అక్రమార్కుల సరికొత్త ఎత్తులు

(5వ పేజీ తరువాయి)

దేవుళ్ల బొమ్మలు ఏర్పాటు చేశారు. ఈ స్థలాన్ని ఆలయాల నిర్మాణానికి ఇస్తున్నట్లు ప్రకటించాడు. ప్రభుత్వ స్థలంలో దేవుళ్ల బొమ్మలు పెట్టి సమస్య మరింత జటిలం చేస్తున్నారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వెళ్లి ఆ బొమ్మలను తొలగించారు. అధికారులు ఇలాంటి చర్యలను ఆదిలోనే కట్టడి చేసి ఉంటే ఇలాంటి ఆలోచన అక్రమార్కులకు వచ్చేదికాదు. వారు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో ప్రభుత్వ స్థలాల స్వాహాకు రకరకాల ఎత్తులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పలు రూట్లలో అదనపు ట్రిప్పులు

అద్దంకి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం అమలు తరువాత మహిళా ప్రయాణికుల ఆదరణ పెరిగిన నేపథ్యంలో అద్దంకి డిపోలో రోజువారి ఆదాయం రూ.10 లక్షల నుంచి రూ.12.50 లక్షలకు పెరిగిందని, డీఎం రామ్మోహనరావు తెలిపారు. అద్దంకి డిపో పరిధిలో పలు రూట్ల లో అదనపు ట్రిప్పులు నడుపుతున్నట్లు తెలిపారు. అద్దంకి-చిలకలూరిపేట వయా వలపర్ల రూటులో ఉదయం 11-15 గంటలకు, వయా వైదన రూట్‌లో సాయంత్రం 6 గంటలకు, అద్దంకి-ఇంకొల్లు వయా పంగులూరు రూటులో ఉదయం 8-45 గంటలకు, వయా చందలూరు రూటులో ఉదయం 10-15, మధ్యాహ్నం 12-15 గంటలకు అదనపు ట్రిప్పులు నడుపుతున్నట్లు తెలిపారు. అద్దంకి-మణికేశ్వరం రూటులో ఉదయం 9-50, రాత్రి 7-30 గంటలకు బస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## 9న అన్నదాత పోరు

అద్దంకి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 9న నిర్వహించే అన్నదాత పోరు కరపత్రాలను శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నాగార్జున ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు నరశింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జ్యోతి హనుమంతరావు, కాకాని రాధాకృష్ణమూర్తి, గునుపూడి రఘురామగుప్తా, ఈదా శ్రీనివాసరెడ్డి, అవిశన ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నేడు శింగరకొండలో గిరి ప్రదక్షిణ**

అద్దంకి, సెప్టెంబరు6( ఆంధ్ర జ్యోతి): పౌర్ణమి సందర్భంగా శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవాలయం వద్ద ఆదివారం ఉదయం 6 గంటలకు గిరి ప్రదక్షణ ప్రారంభమౌతోందని ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. గిరి ప్రదక్షణ పూర్తయిన తరువాత భక్తులకు స్వామి వారి దర్శనం ఉంటుందన్నారు.

## కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

అద్దంకి,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి):అద్దంకి పట్టణంలోని విద్యానగర్ లో నివాసం ఉండే కానిస్టేబుల్ భార్య ఉష(34)ఆత్మహత్య కు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న తిరుపాల్‌రెడ్డి శనివారం విధులకు వెళ్లిన అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భార్య ఉష ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన ఉష కుమార్తె తాతకు ఫోన్ చేసింది.

భర్త, బంధువులు ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతి చెంది ఉంది.

మానసిక సమస్యతో బాధపడుతుండటంతో ఒంగోలు లోని ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

## గంజాయి అక్రమ రవాణాపై దాడులు

● నెల్లూరు, ఒంగోలు, చీరాల రైల్వేస్టేషన్లలో నలుగురి అరెస్ట్

● 17.600 కేజీల గంజాయి స్వాధీనం

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడిలో భాగంగా నెల్లూరు, ఒంగోలు, చీరాల రైల్వే స్టేషన్లలో పలు రైళ్లను తనిఖీ చేసి, 17.600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ మురళీధర్ తెలిపారు. శనివారం నెల్లూరు రైల్వేస్టేషనులోని తన కార్యాలయంలో ఆయన ఈ కేసుల పూర్వాపరాలను వెల్లడించారు. నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్‌లు తమ సిబ్బందితో కలిసి నెల్లూరు స్టేషన్‌లో పలు రైళ్లలో తనిఖీలు చేశారు. టాటా-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులో అనుమానాస్పదంగా ఉన్న కర్నాటక రాష్ట్రం కోలార్ జిల్లా చిక్‌బళ్లాపూర్‌కు చెందిన కె వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ఆయన బ్యాగులో నుంచి 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసినట్లు విచారణలో నిందితుడు తెలిపినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన, ఆర్పీఎఫ్ ఎస్ఐ కొండయ్య, సిబ్బందిని అభినందించారు.

● ఒంగోలులో పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న తమిళనాడులోని శాలిగ్రామ్ జిల్లాకు చెందిన ప్రేమ్‌చంద్, కొండితోపే ప్రాంతానికి చెందిన మనీష్ దూబేలను అరెస్ట్ చేసి, 7.600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అలాగే, చీరాల రైల్వేస్టేషన్‌లో ధనబాద్-అల్లెప్పి ఎక్స్‌ప్రెస్‌లో కేరళాలోని ఎర్నాకుళం జిల్లా కక్కనాడ్ ప్రాంతానికి చెందిన ఇబ్రహీమ్‌ను అరెస్ట్ చేసి, 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మహా సుదర్శన యాగంలో పాల్గొన్న భక్తులు

## వైభవంగా మహా సుదర్శన యాగం

చినగంజాం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామంలోని సీతారామాలయం ప్రాంగణంలో మహాసుదర్శన యాగం కార్యక్రమాన్ని భక్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. సీతారామాలయం ప్రాంగణంలో వేదపండితులు త్రినాథ్ చక్రవర్తి అయ్యవార్ల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు దంపతులతో సుదర్శన యాగాన్ని నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి అతి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. యాగంలో వేదపండితులు ప్రతి ఒక్క భక్తుడితో సంకల్పం చేయించారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించనున్నట్లు ఆలయ ధర్మకర్త మోటుమర్రి రామసుబ్బారావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వలివేటి వెంకట రామాంజనేయులు తెలిపారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈ.వో ఎం.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, టీడీపీ నాయకులు నక్కల వీరరాఘవులు, సందు శ్రీనివాసరావు, కొండ్రగుంట శ్రీహరి, టీ.జయరావు, తొగరు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



పెదరావిపాడులో రేషన్ షాపు దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో పద్మశ్రీ

## నిత్యావసర సరుకుల పంపిణీని వేగవంతం చేయాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్‌షాపు డీలర్లు నిత్యావసర సరుకులను నిర్ణీత గడువులోగా ఎక్కువమంది కార్డుదారులకు అందించాలని డీఎస్‌వో పద్మశ్రీ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని పెదరావిపాడు రేషన్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు సరుకులు అందజేయాల్సి ఉందన్నారు. కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సరుకులు అందజేయాలని డీలర్ చించు వీరనారాయణను ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గేదెలు

## గుర్తుతెలియని వాహనం ఢీకొని 8 గేదెలు మృతి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని 8 గేదెలు మృతిచెందాయి. ఈఘటన శుక్రవారం రాత్రి సీఎస్‌పురం మండలం కంభంపాడు - కోవిలంపాడు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. రాత్రిపూట రహదారిపై గేదెలు సంచరిస్తుండటంతో కనపడక వాహనం ఢీ కొన్నట్లు తెలుస్తోంది.



మన మిత్ర యాప్‌పై కొల్లావారిపాలెంలో ఇంటింటా అవగాహన కల్గిస్తున్న ఎంపీడీవో వెంకటస్వామి

## మన మిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీడీవో వెంకటస్వామి

పర్చూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మన మిత్ర యాప్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో వెంకటస్వామి సూచించారు. శనివారం మండలంలోని కొల్లావారిపాలెం గ్రామ సచివాలయాలన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. సమయ పాలన పాటించాలని ప్రభుత్వ సర్వేలు అన్నీ పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న 709 రకాల సేవలను మన మిత్ర వాట్సాప్ 9552300009 నెంబర్ ద్వారా వివిధ శాఖలకు సంబంధించిన సేవలను పొందవచ్చన్నారు. అనంతరం యాప్‌ను ప్రజలు ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఇంటి తలుపులు పగులకొట్టిన దుండగులు

మద్దిపాడు,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం మల్లవరంలో ఉన్న సంతనూతలపాడు మాజీ ఎంఎల్‌ఏ టీజేఆర్ సుధాకర్ బాబు ఇంటి తలుపులను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి పగులకొట్టారు. వివరాల్లోకి వెళితే... ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో సుధాకర్ బాబు మల్లవరం గ్రామంలో ఇల్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం విజయవాడలో నివాసం ఉంటున్నారు.ఆ ఇంటికి కాపాలాగా ఓ వ్యక్తిని నియమించాడు. ఆ వ్యక్తి అనారోగ్య కారణంతో శుక్రవారం ఇంటివద్దనే ఉండిపోయాడు. ఇంటికి కాపలాలేని విషయాన్ని గుర్తించిన దుండగులు ఇంటి మెయిన్ తలుపులతో పాటు, లోపలి తలుపులను, గడియలను,తాళాలను గడ్డపారలతో పగులకొట్టారు. అయితే ఇంటిలో ఏమి దొంగతనం జరిగింది., దుండగులు ఏమి తీసుకువెళ్లారనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు వద్దసూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పైనం శ్రీనివాసరావు మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో దొంగతనం గురించి ఫిర్యాదు చేశారు.



దావగూడూరులో చెన్నకేశవస్వామి ఆలయ భూములకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

## ఆగిన చెన్నకేశవ స్వామి భూముల వేలం

● నేడు చెరువుమాన్యంకు పాట

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): దావగూడూరులోని శ్రీచెన్నకేశవస్వామి భూముల కౌలు వేలంపాటలు ఆలయ అధికారులు శనివారం నిర్వహించారు. అయితే గ్రామంలోని రైతులు వేలం పాడేందుకు ఆసక్తి చూపలేదు. గడచిన ఏడాది సరాసరి ఎకరానికి 13 వేల రూపాయలు వరకు రైతులు కౌలుకు వేలంలో పాడుకున్నారు. అయితే ఈ ఏడాది రైతులు కౌలు వేలంకు ముందుకు రాలేదు. ఆలయ ఆవరణలో ఈవో సాంబశివరావు ఆధ్వర్యంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది దావగూడూరు, తూమాడు, చిర్రికూరపాడు గ్రామాల పరిధిలో ఉన్న 294.26 సెంట్లకు వేలం పాట 92 ప్లాట్లుగా విభజించి నిర్వహించారు. అయితే రైతులు వచ్చేఏడాది సాగు చేసుకోవడానికి వేలం పాడలేదు. గడచిన ఏడాది తాలూకు కౌలు దాదాపు 10 లక్షల రూపాయలు శనివారం చెల్లించారు. మరో 15 లక్షల రూపాయల వరకు కౌలు బకాయిలు రైతుల నుంచి రావాల్సి ఉందని ఈవో తెలిపారు. కాగా ఆదివారం గ్రామానికి చెందిన చెరువు మాన్యం భూమి 26.45సెంట్లకు కౌలు వేల నిర్వహిస్తామన్నారు. గత ఏడాది ఈ పొలానికి ఎకరానికి సరాసరి కౌలు ధర పదివేల రూపాయలు వచ్చిందని, అంతకు తగ్గితే వేలంను రద్దు చేస్తామని ఈవో వివరించారు.



కొండపిలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

## ఎరువుల అమ్మకాలు నిలుపుదల

**రికార్డులు సరిగా నిర్వహించని ఎరువుల దుకాణదారులు**

**విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు**

కొండపి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి) :కొండపిలోని పలు దుకాణాల్లో రికార్డులు సరిగా నిర్వహించని కారణంగా ఎరువుల విక్రయాలను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ అధికారులు నిలిపివేయించారు. శనివారం కొండపిలోని రెండు ఎరువుల దుకాణాల రికార్డులను జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాఘవరావు, ఏవో శివనాగప్రసాద్ వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. కొండపిలోని వెంకట హనుమాన్ ట్రేడర్స్ షాప్‌లో నిల్వఉంచిన 12 మెట్రిక్ టన్నుల సూపర్‌పాస్పేట్‌ను ఈపాస్ మెషిన్‌లో నమోదు చేయకపోవడం వల్ల ఎరువుల విక్రయాలను నిలిపివేశారు. అదేవిధంగా వెంకట హనుమాన్ ఫెర్టిలైజర్స్ షాపులో 6.75 మెట్రిక్ టన్నుల 20:20:13 రకం ఎరువులకు సరైన ఫారం లేనందున విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎరువుల దుకాణదారులు ధరల పట్టికలను షాపుల్లో ప్రదర్శించాలని, ఎరువులు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని ఈసందర్భంగా ఏవో మాల్యాద్రి విజ్ఞప్తి చేశారు.

**మార్కాపురంలో..**

మార్కాపురం రూరల్ : పట్టణంలోని షణ్ముఖ ట్రేడర్స్‌లో జీరో పత్రాలు లేని 10-26-26 రకం 89 ఎరువుల బస్తాల అమ్మకాలను నిలిపివేసినట్లు వ్యవసాయాధికారి బుజ్జిబాయి శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులను అక్రమంగా నిల్వచేసి, అధిక ధరకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఉద్యోగ నియామక పత్రాలను అందుకున్న వారితో కలెక్టర్

## చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వసర్వీసులో చేరిన ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం 13 మందికి కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఆడిట్, రెవెన్యూ, పరిశ్రమలు, రిజిస్ట్రేషన్, కార్మికశాఖల్లో వీరిని నియమించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధుల నిర్వహణలో నైపుణ్యంపెంచుకొని ఉన్నత స్థానానికి చేరుకొనేలా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రవికుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

## 12న పరుగు పందెం పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాఎయిడ్స్ నియంత్రణ విభాగం, వైద్య ఆరోగ్యశాఖ, స్పోర్ట్స్ అథారిటీ, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 12వతేదీన ఒంగోలులో ఐదు కిలోమీటర్లపరుగు పందెం నిర్వహించనున్నారు. ఈపోటీలను విద్యార్థినీ విద్యార్థులకు, ట్రాన్స్ జెండర్ విభాగాలకు వేర్వేరుగా నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులు, ట్రాన్స్ జెండర్‌లు ఈనెల 10వతేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఆసక్తికలిగిన విద్యార్థులు కాలేజీ ఐడీతో పాటు హాజరు కావాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్‌ను 9493554212 నెంబర్‌కు కాల్‌చేసి నమోదు చేసుకోవాలి. ఈ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి కింద రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ.7వేలు ఇవ్వనున్నారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులవుతారు.

# గండి చెరువుకు లీకులు

**వృథాగా పోతున్న వరద నీరు**

**ఆందోళనలో రైతులు**

పెద్దదోర్నాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వర్షించే ప్రతి నీటి బిందువును ఒడిసి పట్టి తద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయి.కాని అధికారుల అలసత్వం కారణంగా ఉన్న నీటి వనరుల సంరక్షణ చేపట్టక పోవడంతో తీరా వర్షాలు కురిశాక ఆ నీటిని నిలువ చేసుకునే అవకాశం లేక వృథాగా పోతున్నాయి. అసలే పశ్చిమ ప్రాంతం వర్షాధారంపై ఆధారపడి సేద్యం చేయాలి. పైగా అరకొర వానలు కురుస్తున్నాయి. ఈ ప్రాంతానికి అంది వచ్చిన వరం నల్లమల అటవీ ప్రాంతం. ఎగువ భాగాన కురిసిన భారీ వర్షానికి ఎగువ చెర్లోపల్లి, గంటవానిపల్లె చెరువులు నిండుకుండలా మారగా, పెద్ద బొమ్మలాపురం గండి చెరువుకు 90శాతం నీరు చేరింది. రైతులు ఎంతో సంబర పడ్డారు. ఇక్కడ వర్షాలు సరిగ్గా కురవకపోయినా బోరుబావుల్లో సమృద్ధిగా నీరు లభిస్తుందనే ఆశతో సాగుకు పూనుకున్నారు. కానీ చెరువుకు లీకేజీ ద్వారా వరద నీరు కాస్తా వృథాగా పోతోందని తెలిసి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో చెరువుల అభివృద్ధి చేసి ఉంటే వరదనీరు సంరక్షణ జరిగేది. ఇప్పుడు లీకేజీని ఎలా అరికడతారని రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోనే అతి పెద్ది గండిచెరువు. ఈ చెరువు కింద సుమారు 800 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. అయినా సాగు కాలువలు లేవు. ఈ చెరువుకే కాదు మండలంలోని ఏ చెరువుకు సాగు కాలువలు, తూములు లేవు. కాకపోతే నీటిని నిలువరించ గలిగితే చాలు బోరు బావుల్లో పుష్కలంగా నీరు లభిస్తుందనే భావన రైతుల్లో నెలకొంది. కానీ గండి చెరువుకు ఏర్పడిన లీకేజీ కాస్తా పెద్దదై గండిగా మారితేనే ప్రమాదం. ఉన్న నీరు మొత్తం నేల పాలవుతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని లీకేజీలు పూడ్చాలని కోరుతున్నారు.





పెద్ద బొమ్మలాపురం గండి చెరువు (చెరువు లీకేజీల ద్వారా వృథాగా పోతోన్న వరదనీరు)



# ముమ్మరంగా వరినాట్లు

**సాగర్ కాలువల్లో పుష్కలంగా నీరు - ఈఏడాది పెరగనున్న విస్తీర్ణం**





కళకళలాడుతున్న లేత వరిపైరు (ఇన్‌సెట్లో) దర్శిలో సాగుతున్న వరినాట్లు

దర్శి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో ముమ్మరంగా వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది శ్రీశైలం, సాగర్ జలాశయాలు ముందుగానే నిండటంతో సాగుకు పుష్కలంగా నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. గత నెలలోనే జలాశయాలకు నిండుగా నీరు చేరటంతో బోర్ల వసతి ఉన్న రైతులు సాగునీరు ఖచ్చితంగా వస్తాయనే నమ్మకంతో ముందుగానే వరి నారు పోశారు. వరదల సమయంలో నెలరోజుల క్రితమే సాగర్ కాలువలకు నీరు విడుదల చేయటంతో వరినాట్లు వేశారు. మధ్యలో కొన్ని రోజులు తాత్కాలికంగా నిలుపుదల చేసినా ఆగస్టు చివరి వారంలో మళ్లీ నీరు విడుదల చేశారు. ప్రస్తుతం అన్నీ కాలువలకు పుష్కలంగా నీరు సరఫరా అవుతుండటంతో ఆయకట్టు భూముల్లో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. చివరి భూముల రైతులు ప్రస్తుతం దమ్ముచేసి వరి సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది వరి సాగు పెరిగింది. ఖరీఫ్‌లో సక్రమంగా వర్షాలు లేకపోవటంతో సాగర్ ఆయకట్టు భూముల్లో ఎలాంటి పైర్లు వేయలేదు. సాధారణంగా ప్రతి ఏడాది ఖరీఫ్‌లో పెసర పైర్లు వేస్తారు. సాగర్ జలాలు వచ్చిన తర్వాత నార్లు పోసి వరినాట్లు వేసే సమయానికి పెసర పంట కోతకు వస్తుంది. కాయలు కోసుకొని ఆకులు దమ్ములు చేసి వరినాట్లు వేస్తారు. ఈఏడాది పెసర సాగు చేయకపోవటంతో ఆయకట్టు భూములు మొన్నటి వరకు ఖాళీగా ఉన్నాయి. సాగునీరు రాగానే రైతులు అన్నీ ప్రాంతాల్లో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు.

దర్శి నియోజకవర్గంలో సుమారు 50వేల ఎకరాల్లో వరిసాగు అవుతుందని అంచనా. కొంతమంది చివరి భూముల్లో మొక్కజొన్న, మంచి శనగ తదితర పైర్లు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వరుణదేవుడు కరుణించక రైతులు ఆందోళనలు చెందినప్పటికీ ఆ తర్వాత పుష్కలంగా వర్షాలు కురవటం, జలాశయాలు పూర్తిగా నిండటంతో పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం రైతులు ముమ్మరంగా పైర్ల సాగులో నిమగ్నమయ్యారు. సాగునీరు లేని మెట్ట భూముల్లో పొగాకు, మిర్చి పైర్ల సాగుకు సిద్ధమవుతున్నారు.



కొత్తపట్నం తీరంలో నిమజ్జనానికి తరలివస్తున్న గణనాథులు



ఎర్రగొండపాలెంలో నిమజ్జనానికి తరలుతున్న భారీ విశ్వరూప వినాయకుడు

# గణపయ్యా.. ఇక సెలవయ్యా..

కొత్తపట్నం తీరం శనివారం సందడిగా మారింది. చివరి రోజున వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలకు గ్రామోత్సవం నిర్వహించి మేళతాళాలతో నిమజ్జనం కోసం తరలించారు. విగ్రహాల వెంట భక్తులు భారీగా రావడంతో ఒంగోలు - కొత్తపట్నం రహదారి కోలాహలంగా మారింది. అలాగే జిల్లాలోని మిగతా ప్రాంతాల్లోనూ గణపయ్యలను ఉత్సాహ పూరిత వాతావరణంలో నిమజ్జనం గావించారు. ఎర్రగొండపాలెంలోని భారీ విశ్వరూప వినాయకుడిని డప్పువాయిద్యాల నడుమ బాణసంచా కాలుస్తూ నిమజ్జనానికి తరలించారు. ఈసందర్భంగా వినాయకుడి లడ్డూను వేలంలో భక్తుడు లక్షరూపాయలకు పాడి సొంతం చేసుకున్నాడు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు









కొత్తపట్నం తీరంలో గంగమ్మఒడిలోకి గణేషుడు

ఎన్టీఆర్‌బొమ్మతో ఒంగోలు కమ్మపాలెంలోని వినాయకుడికి గ్రామోత్సవం



ప్రత్యేక అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేత వరాహలక్ష్మీనరసింహస్వామి

# వైభవంగా పవిత్రోత్సవాలు

సింగరాయకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రెండోవరోజు స్వామివారికి పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్ వరాహ లక్ష్మీనరసింహస్వామి, ఉభయ దేవేరులు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఆకల్మషహోమం, ప్రధానహోమం, నిత్యహోమం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కృష్ణవేణి, రికార్డు అసిస్టెంట్ బాపట్ల బ్రహ్మయ్య, ప్రధాన అర్చకులు ఉదిగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, నరసింహాచార్యులు, సుదర్శనాచార్యులు పాల్గొన్నారు. కాగా నేడు ఉదయం స్వామివారికి పవిత్ర సమర్పణ కార్యక్రమం జరుగుతుంది. చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 1గంట నుంచి ఆలయం మూసివేసి సోమవారం ఉదయం తెరుస్తామని ఈవో తెలిపారు.

## ఘనంగా జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పులికొండ గ్రామంలో క్రిస్టియన్‌పాలెంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. తదుపరి జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విగ్రహ ప్రదాత రావి బాలకృష్ణ, ఎంఆర్‌పీఎస్ నాయకులు బొంతా ఏసుదాసు, బిల్లలమర్రి, తిరుమలశెట్టి ఆనందమోహన్, టీడీపీ నాయకులు మస్తాన ప్రసాద్, గొట్టిపాటి రామకృష్ణ, కూనంనేని లోకేష్, మదివర్తి రాఘవ లక్ష్మమూర్తి, రావిపాటి రాంబాబు, మన్నం శేషయ్య, బెల్లం కోటేశ్వరరావు, ఎంఆర్‌పీఎస్ చీమకుర్తి మండల అధ్యక్షుడు జడ విజయ్‌కుమార్, కార్యదర్శి బుట్టి స్యాల్సన్, ఏటుకూరి జక్రయ్య, వంశీ, ఎంఎస్‌ఎఫ్, ఎంఈఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి తరలిన గణనాథులు


నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ సుచిత్ర, నాయకులు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన స్వామివారి విగ్రహాలను నవరాత్రి వేడుకలు అనంతరం శనివారం సంబరాలు చేసుకుంటూ నిమజ్జనానికి తరలించారు. పోతవరంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు నార్నె శరత్‌బాబు, తెలుగుయువత, ఎన్‌డీఏ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిమజ్జన వేడుకల్లో చవటపాలెం ఎంపీటీసీ ముప్పవరపు సుచిత్ర, టీడీపీ మండలాధ్యక్షుడు తేళ్ల మనోజ్ కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి ఉడవ వెంకటకృష్ణారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నాగులుప్పలపాడు నుంచి పోతవరం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీజే పాటలతో కోలాహలంగా కనపర్తి బీచ్‌లో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు దసరా కానుకగా పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ప్రకటించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు. పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు, ఉద్యోగ విరమణచేసిన ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ బకాయిలను దసరా కానుకగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## నేడు అపుస్మా అవార్డుల ప్రదానం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం ఒంగోలులోని ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో జరుగుతుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లా మాధవరావు, జీవీ.మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, నగర మేయర్ గంగాడ సుజాతలు హాజరవుతారని వారు పేర్కొన్నారు.

## పేస్‌లో మ్యాట్‌ల్యాబ్స్‌పై సదస్సు


అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శనివారం మ్యాట్‌ల్యాబ్స్‌పై ప్రత్యేక సాంకేతిక వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన డీఆర్‌డీవో శాస్త్రవేత్త పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ రక్షణ రంగంలో జరుగుతున్న ఆధునిక పరిశోధనలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానం, సాధిస్తున్న విజయాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన పరిశోధన ప్రాజెక్టులు, నూతన ఆవిష్కరణలు ఉన్నత అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్లు సీవీ.సుబ్బారావు, ఆర్.వీరాంజనేయులు, విభాగాధిపతి బి.నాగరాజు, ట్రెజరర్ విజయ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏపీజేఏసీ అమరావతి ఆవిర్భావ దినోత్సవం


కేకును కట్ చేస్తున్న డీఆర్వో చిన ఓబులేశు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ అమరావతి (మహిళా విభాగం) ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో ఛాంబర్‌లో అమరావతి ఆవిర్భావ దినోత్సవ కేకును జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేశు కట్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు మీనా, హారిత, మేరీ, లక్ష్మీబాయి, జిల్లా ఛైర్మన్ మధుసూదనరావు, మహిళా విభాగం కార్యదర్శి శ్రీదేవి, ఏపీఆర్‌ఎస్‌ఏ కోశాధికారి ఊతకోలు శ్రీనివాసరావు, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు బి.సాయిశ్రీనివాసరావు, సభ్యులు వైష్ణవి, తిరుపతమ్మ, అనంతలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం నాయకులు నివాళి

మద్దిపాడు, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): కేవీపీఎస్ మండలాధ్యక్షుడు, సీపీఎం నాయకుడు కాకుమాను సుబ్బారావు భార్య కోటేశ్వరమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మద్దిపాడులోని సుబ్బారావు నివాసంలో ఆమె మృతదేహానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు, గ్రామ కమిటీ సభ్యుడు జాలా అంజయ్య నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు కాలం సుబ్బారావు, వి.రమేష్, ఆదిలక్ష్మి, కనపర్తి సుబ్బారావు, వెంకటేశ్వరరావు, కాశీ, టీడీపీ మండలాధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, రమ, నాపులూరి శివకృష్ణ, నరసింహారావు పాల్గొన్నారు.

## బ్యాంకు రుణాలపై అవగాహన

సంతనూతలపాడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పెట్టుబడి పారిశ్రామిక వేత్తలు లోన్ కోసం బ్యాంకుల వద్దకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా ఉండవలసిన సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకునివెళ్లాలని పరిశ్రమలశాఖ జీఎం బత్తుల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో సంతనూతలపాడులో ఉద్యమ పేరుతో వర్క్‌షాపు నిర్వహించి రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.విజయ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్, అధికారులు, టైలరింగ్ శిక్షణ మహిళలు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అర్బన్ ప్రైమరీ సెంటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఒంగోలులో జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు తాతారావు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడుగా కె.హనుమంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్.సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.అరుణకుమారి, ట్రెజరర్‌గా బాజీవలి, జనరల్ సెక్రటరీగా కె.సురేంద్రబాబు, ఉపాధ్యక్షులుగా జీ.శ్రీనివాసరావు, కె.నిర్మలకుమారి, ఎ.వాసవి, కార్యదర్శులుగా పి.సుభాషిణి, జి.రామారావు, కోట్రెజరర్‌గా సీహెచ్.అంజనేయులను ఎన్నుకున్నారు.

# పిల్లలతో పనులా..!

- ఒంగోలులోని ఓ ప్రభుత్వ పాఠశాలలో టీచర్ నిర్వాకం
- విచారణకు డీఈవో ఆదేశం


కుర్చీలు బయటకు మోస్తున్న విద్యార్థులు


చొక్కా లేకుండా పని చేస్తున్న విద్యార్థి

గురువుల గొప్పతనం చాటుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వారిని గౌరవించుకుని 24 గంటలు కూడా కాకముందే ఓ ఉపాధ్యాయురాలు విద్యార్థుల పట్ల చూపిన కాఠిన్యం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను చొక్కాలు తీయించి మరీ పాఠశాల పనులు చేపట్టిన ఉపాధ్యాయురాలి నిర్వాకంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు నగరం వెంకటేశ్వరకాలనీలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం నాణ్యమైన విద్యాబోధనతో పాటు పాఠశాలల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తుంది. కానీ ఒంగోలులోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు మాత్రం విద్యార్థిని, విద్యార్థులతో మరుగుదొడ్లు శుభ్రం చేయించి, బెంచీలు తుడిపించి, పాఠశాలను కడిగించేశారు. దాంతోపాటు గోడలకు బూజు దులిపే బాధ్యతలను అప్పగించారు. శనివారం స్కూలు సమయంలో పాఠాలు చెప్పకుండా పిల్లలచేత పారిశుధ్య పనులు చేయించారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయురాలు, పిల్లలను కూలీలుగా మార్చడంపై పలువురు జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వెంకటేశ్వర కాలనీలోని పాఠశాలలో జరిగిన పరిణామాలపై ఎంఈవో-2ను విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. ఎంతవో నివేదికలో వాస్తవమని తేలితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి శాఖాపరంగా చర్యలు తీసుకోనున్నట్లు డీఈవో వెల్లడించారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

# సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- వామపక్ష నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టారిఫ్‌ల పేరుతో ఆర్థిక విధ్వంసం సృష్టిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచదేశాలపై విధించిన టారిఫ్ సుంకాలను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఒంగోలు నగరం సౌత్‌బైపాస్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ అమెరికా టారిఫ్‌ల వల్ల భారత దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆక్వా రంగంతో పాటు ఇతర ఆహార ఉత్పత్తులు, వస్త్రాల ఎగుమతులు నిలిచిపోయి రైతులు, పారిశ్రామికవేత్తలు తీవ్ర సంక్షోభంలో పడుతున్నారని చెప్పారు. ఆయిల్ దిగుమతిపై ట్రంప్ ఆంక్షలు, బెదిరింపులకు కూడా ప్రధాని మోదీ నోరుమెదపకపోవడం సిగ్గుచేటన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు మాట్లాడుతూ ఆర్థిక విధానాల వల్ల దేశంలో అనేక పరిశ్రమలు మూతపడే దశలో ఉన్నాయన్నారు. ఆక్వారంగంలో ఒక కంటైనర్ రొయ్యల ఎగుమతులపై రూ.1.20కోట్లు సుంకాన్ని రూ.1.80 కోట్లకు పెంచడంతో ఎగుమతులు నిలిచిపోయాయని, దీంతో ఆక్వా రంగంలో తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చీకటి శ్రీనివాసరావు, పద్మ, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎస్.లలితకుమారి, సీహెచ్.సాగర్, జీవీ.కొండారెడ్డి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కాలం సుబ్బారావు, బాలకోటయ్య, రమాదేవి, కేఎఫ్.బాబు, వినోద్, శ్రీరామ్ శ్రీనివాసులు, ఎల్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# చదువు లేని మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- ఎంపీపీ అంజమ్మ


మాట్లాడుతున్న ఎంపీపీ అంజమ్మ

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చదువులేని మహిళల జీవితాల్లో అక్షరజ్ఞానం పెంపొందించేందుకు ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఎంపీపీ నంబూరు అంజమ్మ పేర్కొన్నారు. శనివారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా గ్రూపు స్వచ్ఛంద బోధకులకు అక్షర ఆంధ్ర కార్యక్రమంపై ఒకరోజు శిక్షణ ను ఏపీఎం నరేంద్రకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ అంజమ్మ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల్లోని అక్షరాస్యులైన మహిళలు నిరక్షరాస్య మహిళలకు చదువు చెప్పించడం ద్వారా ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛంద బోధకులుగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో సంపూర్ణ అక్షరాస్యత దిశగా కృషి చేయాలని సూచించారు. డీఎల్‌డీవో సువర్ణ మాట్లాడుతూ అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని నిరక్షరాస్య మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వయోజన విద్య పర్యవేక్షకులు పోతురాజు మాట్లాడుతూ మండల పరిధిలోని 2,917 మంది నిరక్షరాస్య మహిళలకు అక్షర జ్ఞానం పెంపొందించాలని తెలిపారు. ఉపాధి పథకంలోని శ్రమశక్తి సంఘాలలో గల 425 మంది పురుషులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా నిర్ణయించినట్లు చెప్పారు. అక్షర ఆంధ్ర కేంద్రాలు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు నిర్వహించాలని కోరారు. ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో మహిళలు మోసపోకుండా ఉండాలంటే అక్షర ఆంధ్ర కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. అనంతరం వర్క్‌బుక్స్ వాచక పుస్తకాలను శిక్షకులకు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో టి.రవి తదితరులు పాల్గొన్నారు.

# దర్శిలో సీఐటీయూ జిల్లా మహాసభలు

- నవంబరు 7నుంచి ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దర్శిలో నవంబరు 7వతేదీ నుంచి మూడు రోజుల పాటు సీఐటీయూ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం మహాసభల కరపత్రాలను జిల్లా ప్రధానకార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎంఏ.సాలార్, జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, జి.శ్రీనివాసులు, పి.కల్పన, టి.మహేష్, రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌గా తీసుకురావడం దుర్మార్గంగా ఉందన్నారు. ఈ మహాసభలకు కార్మికులు తరలిరావాలని కోరారు.

### నగర సమన్వయ కమిటీ ఏకగ్రీవం

సీఐటీయూ ఒంగోలు నగర నూతన సమన్వయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా టి.మహేష్, కో కన్వీనర్‌గా వెంకటేశ్వరరావు, సభ్యులుగా చీకటి శ్రీనివాసరావు, సీహెచ్.రాంబాబు, జి.రమేష్, తంగి శ్రీనివాసరావు, ఎస్‌డీ.హుస్సేన్, దామా శ్రీనివాసులు, యు.పాలిబాబు, కె.శ్రీనివాసరావు, కె.వీమియా, విజయమ్మ, రత్నకుమారితో పాటు పలువురిని ఎన్నుకున్నారు. మహాసభలో చేసిన తీర్మానాలను విడుదల చేశారు. నగరంలో ఈఎస్ఐ హాస్పటల్‌లో వంద పడకలు, కనీస సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఆటో స్టాండులు ఏర్పాటు చేయాలని, ఉచిత బస్సు వల్ల ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిన్నందున వారిని ఆదుకోవాలని కోరారు.

# పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలి

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీని నియమించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. స్థానిక సర్వశిక్ష కార్యాలయంలో శనివారం టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక బకాయిలు విడుదల చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని కోరారు. పీఆర్సీ కమిటీని ప్రకటించి వెంటనే ఐఆర్‌ను ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వంలో ఆయా సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఆశించామని, కానీ ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. కార్యక్రమంలో సర్వశిక్ష సూపరింటెండెంట్ వి.వెంకటేశ్వర్లు, గౌరి, హరికృష్ణ, చైతన్య, రవి, పట్టణ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, తాలూకా అధ్యక్షుడు సురేష్, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రభాకర్, ఏసురత్నం, రంగారెడ్డి, శివశంకర్, గిరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# క్విస్ విద్యార్థులకు అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హనుమంతరావు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు అంతర్జాతీయ కంపెనీలో ఇంటర్న్‌షిప్ లభించింది. యూకేకు చెందిన ప్రముఖ కార్పొరేట్ యూనివర్సిటీలో క్విస్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించనుంది. ఇప్పటికే మొదటి బ్యాచ్ 30మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్లు పొందారు. శుక్రవారం నుంచి రెండో బ్యాచ్ శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణలో 33మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో 45రోజుల పాటు అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్‌లో ఇంటర్న్‌షిప్ చేయనున్నట్లు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. కార్పొరేట్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రాజారామచంద్రన్ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను బోధించనున్నారు. ఇంటర్న్‌షిప్ ప్రారంభ కార్యక్రమాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ జానకిరామ్, డీపీఎస్ ప్రిన్సిపాల్ వైవీ.సుబ్బారావు, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, డీన్ సత్యకుమార్, సీఎస్‌ఈ విభాగాధిపతి బుజ్జిబాబు, జి.లక్ష్మీవరప్రసాద్, సెంథిల్ పాల్గొన్నారు.

## 12న జడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 12వ తేదీ ఉదయం పదిన్నరగంటలకు స్థానిక పాత జిల్లాపరిషత్ సమావేశపు హాలులో జరుగుతుందని జడ్పీ సీఈవో చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులందరూ పాల్గొంటారన్నారు. అధికారులందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.

## పౌష్టికాహార వారోత్సవాలు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార వారోత్సవాలను మండలంలోని మాచవరం, రాపర్ల గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు ఉష, అన్నపూర్ణ ప్రమీల మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులలో రక్తహీనత నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ శాసనమండలి సభ్యుడు దామారి రామిరెడ్డి స్మారక రెగ్యులర్ ఉచిత మెడికల్ క్యాంపు ఆదివారం ఒంగోలులోని టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా నెలకు ఒకసారి జరిగే ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఫిట్స్, పక్షవాతం కలిగిన రోగులకు అవసరమైన మందులను కేవలం రూ.200లకు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## పొగాకు సాగును నియంత్రించాలి


రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగును రైతులు నియంత్రించాలని టంగుటూరు వేలం కేంద్రం సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాసరావు కోరారు. బోర్డు అనుమతించిన విస్తీర్ణంలో మాత్రమే సాగు చేయాలని సూచించారు. శనివారం ఆయన ఎనిమిదిమంది రైతులతో సమావేశమయ్యారు. వాణిజ్య పద్ధతిలో నాణ్యత పెంచుకొని, సాగు నియంత్రణపై అవగాహన కల్పించారు. రైతులు నాణ్యమైన నారును వాడాలని, కొనుగోలు రోజులను తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో క్షేత్రఅధికారి ఉపేంద్ర పాల్గొన్నారు.

## నువ్వులు క్వింటా రూ.10,500

కొండపి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన నువ్వు పంట చేతికి వచ్చింది. ఎకరాకు దాదాపు రెండు నుంచి మూడు క్వింటాళ్ల వరకు దిగుబడి లభిస్తోంది. ప్రస్తుతం క్వింటా రూ.10,500 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. నువ్వు సాగుకు పెట్టుబడి తక్కువగా ఉండటంతో ఎకరాకు దాదాపు రూ.10వేల నుంచి రూ.15 వేల ఆదాయం వస్తున్నదని రైతులు చెప్తున్నారు. పొగాకు సాగుకు అవసరమైన పెట్టుబడులకు ఈ డబ్బులు కొంతవరకు ఉపయోగపడతాయని అంటున్నారు.

## సింగరాయకొండ తహసీల్దార్‌గా రాజేష్

సింగరాయకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరాయకొండ తహసీల్దార్‌గా ఎన్.వెంకట బార్గవ రాజేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్‌ఐ వి.ప్రసాద్, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## 9నుంచి అదనపు పొగాకు కొనుగోళ్లు

ఒంగోలు ఎన్‌పీబీఎస్(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో ఈనెల 9వ తేదీ నుంచి అదనపు పొగాకు ఉత్పత్తిని కొనుగోలు చేస్తున్నట్లు నిర్వహణాధికారి జె.తులసి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పొగాకు బ్యారన్ కోటాలో 10శాతం వరకు ఎలాంటి పెనాల్టీలు, సర్వీస్ ఛార్జీలు వసూలు చేయటం లేదన్నారు. బ్యారన్ కోటాలో 10-20శాతం వరకు పెనాల్టీ కిలోకు రూ.1 చొప్పున, సర్వీస్ ఛార్జీలు అమ్మకాల విలువపై 2 శాతం వసూలు చేస్తామన్నారు. 20 శాతం పొగాకు అమ్మకాలు దాటితే పెనాల్టీ కిలోకు రూ.1తోపాటు సర్వీస్ చార్జీలు అమ్మకాల విలువపై 3శాతం వసూలు ఉంటుందని పేర్కొన్నారు. కాగా 9వ తేదీన సర్వేరెడ్డిపాలెం, కె.మామిడిపాలెం, దేవరకొండ, పెరుంకొమ్ముపాలెం, వెంగముక్కపాలెం, యరజర్ల, పోతవరం గ్రామాల రైతులు బ్యారన్‌కు 5 బేళ్లు వేలానికి తీసుకురావాలని కోరారు. 10న ప్రాంగులపాడు, అన్నంగి లూరివారిపాలెం, ఉప్పుగుండూరు, కేశవనేనివారిపాలెం, ఒంగోలు, కొప్పోలు, చదలవాడ, సూరారెడ్డిపాలెం, గుత్తికొండవారిపాలెం గ్రామాల రైతులు తమ బేళ్ల వేలానికి తీసుకురావాలని కోరారు.

## పబ్లిక్ నోటీసు

ఇందు మూలముగా యావన్మందికి నా క్లయింట్ గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, కొప్పర్రు గ్రామ వాస్తవ్యులు నామిని సుబ్బయ్య కుమారుడు సత్యనారాయణ ఇచ్చిన సంజాయిషీ మేర ఈ నోటీసు యివ్వడమైనది.

నా క్లయింట్ కు సంబంధించిన క్రింది షెడ్యూలులోని ఒరిజినల్ రిజిస్టర్ దస్తావేజు తేది.5-9-2025 న ఒంగోలు భాగ్యనగర్ లోని తన బంధువుల ఇంటి నుండి తిరిగి బస్టాండ్ కు వెళ్ళు దారిలో ఎక్కడో పోయినవి. ఇప్పటి వరకు ఎంత వెతికినా దొరకలేదు. కావున ఎవరికైనా దొరికిన యెడల క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

దస్తావేజుల వివరములు: కనిగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

1. తేది: 20-3-1995, దస్తావేజు నెం.748/95
2. తేది: 20-3-1995, దస్తావేజు నెం.743/95
3. తేది: 31-3-1995, దస్తావేజు నెం. 1318/95

ఇట్లు: యంగం మౌనిక, బి.ఎ.బి.ఎల్, అడ్వకేట్, ఒంగోలు. సెల్: 81068 68564



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఈ భీమా నాయక్

## విద్యుత్ శాఖ ఏఈగా భీమానాయక్ బాధ్యతలు

పెద్దదోర్నాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల నూతన విద్యుత్ శాఖ ఏఈగా బోడా భీమా నాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఏఈగా తర్లుపాడు మండల అధికారి హనుమా నాయక్ ఇన్‌చార్జిగా పని చేశారు. బదిలీలో భాగంగా చీరాలలో పని చేస్తున్న భీమానాయక్ దోర్నాలకు వచ్చారు. క్రమంలో ఎల్ఐ ఉస్మాన్‌బాషా, సిబ్బంది, టీడీపీ సీనియర్ నాయకుడు దొడ్డా శేషాద్రి ఆయనకు శుభాకాంక్షలు తెలియ జేశారు.






చినబస్టాండ్ - ఒంగోలు రోడ్డులో ఉన్న ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్.. ఆక్రమణలు తొలగించిన తరువాత ఇలా

# పొదిలిలో ఆక్రమణల తొలగింపు

- దుకాణాల ముందు చర్యలు చేపట్టిన నగర పంచాయతీ సిబ్బంది
- అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి విజ్ఞప్తి

పొదిలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణ అభివృద్ధిలో భాగంగా పొదిలి చిన్నబస్టాండ్ నుంచి ఒంగోలు వెళ్లే రోడ్డులో ఇరువైపులా దుకాణాల ముందు ఆక్రమణలను నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో తొలగింపు చర్యలు చేపట్టారు. పెరిగిన ట్రాఫిక్ సమస్యను అధికమించేందకు శనివారం చర్యలు చేపట్టినట్లు ఆయన చెప్పారు. దుకాణ యజమానులు సొంత స్థలంలో కాకుండా రహదారి స్థలంలో కట్టడాలు నిర్మించి ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. అలా చేయని పక్షంలో నగరపంచాయతీ సిబ్బంది తొలగిస్తారని తెలిపారు. రెండునెలలుగా అక్రమ కటడాలను తొలగించాలని నోటీసులు ఇచ్చిన స్పందన లేకపోవడంతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తొలగించుకుంటే నష్టం లేకుండా ఉంటుందన్నారు. పట్టణంలో పెద్దబస్టాండ్, చిన్నబస్టాండ్ సెంటర్ల వద్ద ప్రయాణికులు నిలబడేందుకు కూడా స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది గ్రహించిన కమిషనర్ పెద్దబస్టాండ్ సెంటర్లో వాటిని తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక షెల్టర్‌ను ఏర్పాట్లు చెప్పారు. తాజాగా చిన్నబస్టాండ్ సెంటర్లో కూడా బస్‌షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగర పంచాయతీ తీసుకునే నిర్ణయాలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్యవైశ్య నాయకులు

## పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుపై హర్షం

బేస్తవారపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అమరావతి మహానగరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం ఏర్పాటు, స్మృతి వనం శంకుస్థాపన ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమైందని ఆర్యవైశ్య సంఘం నాయకులు అన్నారు. శనివారం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సమావేశమయ్యారు. పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు కోసం 6.8 ఎకరాల భూమిని కేటాయించడం ఆర్యవైశ్య జాతి గర్వించదగిన విషయమన్నారు. అందుకు సహకరించిన కార్పొరేషన్ అధ్యక్షుడు డూండి రాకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు బీసు అరుణ్ కుమార్, సెక్రటరీ చిరంజీవి, ఆలయ శాశ్వత ధర్మకర్త బొంతల లక్ష్మణ్ గుప్తా స్వామి, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు కాస్మెటిక్ వస్తువుల పంపిణీ

తర్లుపాడు, సెప్టంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతన్న విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ హైదరాబాద్ వారి సహకారంతో గోల్డెన్ స్టార్ అవార్డులను విద్యార్థులకు అందజేశారు. ప్రతి తరగతిలో మంచి మార్కులు సాధిస్తున్న విద్యార్థులకు కాస్మెటిక్ వస్తువులను అందజేశారు. పాఠశాలలో మొత్తం 50 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుధాకర్ మాట్లాడుతూ.. బిగ్ హెల్ప్ సహకారాన్ని విద్యార్థులు వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ చాంద్ బాషాను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## నాగుపాము కలకలం

గిద్దలూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నరసింహ స్వామి దేవాలయం మెట్ల వీధిలో నాగుపాము కలకలం సృష్టించింది. ఈవీధిలో ఇంటి మెట్ల సమీపంలో 7 అడుగుల పొడవైన నాగుపాము కనిపించడంతో ఇంటి యజమాని భయభ్రాంతులకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అటవీ శాఖ రెస్క్యూ టీం సభ్యులు ప్రసాద్, మౌళాలి అక్కడకు చేరుకుని చాకచక్యంగా నాగుపామును పట్టుకుని నల్లమల అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. దాంతో ఆప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## అక్షరాంధ్ర శిక్షణ తరగతులు




సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో రంగనాయకులు

బేస్తవారపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలంలోని స్త్రీ శక్తి భవనంలో వెలుగు డీఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో ఎ.రంగనాయకులు ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షరాంధ్ర శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో బేస్తవారపేట, నేకునాంబాద్, చెట్టిచెర్ల గ్రామాలకు చెందిన వలంటరీ టీచర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య పర్యవేక్షకుడు రవీంద్రారెడ్డి వివరించారు. ఏపీవో కాకర్ల కుమార్, ఏపీఎం రఘునాథబాబు, సీసీలు సీహెచ్ గంగాధరరావు, బీ అబ్రహం, కె.కల్యాణి, మహిళా సమాఖ్య మహిళలు పాల్గొన్నారు.

## అంబులెన్స్ ఢీకొని వ్యక్తికి గాయాలు

పెద్దారవీడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు అంబులెన్స్ ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని దేవరాజుగట్టులో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దారవీడుకు చెందిన వేశపోగు సాల్మన్ విద్యుత్ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా కరెంటు బిల్లులు తీస్తుంటారు. దేవరాజుగట్టులో బిల్లులు తీసేందుకు శనివారం వెళ్తుండగా పోలీస్‌స్టేషన్ సమీపంలో మార్కాపురం నుంచి దోర్నాల వైపునకు వెళ్తున్న అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాల్మన్ తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు 108లో మార్కాపురం ప్రభుత్వ జన వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తరలించారు. ఎస్సై సాంబశివయ్య పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రంప్ టారిఫ్‌ల పెంపుపై నిరసన

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల పెంపుపై శనివారం సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. కిష్టగౌడ్ మాట్లాడుతూ భారత్ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50శాతానికి పెంచుతూ ట్రంప్ ప్రకటన చేయడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపారు.

## వ్యాధులపై అప్రమత్తం

రాచర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సీజన్‌లో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అనుములవీడు ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ కే రమేష్ విద్యార్థులకు సూచించారు. అనుములవీడు బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు శనివారం ఆయన ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి వ్యాధులపట్ల అవగాహన కల్పించారు. ముందుగా విద్యార్థులందరికీ పరీక్షలు నిర్వహించి జలుబు, దగ్గు, జ్వరాలు ఉన్న విద్యార్థులకు అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వై రంగనాయకులు, ప్రసాద్, రామాంజనేయులు, షమీం రిబ్కా, వార్డెన్ మురళి, ఆశా వర్కర్లు కుమారి, విజయకుమారి పాల్గొన్నారు.

## క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించిన ఎస్ఐ

బేస్తవారపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం - అమరావతి జాతీయ రహదారిలోని బేస్తవారపేట పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఒందుట్ల గ్రామానికి చెందిన షేక్ నాగూర్ మీరావలి, బేస్తవారపేట బీసీ కాలనీకి చెందిన కత్తి వేణుగోపాల్ ప్రమాదానికి గురయ్యారు. వీరిలో వేణుగోపాల్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్పృహ కోల్పోయారు. ఇది గమనించిన ఎస్ఐ రవీంద్రారెడ్డి స్పందించి పోలీస్ వాహనంలో క్షతగాత్రుడిని కంభం వైద్యశాలకు తరలించారు. సకాలంలో సేవలందడంతో ఆయన ప్రాణాపాయం నుంచి గట్టెక్కారు. ఎస్ఐని పలువురు అభినందించారు.

## పత్తికి రసం పీల్చే పురుగులు

గిద్దలూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పత్తికి రసం పీల్చే పురుగులు తామర పురుగు, పేనుబంక, పిండినల్లి, తెల్లదోమ, పచ్చదోమలు ఆశిస్తున్నట్లు గుర్తించినట్లు వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చి పంటలకు నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. వీటి నివారణకు ఎకరాకు 10 నుంచి 15 చొప్పున పసుపు లేదా బ్లూ రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలని సూచించారు. అసిటామిప్రైడ్ 100 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 100 ఎంఎల్ లేదా థమోమితాక్సిన్ 100 గ్రాములు ఎకరాకు పిచికారి చేసినట్లయితే రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చని పురుగు ఆశించిన రైతులు ఈ విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు.




హెచ్ఎం సుధాకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## రాష్ట్ర ఉత్తమ హెచ్ఎంకు ఘన సన్మానం

తర్లుపాడు, సెప్టంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముత్తేజు సుధాకర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సుధాకర్‌కు శనివారం పాఠశాలలో సన్మాన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. పాఠశాలను ఆదర్శ పాఠశాలుగా తీర్చిదిద్దడంలో హెచ్ఎం సుధాకర్ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన అడుగు జాడల్లో ఉపాధ్యాయులందరూ కృషి చేస్తామన్నారు. అనంతరం సుధాకర్ దంపతులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కళ్లను కాపాడుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని కాకాణి శంకర నేత్రాలయ వైద్య సిబ్బంది గురుస్వామి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో వాసవీ క్లబ్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్‌లు చేసిన వారికి శనివారం కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా శంకర నేత్రాలయ సిబ్బంది మాట్లాడుతూ.. గత నెలలో కంటి వైద్య శిబిరం నిర్వహించి ఆపరేషన్లు చేసిన వారికి కళ్ల అద్దాలు, మందులు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో వాసవీ నాయకులు పి.లక్ష్మీనారాయణ, కె.రవికుమార్, వి.వెంకటేశ్వర్లు, నేత్రాలయ సిబ్బంది చలపతిరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లా కోరుతూ సీఎంకు లేఖ



దినకర్‌కు వినతిపత్రం ఇస్తున్న జిల్లా సాధన సమితి నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లమల మార్కాపురం జిల్లా కోరుతూ సీఎం చంద్రబాబు నాయుడికి లేఖ రాసినట్లు 20 సూత్రాల పథకం అమలు విభాగం చైర్మన్, బీజేపీ నాయకుడు లంకా దినకర్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో మార్కాపురం జిల్లా సాధన సమితి ప్రతినిధులకు ఆ లేఖ చూపుతూ పశ్చిమ ప్రకాశం ప్రాంత అభివృద్ధిపై చర్చించారు. ఒంగోలు ప్రాంతానికి చెందిన తాను మార్కాపురం జిల్లా ఏర్పాటు అవసరాన్ని బలంగా కోరుతున్నట్లు వివరించారు. నూతన మార్కాపురం జిల్లాలో నల్లమల అడవులు, కంభం చెరువు, త్రిపురాంతకం దేవాలయం అభివృద్ధి కోసం సీఎంతో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు న్యాయవాది చెన్ను శివప్రసాదరావు, జీవీ రమణారావు, చెన్నకేశవులు, ఎం.వెంకటేశ్వర్లు, సామాజిక ఉద్యమ నాయకులు వి.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసనాయుడు ఉన్నారు.

## మోసంపై కేసు నమోదు

మార్కాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పొలం అమ్ముతానని చెప్పి డబ్బులు తీసుకుని నిర్ణీత సమయం దాటినా పట్టించుకోకుండా ఇబ్బందులు పెడుతున్న ఓ ఉద్యోగిపై బాధితుడి ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు శనివారం కేసు నమోదు చేశారు. ఆయన వివరాల మేరకు పట్టణంలోని కోనేటి వీధికి చెందిన చిన్నబాల శ్రీనివాసులు ఎర్రగొండపాలెం తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వెనుక 1.15 ఎకరాల భూమి ఉంది. దాన్ని 2023లో మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన పల్లెబోయిన పెద్దఆవులయ్యకు రూ.68 లక్షలకు విక్రయించి డబ్బులు తీసుకున్నారు. అగ్రిమెంట్ మేరకు మిగిలిన పైకం చెల్లిస్తాను రిజిస్ట్రేషన్ చేయమంటే శ్రీనివాసులు పట్టించుకోవడంలేదు. తాజాగా పెద్దఆవులయ్య గట్టిగా ఒత్తిడి చేయడంతో నీ ఇష్టం వచ్చిన వారికి చెప్పుకోమని శ్రీనివాసులు బెదిరించారు. బాధితుడు పెద్దఆవులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పోషకాహారంతో బహుళ ప్రయోజనాలు

కంభం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పోషక ఆహారం .. ఆరోగ్యానికి సోపానం అంటూ విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ వారు సమాజంలో అవగాహన కల్పిస్తున్నారు. శనివారం ఎంఈవో కార్యాలయంలో పోస్టర్లను ఎంఈవో-2 శ్రీనివాసులు, ఫౌండేన్ ప్రోగ్రాం అసోసియేషన్ శ్యాంబాబు ఆవిష్కరించారు. టాటా ట్రస్ట్ వారి సహకారంతో ఆరోగ్యం అవగాహన కలిగించేందుకు విజయవాని చారిటబుల్ ఫౌండేషన్ వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఫోర్టిఫైడ్ ఆహార పదార్థాలలో ఐరన్, విటమిన్ ఏ, బీ 12, ఫోలిక్ యాసిడ్ తదితర పోషకాలు లభిస్తాయని, బియ్యం, ఉప్పు, నూనె, పాలు, తదితర ఆహార ఉత్పత్తుల కొనుగోలు సమయంలో +ఎఫ్‌గుర్తు ఉన్న వాటినే కొనుగోలు చేయాలన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో గోడపత్రికలను అంటించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో తదితరులు

# పదవులకు వన్నె తేవాలి


### సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి



పాలకవర్గానికి నియామకపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రాచర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పదవులు చేపట్టిన పాలకవర్గం తమ పదవులకు వన్నె తేవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామాపురం సొసైటీ బ్యాంక్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదవులు స్వీకరించిన పెద్దలు వాటిని అలంకారప్రాయంగా చేయవద్దని, ప్రజలకు, రైతులకు మేలు చేసి పదవికే వన్నె తేవాలని సూచించారు. రాచర్ల మండల అభివృద్ధికి తాను కృషి చేస్తున్నానే తప్ప రాజకీయాలు, కులమతాలు చూడడం లేదని, నాకు ప్రజల శ్రేయస్సు, అభివృద్ధి ముఖ్యమని అన్నారు. ప్రజలు కూడా తన కృషిని గుర్తించి చేసిన అభివృద్ధిని గమనించి తనకు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. అనంతరం ఆయన నూతన పాలకవర్గానికి నియామకపత్రాలను అందించి అభినందనలు తెలియజేశారు. సొసైటీ బ్యాంకు చైర్మన్ భవనం పుల్లారెడ్డి సభ్యులుగా మదిరె ఈశ్వర్‌రెడ్డి, బోగోలు నారాయణ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కటిక యోగానంద్, భవనం శ్రీధర్ రెడ్డి, రెడ్డి కాశిరెడ్డి, డి సయ్యద్‌మియా, బుడమ నాగేశ్వర్‌రెడ్డి, నల్లబోతుల శ్రీనివాసులు, బత్తిని రామకృష్ణ, శిరిగిరి వెంకటపతి, అన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, భూపతి కాశయ్య, సిద్ధం పెద్ద నరసింహులు, పాపిశెట్టి శ్రీనివాసులు, రాచర్ల, గిద్దలూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్త బాలీశ్వరయ్య, గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైభవంగా వినాయక నిమజ్జనం







మార్కాపురం, తర్లుపాడులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాలలో 10 రోజుల పాటు పూజలు అందుకున్న గణనాథ విగ్రహాలను మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ నిమజ్జనానికి తరలించారు. మెయిన్ బజార్, తూర్పువీధి, పీఎస్ కాలనీ, అలుగు వీధి తదితర ప్రాంతాల వినాయకులను నిమజ్జనానికి తరలించారు.

తర్లుపాడు : మండలంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలు 11వ రోజు నిమజ్జనానికి తరలివెళ్లాయి. తర్లుపాడులో సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం అర్చకులు అలుగు బాలబ్రహ్మం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌పై అలంకరించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు వార్లుపోసి కాయకర్పూరాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త మాదాల నాగమల్లికార్జున్ భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం విగ్రహాన్ని బొడిచర్ల వద్ద ఉన్న గుండ్లకమ్మ నదిలో నిమజ్జనం చేశారు.

మెయిన్ బజార్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శనివారం రాత్రి నిమజ్జనానికి తరలించారు. నవరాత్రుల్లో పూజల్లో ఉంచిన లడ్డూకు శుక్రవారం రాత్రి వేలం పాట నిర్వహించారు. స్వామి విగ్రహానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : పట్టణంలోని ఎన్టీఆర్ సెంటరులో ఫ్రెండ్స్ సర్కిల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విశ్వరూప గణనాథుడు విశేషపూజలు అందుకొని శనివారం నిమజ్జనానకి తరలివెళ్లారు. గ్రామోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం ఆకర్షించాయి. ఎన్టీఆర్ సెంటరు నుంచి ప్రధాన వీధుల మీదుగా నిమజ్జనయాత్ర సాగింది. అనంతరం తిపురాంతకం మండలం దూపాడు వద్ద నాగార్జున కాల్వలో గణనాథుడిని నిమజ్జనం చేశారు. పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## అన్నదానాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మార్కాపురం : పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద శనివారం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. స్థానిక విద్యానగర్, శివాలయం వీధుల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పక్కలగడ్డ మల్లిఖార్జున్, చిట్యాల చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.



శివాలయం వద్ద అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కందుల

## గ్రామకంఠం హద్దులను జాగ్రత్తగా గుర్తించాలి

రాచర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ కంఠంలో ఉన్న హద్దులను స్వామిత్వ సర్వే బృందం జాగ్రత్తగా గుర్తించాలని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి అన్నారు. సత్యవోలులో జరుగుతున్న సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. రీసర్వే బృందం 30 గృహాలకు తక్కువ కాకుండా సర్వే చేయాలని, రేపు సర్వేకి వెళ్లే గృహానికి సంబంధించి ఆ కుటుంబ సభ్యులకు ఒక రోజు ముందుగా తెలియజేయాలన్నారు. రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సరస్వతీదేవి, వీఆర్వో లక్ష్మీ, సర్వే బృందం పాల్గొన్నారు.



సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటరామిరెడ్డి

## చెన్నకేశవులుకు సన్మానం

కంభం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోన చెన్నకేశవులుకు ఏపీ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా శనివారం గోన చెన్నకేశవులును, ఆ పదవిని ఇప్పించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో ఈ పదవిని ఇప్పించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని చెన్నకేశవులు గజమాలతో సత్కరించారు. అనంతరం అశోక్ రెడ్డి, చెన్నకేశవులును శాలువాతో సత్కరించి విద్యా శాఖ డైరెక్టర్‌గా అందరినీ కలుపుకొనిపోయి మంచి పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



చెన్నకేశవులును అభినందిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

# అడుగంటిన చందవరం-1 స్టోరేజీ

» సాగర్ కాల్వలో పుష్కలంగా ఉన్నా నీటిని పంపింగ్ చేయని వైనం
» దొనకొండకు 15 రోజులుగా సరఫరా నిల్
» అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ లోపంతో తీవ్రమైన తాగునీటి సమస్య


అడుగంటిన చందవరం-1 మంచినీటి స్టోరేజీ

దొనకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండలంలోని 29 గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చే చందవరం-1 మంచినీటి స్టోరేజీ పూర్తిగా అడుగంటింది. ప్రస్తుతం సాగర్ కాలువల్లో నీటి సరఫరా జరుగుతున్నా స్టోరేజీకి పంపింగ్ చేయడంలేదు. సాగర్ కాల్వకు రెండు కిలోమీటర్ల దూరంలో స్టోరేజీ ఉండటంతో నీటి సరఫరా పూర్తిగా జరుగుతున్న సమయంలోనే స్టోరేజీని పూర్తిస్థాయిలో నింపేందుకు ఎక్కువ రోజులు పడుతుంది. సాగర్ నీటిని రెండు, మూడు రోజుల్లో నిలిపివేస్తే తమ పరిస్థితి ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సాగర్ కాల్వ నుంచి స్టోరేజీకి వెళ్లే రహదారి ముళ్ల చెట్లతో మూసుకుపోయింది. స్టోరేజీ కట్ట చుట్టూ ముళ్ల చెట్లు దట్టంగా పెరిగిపోయాయి. చందవరం-1 స్టోరేజీకి సాగర్ నీటిని పంపింగ్ నిమిత్తం కాల్వ సమీపంలో పంప్‌హౌస్‌ను ఏర్పాటుచేశారు. విద్యుత్ మోటార్లకు కరెంట్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇటీవల దొంగలు పగులకొట్టి రాగితీగను అపహరించారు.

చందవరం-1 జలాశయంను 880 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో 1982లో నిర్మించారు. నీటి పథకం పురాతనం కావటంతో స్టోరేజీలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవటం, తరచూ పైప్‌లైన్లు పగులుతుండటంతో నీటి పథకం శిథిలావస్థకు చేరింది. నీటి సరఫరాకు తీవ్ర ఆటంకంగా మారటం ఇదో కారణం. స్టోరేజీ పరిధిలో విధులు నిర్వర్తించేందుకు గతంలో 18 మంది వర్కర్స్ ఉండేవారు. ప్రస్తుతం పది మంది మాత్రమే విధులు నిర్వహిస్తునట్లు సమాచారం. తగినంత సిబ్బంది లేకపోవటంతో రాత్రిపూట పంప్ హౌస్ వద్ద సిబ్బందిలేని కారణంగా ట్రాన్స్‌ఫార్మర్‌లో చోరీ జరిగింది.


చందవరం వద్ద సాగర్ కాల్వలో ఉధృతంగా ప్రవహిస్తున్న సాగర్ జలాలు

దొనకొండకు గతనెల 20 నుంచి నేటి వరకు సాగర్ నీటి సరఫరా జరగడంలేదు. సాగర్‌లో నీరు సమృద్ధిగా ఉన్నా తమకు మంచినీటి సమస్య తప్పటంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**తాగునీటి ఇబ్బందులులేకుండా చర్యలు**
**కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, దొనకొండ**

స్టోరేజీ వద్ద వాల్ లీకై నీళ్లు వృథాగా పోతున్నాయి. స్టోరేజీలో నీళ్లు ఉండటంతో వాల్ మరమ్మతులు చేయటం సాధ్యంకాలేదు. ప్రస్తుతం నీరు అడుగంటడంతో వాల్ మరమ్మతులు పూర్తి చేశాం. స్టోరేజీకి సాగర్‌నీటిని పంపింగ్ చేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం.

# కోలాహలంగా గణేష్ నిమజ్జనం

దర్శి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో గణేష్ నిమజ్జనాలు శనివారంతో ముగిశాయి. వినాయకచవితి సందర్భంగా దర్శి పట్టణంతో పాటు మండలంలో మొత్తం 200 విగ్రహాలు ఏర్పాటు చేశారు. కొంతమంది మూడు రోజులు పూజలు చేసి నిమజ్జనం చేశారు. మరికొంత మంది ఐదు, తొమ్మిది రోజులు పూజలు చేసి నిమజ్జనాలు చేశారు. కాపు యువశక్తి, మరికొంత మంది ఏర్పాటుచేసిన విగ్రహాలను శనివారం నిమజ్జనాలు చేశారు. ఈఏడాది రైతులకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో భారీస్థాయిలో విగ్రహాలను నెలకొల్పటంతో పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. లడ్డూ పాటలు వేలాది రూపాయలు పలికాయి. శనివారం పట్టణంలోని సందువారిపాలెం విగ్రహం వద్ద త్రిమూర్తులు అనే భక్తుడు రూ.3 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. రామాయలంలో కాపు యువశక్తి విగ్రహం వద్ద రూ.లక్షకు చందనం అనే భక్తుడు లడ్డూను దక్కించుకున్నారు.

కాకతీయ కమ్మ సేవా సంఘం ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద లడ్డూ పాట మూడు రోజుల క్రితం రూ.1.36 లక్షలు పలికిన విషయం తెలిసిందే. మరోచోట రూ.1.30 లక్షలకు, మరోప్రాంతంలో రూ.75 వేలు పలికాయి. గణేష్ నిమజ్జనాలు సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. ప్రశాంతంగా నిమజ్జనాలు ముగియటంతో ప్రజలు, పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.


దర్శి: నిమజ్జనానికి తరలివెళుతున్న కాపు యువశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహం

**ముండ్లమూరు:** మండలంలోని వేముల, పూరిమెట్ల గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కమలాకర్ బందోబస్తు నిర్వహించారు.

**తాళ్లూరు:** మండలంలోని తాళ్లూరు, కొర్రపాటివారిపాలెం, లక్కవరం, తూర్పుగంగవరం గ్రామాల్లో ఏర్పాటుచేసిన గణనాథులు శనివారం భక్తుల కోలాహలంతో నిమజ్జనానికి తరలివెళ్లాయి. కొర్రపాటివారిపాలెంలో వినాయక విగ్రహానికి టీడీపీ నాయకులు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఎంపీపీ తాటికొండ శ్రీను, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, గొల్లపూడి వేణుబాబు, సర్పంచ్ కొర్రపాటి శ్రీదేవిరామయ్య, లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలుచేసి నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు. ఎస్సై ఎస్. మల్లికార్జునరావు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మన్నేపల్లి, నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షులు గొంది రమణారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఇందుకు ఓబుల్‌రెడ్డికి రాష్ట్రనాటక అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్ పదవి లభించటం నిదర్శనమన్నారు. డైరెక్టర్ పదవి దక్కించుకున్న టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి శనివారం నేతలతో కలిసి నరసరావుపేట వెళ్లారు. తనకు రాష్ట్రస్థాయి పదవి అవకాశం కల్పించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, కడియాల రమేష్‌ను దుశ్శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసేవారికి తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి కష్టించి పనిచేసే కార్యకర్తలకు రానున్న రోజుల్లో మరిన్ని పదవులు వరించే అవకాశాలున్నాయన్నారు. టీడీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. నాటక అకాడమి డైరెక్టర్‌గా నియమితులైన బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డిని అభినందిస్తూ డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, కడియాల రమేష్ తదితరులు దుశ్శాలువాలతో సత్కరించారు.



రాష్ట్ర నాటక అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్ ఓబుల్‌రెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, కడియాల రమేష్

కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీను, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, పెదకాలేషావలి, రాచకొండ వెంకట్రావు, ఖాశీంసైదా, సత్యం, పిన్నిక రమేష్, నవులూరి విద్యాసాగర్, కైపు రామకోటిరెడ్డి, కల్యాణ్ చక్రవర్తి, జి.లక్ష్మీనారాయణ, అన్వర్, తిరుపతిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ మండల అధ్యక్షుల నియామకం


బొల్లా నరసింహారావు పామూరు మండల అధ్యక్షుడు


అమీర్‌బాబు, పామూరు పట్టణం


బొబ్బూరి రమేష్, సీఎస్‌పురం మండలం


బత్తుల వెంకటాద్రి, సీఎస్‌పురం పట్టణం


ఇంద్రభూపాల్‌రెడ్డి, వెలిగండ్ల మండలం


షేక్ ఫిరోజ్, కనిగిరి పట్టణం


కొండా కృష్ణారెడ్డి, కనిగిరి మండలం

పామూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు పిలుపుమేరకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సారథ్యంలో మండల అధ్యక్షులను నియమించారు. పామూరు మండల, పట్టణ అధ్యక్షులుగా బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబును నియమించారు. సీఎస్‌పురం మండల, పట్టణ అధ్యక్షులుగా బొబ్బూరి రమేష్, బత్తుల వెంకటాద్రిని నియమించారు. ఈసందర్భంగా వీరిని నాయకులు అభినందించారు.

**వెలిగండ్ల:** టీడీపీ వెలిగండ్ల మండల అధ్యక్షుడిగా కేలం ఇంద్రభూపాల్ రెడ్డి నియమితులయ్యారు. మండలంలోని మరపగుట్ల పంచాయతీకి చెందిన ఇంద్రభూపాల్ రెడ్డి నియోజకవర్గ రైతు అధ్యక్షుడిగా గత ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఈసందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ పటిష్టతకు కృషి చేస్తానని చెప్పారు. ఈసందర్భంగా మండలంలోని నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించారు.

**కనిగిరి:** టీడీపీ కనిగిరి పట్టణ, మండల అధ్యక్షులను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో పట్టణాధ్యక్షుడిగా ఉన్న తమ్మినేని శ్రీనివాసరెడ్డి స్థానంలో ఫిరోజ్‌ను, మండలపార్టీ అధ్యక్షుడిగా గతంలో ఉన్న నంబుల వెంకటేశ్వర్లు స్థానంలో గుడిపాడు గ్రామానికి చెందిన కొండా కృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఉత్తర్వులు జారీ చేశారు. తమపై నమ్మకం ఉంచి పదవులు ఇచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన ఫిరోజ్, కృష్ణారెడ్డిని పార్టీ శ్రేణులు సత్కరించి అభినందనలు తెలిపారు.

## ఏఈగా అంకబాబు బాధ్యతల స్వీకరణ

ముండ్లమూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఏఈగా టి.చినఅంకబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. రెండు రోజుల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా రెగ్యులర్ ఏఈగా చినఅంకబాబుకు పదోన్నతి కల్పించి ముండ్లమూరు మండలానికి నియమించారు. ఈసందర్భంగా స్థానిక సబ్‌స్టేషన్‌లో లైన్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.సాంబయ్య, లైన్‌మెన్‌లు ఆంజనేయులు, కోటేశ్వరరావు, సోమ్లు నాయక్, మధుబాబు, తదితరులు అంకబాబును సన్మానించారు. బాధ్యతలు స్వీకరించిన ఏఈ చినఅంకబాబు మాట్లాడుతూ మండలంలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరావు

## చెత్త ద్వారా సంపద సృష్టించాలి

దర్శి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చెత్త, పనికిరాని వస్తువుల ద్వారా సంపద సృష్టించవచ్చని మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు తెలిపారు. దర్శిలో శనివారం దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుకునే వారికి, అనధికార పారిశుధ్య కార్మికులకు వృత్తిపరమైన గుర్తింపు కార్డులు అందించి సామాజిక భద్రత కల్పిస్తామన్నారు. ఆధార్ కార్డులో లేని వ్యక్తులను గుర్తించి కార్డులు మంజూరు చేయించి పథకాలు అందజేస్తామన్నారు.

కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ సుభానీ, సంఘ సేవకుడు జీవీ రత్నం, రీసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్లు డి.కోటేశ్వరరావు, నాగమణి, ప్రేమ్‌కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం

కురిచేడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. మండల స్థాయి అధికారులు వారి వారి శాఖల గురించి వివరించారు. విద్యుత్ శాఖపై చర్చలో కురిచేడు ప్రధాన కూడలిలోని పాత విద్యుత్ స్తంభాలను ఎపుడు తొలగిస్తారని జడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి ప్రశ్నించారు. త్వరలో తొలగించే ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో కేజీఎస్ రాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు ఆలయాల మూసివేత

సీఎస్‌పురం(పామూరు) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రాలైన భైరవకో, మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానాలను చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మూసివేయనున్నట్లు ఈవోలు వంశీకృష్ణారెడ్డి, నరసింహబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆలయ సంప్రోక్షన అనంతరం తెరువనున్నట్లు తెలిపారు.

**దొనకొండ:** చంద్రగ్రహణం సందర్భంగా ఆనంద ఆశ్రమంలోని దేవాలయాల్లో ఆదివారం ఉదయం 11 నుంచి దర్శనాలు నిలిపివేస్తున్నట్టు అర్చకులు మణిబాబుశర్మ తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం ఆరు గంటలనుంచి సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిస్తున్నట్టు తెలిపారు.

## టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్


టీడీపీలో చేరిన సర్పంచ్ వేణు

పామూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్పంచ్ శనివారం టీడీపీలో చేరారు. మండలంలోని తూర్పుకట్టకిందపల్లి సర్పంచ్ నీరుకట్టు వేణు, ఆయన తండ్రి శ్రీనివాసులు, పది కుటుంబాలు ఏఎంసీ వైస్‌చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు సమక్షంలో శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

## సీతారాం ఏచూరికి నివాళి

దొనకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశంలో దోపిడీ రహిత సమాజం కోసం సీతారాం ఏచూరి అహర్నిశలు పోరాడారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు కంకణాల ఆంజనేయులు పేర్కొన్నారు. దొనకొండలో శనివారం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని ఆపార్టీ నాయకుడు కుందుర్తి చిన్ననర్సింహులు అధ్యక్షతన నిర్వహించారు.

ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిరుపల్లి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మ తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

కనిగిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నిమ్మతోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాస్త్రవేత్త నారాయణ అన్నారు. హనుమంతునిపాడు మండలంలోని ముప్పాళ్ళపాడు, కూటాగుండ్ల గ్రామాల్లో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో శనివారం నిమ్మతోటలను పరిశీలించారు.

ఈసందర్భంగా నారాయణ మాట్లాడుతూ నేలను బట్టి పంటల సాగు చేపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉద్యాన ఏవో విష్ణుప్రియ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధానాధికారి డాక్టర్ సంధ్యారాణి

## యాజమాన్య పద్ధతులను తప్పక పాటించాలి

దర్శి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు వాతావరణ పరిస్థితులను బట్టి, భూముల స్వభావం బట్టి అందుకు అనుగుణమైన పంటలను సాగు చేసుకోవాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధానాధికారి డాక్టర్ సంధ్యారాణి సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పైర్ల సాగులో రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. రసాయన ఎరువులను తగు మోతాదులో వాడాలన్నారు. పచ్చిరొట్ట సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్నారు. రైతులు సాంకేతిక పద్ధతులను అవలంబించే విధంగా శాస్త్రవేత్తలు, అధికారులు వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రతినిధి రజనీకుమారి, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు, దర్శి, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, సింగరాయకొండ, ఎర్రగొండపాలెం, ఒంగోలు ఏడీఏలు, వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## డ్వాక్రా సభ్యుల నగదు స్వాహా

ముండ్లమూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఉల్లగల్లుకు చెందిన ఆరు పొదుపు గ్రూపు సంఘాలకు సంబంధించి రూ.6 లక్షలకు పైగా నిధులను బిజినెస్ కరస్పాండెంట్ స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. డ్వాక్రా మహిళలు దర్శిలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. రుణాలకు సంబంధించి ప్రతినెలా కొంత భాగాన్ని వడ్డీతో కలసి బ్యాంకులో చెల్లిస్తుంటారు. ఈనగదును మండలంలోని లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన మేడం మోహన్‌రెడ్డి అనే బిజినెస్ కరస్పాండెంట్ ద్వారా చెల్లిస్తుంటారు. కొన్నాళ్ళపాటు నమ్మకంగా చెల్లిస్తూ రసీదులను సంఘాల సభ్యులకు అందజేస్తుండేవాడు. అయితే, గత జనవరి నుంచి వసూలు చేసిన నగదులో ఒక నెల బ్యాంకుకు చెల్లించటం, మరోనెల చెల్లించకుండా స్వాహా చేస్తున్నాడు. గ్రూపుల్లో కొంత మంది సభ్యులు ఇటీవల రుణాలు తీసుకొనేందుకు బ్యాంకుకు వెళ్ళగా విషయం తెలిసింది. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించటం లేదని బ్యాంక్ మేనేజర్ చెప్పగా కంగుతిన్నారు. దీంతో బిజినెస్ కరస్పాండెంట్‌ను నిలదీయగా చెల్లిస్తానంటూ కాలయాపన చేశాడు. దీంతో చేసేదేమి లేక శనివారం మోసపోయిన డ్వాక్రా మహిళలు వచ్చి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయిమణికంఠ గ్రూపునకు సంబంధించి రూ.90 వేలు, శ్రీలక్ష్మి గ్రూపు రూ.1.05 లక్షలు, లక్ష్మీప్రసన్న గ్రూపు రూ.1.20 లక్షలు, మహాలక్ష్మి గ్రూపు రూ.75 వేలు, గంగా గ్రూపు రూ.34వేలు, ఇందిరా గ్రూపునకు సంబంధించి రూ.1.80 లక్షలు స్వాహా చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గంగసాని లక్ష్మి

పామూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తిచేయాలన్నారు. పామూరులో డిగ్రీ, బాలికల ఉన్నత పాఠశాల, హైస్కూల్‌కు ఆట స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు సూచించారు. తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ స్థలాలు దొరకటమే కష్టతరంగా మారిందన్నారు. అయినా పరిశీలించి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పశువైద్యాధికారి ఆర్‌హనుమాన్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి టి.అబ్రహం మాట్లాడుతూ మండలానికి 120 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ప్రభుత్వానికి ఇండెంట్ పంపించినట్టు చెప్పారు. సింగిల్‌విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు పంట రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, మండల కోఆప్షన్‌సభ్యుడు షేక్ నాయబ్‌రసూల్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం


జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని భారతిని సన్మానిస్తున్న సిబ్బంది

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా సీఎస్‌పురం మండలం ఆనికాలపల్లి పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు జె.భారతి అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్‌వీ అలేఖ్య, ఎస్ఎంసీ చైర్మన్ అఫ్రోజ్, అంగన్‌వాడి కార్యకర్తలు షహీనాజ్, షేక్ హసీనా, ఆయా విజయలక్ష్మి సన్మానించారు.

## ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పీసీపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈఏడాది పదో తరగతిలో ప్రతిభ కనబరిచి ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులను విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గల్లా చెన్నయ్య శనివారం ప్రోత్సాహక నగదు అందజేశారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండలంనుంచి ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన 12 మందికి రూ.5వేల చొప్పున అందజేశారు. ఈసందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ క్రమశిక్షణతో కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఈవో కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులు వీరపనేని చెన్నయ్య, రిటైర్డ్ ఎంఈవో మహంకాళి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.


ప్రోత్సాహక నగదుతో విద్యార్థులు



సండే స్పెషల్

# తింటే.. తంటా

రూ.5 నుంచి అందు బాటులో ఆకట్టుకుంటున్న రుచికర మైన విషం పిల్లల ఎదుగుదలతో పాటు ప్రాణాలను హరిస్తోంది. ఆకర్షణీయమైన ప్యాకింగ్ పిల్లలను ఆకట్టుకుంటుండగా.. తక్కువ ధర కావడంతో పెద్దలు పెద్దగా పట్టించుకోవడం లేదు. చివరకు జంక్‌ఫుడ్ పిల్లల పాలిట విషాహారంగా మారుతోంది. వారి ఎదుగు దలపై ప్రభావంతో పాటు రకరకాల ఆరోగ్య సమస్యలకు కారణంగా మారుతోంది. నిషేధిత రసాయనాలతో తయారు చేస్తున్న జంక్‌ఫుడ్‌లను యథేచ్ఛగా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వీటి కొనుగోళ్లను నియంత్రించాల్సిన పెద్దలు వాటినే చిరుతిళ్లుగా అందిస్తూ.. పిల్లల ఆరోగ్యాల్ని హరిస్తున్నారు. కోరి మరీ.. కొనుగోలు చేసి.. భావి భారతాన్ని అనారోగ్యం పాలు చేస్తుండటంలో అటు వ్యవస్థలు.. ఇటు తల్లిదండ్రులు కీలక పాత్రదారులుగా మారుతున్నారు.

## రుచికరమైన విషం జంక్‌ఫుడ్

- ఆరోగ్యంపై ప్రభావం చూపుతోన్న చిరుతిళ్లు
- అరికట్టకపోతే చిన్నారుల్లో రక్తహీనత, ఊబకాయం

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జంక్‌ఫుడ్.. రుచికరమైన విషం. ఇది పిల్లల ప్రాణాలను హరిస్తోంది. పిల్లలు పాఠశాలకు వెళ్లినప్పుడు.. సెలవుల్లో ఇళ్ల వద్ద ఏమి కొని తింటున్నారనే విషయం పట్టించుకోని పెద్దల నిర్లక్ష్యం వారి ఆరోగ్యాన్ని, భవితను చిదిమేస్తోంది. చిన్నారుల జీవితాల్ని శాసిస్తున్న చిరుతిళ్లు వారికి బలమివ్వకపోగా ప్రమాదంలోకి నెడుతున్నాయి. జంక్‌ఫుడ్ బారిన పడితే ఆ ప్రభావం చిన్నారులపై జీవితాంతం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మద్యం చేసే నష్టం కంటే జంక్‌ఫుడ్ ఇంకా ఎక్కువ నష్టం చేస్తోంది. జంక్‌ఫుడ్ బారిన పడే వారి సంఖ్య రోజు రోజుకు అధికమవుతుంది. ఈ పరిస్థితుల్లో పిల్లల చదువుపై దృష్టి పెట్టినట్టుగానే వారు ఏమి తింటున్నారనే దాన్ని కూడా పరిశీలించాల్సిన బాధ్యత పెద్దలదే. పిల్లలకు జంక్‌ఫుడ్ కాకుండా ఫ్రూట్ సలాడ్‌లు, పల్లీలు, బెల్లం

(మిగతా 6వ పేజీలో)

### పొట్టలో పేరుకుపోతున్న వ్యర్థాలు

చిన్నపిల్లలు సరాసరిన రోజుకు 30 నుంచి 50 గ్రాముల వరకు జంక్‌ఫుడ్, చాక్లెట్లను తింటున్నారని ఒక అంచనా. ఈ కారణంగా వారి పొట్టలో 30 గ్రాముల నుంచి 50 గ్రాముల వరకు వ్యర్థాలు ఉంటున్నాయి. ఫాస్ట్‌ఫుడ్‌లో వాడే మైదా, నూనెలతో విష, కొంకి, బద్దెపురుగులు, ఏలికపాములు వంటివి శరీరంలోకి చేరుతున్నాయి. ఇవి ఎముకల ఎదుగుదలపై ప్రభావం చూపుతుంటాయి. జంక్‌ఫుడ్ వ్యర్థాలు దేహంలో పేరుకుపోవడంతో బాలికల్లో రక్తహీనత, బాలురులో ఊబకాయం పెరుగుతుంది. సరిగ్గా ఆహారం తినకపోయినా లావుగా కనిపిస్తుంటారు.

### పౌష్టికాహారంతోనే.. రోగ నిరోధక శక్తి

గత పదేళ్లుగా పిల్లల ఆహారపు అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. జంక్‌ఫుడ్ ప్లాస్టిక్‌తో సమానం. అది జీర్ణం కాక శరీరంలో పేరుకు పోతుంది. దాని వైపు నుంచి పిల్లల దృష్టి మరల్చాలి. పీచు, బలవర్ధక పోషకాలు అందించాలి. సంప్రదాయ ఆహారాన్ని తీసుకునేలా పిల్లల్ని ప్రోత్సహించాలి. పండ్లు, ఇతర ఆహార పదార్థాలతో భిన్న వంటకాలను తయారు చేసి అందించాలి.

\- భువన, డైటీషియన్, గుంటూరు



### అధికారులపై చర్యలు ?

తురకపాలెంలో వరుస మరణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఆ మేరకు ప్రభుత్వం ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించినట్లు తెలుస్తుంది. ఒకరిద్దరు జిల్లా అధికారులు మితిమీరిన నిర్లక్ష్యం ప్రదర్శించినట్లుగా నిఘా వర్గాలు కూడా తేల్చినట్లు సమాచారం.





# నిర్లక్ష్యమే.. శాపం

తురకపాలెంలో 29 మంది బలి

- వరుస మరణాల్లో విస్తుపోయే వాస్తవాలు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ఆరోగ్యశాఖ
- ప్రజాప్రతినిధులు చెప్పినా స్పందనలేని అధికారులు
- ఒక్కో నెలలో పది మంది మరణించినా పట్టించుకోని వైనం

**ఒకరు.. ఇద్దరు కాదు.. 29 మంది మరణించారు. అదీ మూడు నెలల్లోనే. అదేమన్నా మారుమూల గ్రామం.. సమాచారం తెలుసుకోవడం కష్టం అంటే జిల్లా కేంద్రమైన గుంటూరుకు కూతవేటు దూరంలోనే ఉంది. సరే అదేదో పెద్ద గ్రామం నెలలో పది మరణాలు సర్వ సాధారణం అనుకునేందుకు కూడా ఆస్కారం లేదు. ఐదారొందల కుటుంబాలు.. 2300 జనాభా ఉన్న ఓ చిన్న గ్రామం. అయినా వరుస మరణాలు.. అదీ జ్వరం, దగ్గు, ఆయాసం లాంటి సాధారణ రోగాలతో అత్యంత తక్కువ రోజుల్లోనే మరణాలు సంభవించాయి. అయినా వైద్య ఆరోగ్య శాఖతో పాటు జిల్లా స్థాయి అధికారుల్లో కనీస స్పందన లేదంటే వారెంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో తెలుసుకోవచ్చు. ఒకే నెలలో.. ఒకే ఊరిలో డజన్ల కొద్దీ సంఖ్యలో మరణిస్తుంటే జిల్లా ఉన్నతాధికారులు ఏమి చేస్తున్నారన్న ప్రశ్న ఉద్భవిస్తుంది. మీడియాలో కథనాలు వచ్చిన తర్వాత రాష్ట్ర స్థాయి అధికారులు హెచ్చరించిన తర్వాత ఇప్పుడు హడావుడి చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూలైలోనే స్పందించి ఉంటే మరణాలను తగ్గించే అవకాశం ఉండేది కదా అన్న అభిప్రాయాలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం 29 మందిని బలితీసుకుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

(గుంటూరు సిటీ, తెనాలి ఆంధ్రజ్యోతి)

గుంటూరు నగర శివార్లలోని ఓ చిన్న గ్రామం తురకపాలెం. ఈ గ్రామం ఇప్పుడు రాష్ట్రవ్యాప్త సంచలనమైంది. వరుసగా.. సాధారణ జబ్బులతో చికిత్సలు పొంది ఇళ్లకు వచ్చిన తర్వాత అంతు చిక్కని రీతిలో సంభవిస్తున్న మరణాలతో గ్రామస్థులు భయం గుప్పిట్లో చిక్కుకున్నారు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర మంత్రుల పర్యటనలు.. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల వైద్య శిబిరాలతో హడావుడి చేస్తున్నారు. అదే తొలుతే అధికారులు స్పందించి ఉంటే మరణాలు కొన్ని అయినా తగ్గి ఉండేవి కదా అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఓ చిన్న గ్రామంలో డజన్ల కొద్దీ మరణాలు సంభవించినా వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఇతర జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతోనే వరుస మరణాలు సంభవించాయన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం.. 29 మంది పాలిట మరణశాసనమైందన్న విమర్శలు వస్తున్నాయి. జిల్లా కేంద్రమైన గుంటూరుకి నాలుగైదు కిలో మీటర్ల దూరంలోని తురకపాలెం గ్రామంలో కేవలం జ్వరం.. దగ్గు.. ఆయాసంతో బాధపడతూ 29 మంది మరణించారంటే వైద్య ఆరోగ్య శాఖలోని నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. సాధారణంగా ఒక్కరు చనిపోయినా హడావిడి చేసే వైద్య, ఆరోగ్యశాఖ తురక పాలెంలో ఇంత మంది వరుసపెట్టి మరణిస్తున్నా చోద్యం చూస్తూ కూర్చుంది. వరుస మరణాల విషయం సంచలనంగా మారి.. రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగే వరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆ గ్రామం వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. సాధారణంగా ఒక డయేరియా మరణం సంభవిస్తే దానికి సంబంధించిన సమాచారం 24 గంటల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థకు తెలియజేయాలి. మరి జ్వరంతో ఎవరైనా మరణించినా.. అది కూడా సీరియస్ అంశమే. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టాలి. గుంటూరు సమీపంలోని తురకపాలెంలో సంభవించిన మరణాల విషయంలో వైద్య, ఆరోగ్య శాఖ అటువంటి చర్యలు (మిగతా 6వ పేజీలో)



గ్రామస్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు



నిర్మానుష్యంగా తురకపాలెం వీధులు



గ్రామంలో ముమ్మరంగా సహాయ చర్యలు

**అనుమానితుల నుంచి రక్తనమూనాల సేకరణ**

గుంటూరు మెడికల్ : వరుస మరణాలు.. వీడని జ్వరాలతో భీతిల్లిన తురకపాలెంవాసులకు వైద్యంతో పాటు ఆహారం, తాగునీటిని అధికారులు అందిస్తున్నారు. శుక్రవారం సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్షతో శనివారం ఆయా శాఖలకు చెందిన అధికారులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ఇంటింటి సర్వే చేపట్టి రక్తనమూనాలు సేకరించింది. మెలియోయిడోసిస్ జ్వరాలు ప్రబలినట్లు అనుమానిస్తున్న నేపథ్యంలో మంగళగిరిలోని ఎయిమ్స్ వైద్యులు గ్రామాన్ని సందర్శించారు. మరో పక్క గ్రామస్థులకు శనివారం భోజన సదుపాయం కల్పించారు. మూడు రోజుల పాటు అందరికీ ఉచితంగా భోజనం ఏర్పాటు చేసినట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. అందరికీ మినరల్ వాటర్‌ను పంపిణీ చేశారు. ప్రజా, వైద్య సంఘాలు, సేవా సంస్థల ప్రతినిధులు నిజ నిర్ధారణ కమిటీగా ఏర్పడి శనివారం గ్రామంలో పర్యటించారు.

### పరిస్థితులు అదుపులో ఉన్నాయి..: కలెక్టర్

గుంటూరు : తురకపాలెంలో పరిస్థితులు అదుపులో ఉన్నాయని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. గ్రామంలోని పరిస్థితుల గురించి శనివారం మీడియాకు వివరించారు. 650 ఇళ్లలో సర్వే నిర్వహించి సింప్టమెటిక్ కేసులకు సంబంధించి 56 మందికి బ్లడ్ కల్చర్ తీసి మెడికల్ కళాశాలకు పంపించామన్నారు. 50 బృందాలతో గ్రామంలోని అన్ని ఇళ్లకు వెళ్ళి ఆరోగ్యానికి సంబంధించి 41 అంశాలపై సర్వేను శనివారం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి నోడల్ ఆఫీసర్స్ బృందం వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి కార్యక్రమాల ను పర్యవేక్షిస్తుందన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు 895 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. 2,850 మందికి ఉపాహారం, 3500 మందికి మధ్యాహ్న భోజనం అందించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించామన్నారు. ప్రాంతీయ లేబరేటరీలలో నీటి నమూనాలను పరీక్షించగా అందులో ఎటువంటి హానికార రసాయనాలు, పదార్థాలు లేవని నివేదిక వచ్చిందన్నారు. అనధికార మద్యం విక్రయాలు లేవని తేలిందన్నారు. క్వారీ లీజులపై తనిఖీలు చేపట్టామన్నారు. గాలి నాణ్యత పర్యవేక్షణ ప్రారంభించామన్నారు.

# రాష్ట్రస్థాయిలో బీచ్ ఫెస్టివల్







సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, మాలకొండయ్య తదితరులు

- రూ.4 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- వ్యాపారులూ సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి

బాపట్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బాపట్లలోని సూర్యలంక సముద్ర తీరంలో ఘనంగా రాష్ట్రస్థాయి బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన రియలర్టర్లు, బంగారం వ్యాపారులు, బీచ్ రిసార్ట్ యాజమాన్యం, రైస్‌మిల్లర్స్, పెట్రోల్ బంకులు, ఎరువులు, విత్తన వ్యాపార సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.మాలకొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 26, 27, 28 తేదీల్లో సూర్యలంక, రామాపురంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ప్రభుత్వం రూ.4 కోట్లు నిధులను మంజూరు చేసిందని తెలిపారు. జిల్లా వ్యాపార లావాదేవీలు అభివృద్ధి చెందాలనే దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడానికి తమవంతు ఆర్థిక సాయం అందజేయాలని కలెక్టర్ ఆయా సంస్థల యజమానులకు విజ్ఞప్తి చేశారు.

### ఆంధ్ర గోవాగా తీర్చిదిద్దటమే లక్ష్యం

సూర్యలంక, రామాపురం బీచ్‌లను మరో గోవా బీచ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. ఇప్పటికే బాపట్లలో 200 రిసార్ట్‌లు, 6 స్టార్ హోటల్స్ ఉన్నాయని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందుతాయని చెప్పారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.97.52 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. అందులో రూ.50 కోట్ల పనులకు టెండర్లు పిలవటం జరిగిందన్నారు. బీచ్ ఫెస్టివల్‌కు రాయల్ మెరైన్ ఆక్వా పరిశ్రమ నుంచి రూ.45లక్షలు అందజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

### బాపట్ల-చీరాల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

బీచ్ ఫెస్టివల్ ద్వారా చీరాల - బాపట్ల ప్రాంతాలపై ప్రజల దృష్టిని కేంద్రీకరించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చీరాల ఎమ్మెల్యే ఎం.మాలకొండయ్య తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ఆలోచనతో పనిచేస్తున్నారన్నారు. చీరాలలో హ్యాండ్‌ల్యూమ్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందరూ దీనికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్, పర్యాటకశాఖ అధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏఆర్ పోలీసుల లారీ బీభత్సం

ముగ్గురికి గాయాలు.. దంపతుల మృతి ● మద్యం మత్తులో రెండు బైకులను ఢీకొట్టిన డ్రైవర్

బాపట్ల రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణ శివారులో ఏఆర్ పోలీసు లారీ శనివారం రాత్రి బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో ఏఆర్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లారీని వేగంగా నడపడంతో రెండు ప్రమాదాలు చోటుచేసుకోగా దంపతులు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఇందకు సంబంధించిన వివరాలు.. బాపట్ల ఏఆర్ పోలీసు లారీని సర్వీసింగ్ నిమిత్తం గుంటూరుకు మధుకృష్ణ అనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి తీసుకెళ్తున్నాడు. బాపట్ల శివారు మూర్తిరక్షణ్‌నగర్ వద్ద, కొండుభొట్లవారిపాలెం అడ్డరోడ్డు వద్ద ద్విచక్ర వాహనాలను లారీ ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై అప్పికట్ల వైపు వెళ్తున్న కె.తనుష్‌సాయి, నిఖిత్‌బాబు, సందీప్ స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వెంబడిస్తారనే భయంతో లారీ నడుపుతున్న ఉద్యోగి వేగాన్ని పెంచి దూసుకెళ్తూ కొండుభొట్లవారిపాలెం అడ్డరోడ్డు వద్ద బాపట్ల నుంచి నిడుబ్రోలు వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న మరో బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న నిడుబ్రోలు శ్రీనగర్ కాలనీకి చెందిన కన్నెటి మురళి(35), కగ్గా లక్ష్మీతిరుపతమ్మ(33) అక్కడికక్కడే మృతి చెందారు పోలీసులు మృతదేహాలను ఏరియా వైద్యశాలకు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

# ఘనంగా నిమజ్జన వేడుకలు



దేవరపల్లిలో గ్రామోత్సవం

పర్చూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలతో శనివారం పర్చూరులో సందడి నెలకొంది. పర్చూరులోని రాములవారివీధి, మధ్య బజారుతో పాటు వివిధ ప్రాంతాల్లో 11 రోజులు పూజలు అందుకున్న గణనాథులను నిమజ్జనానికి చీరాల వాడరేవు తరలించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో విగ్రహాలను అలంకరించి మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. దేవరపల్లి గ్రామస్థులు ఎద్దుల ప్రతిమతో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహ వాహనం భక్తులను ఆకట్టుకుంది. యువకులు, చిన్నా రులు, మహిళలు నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. ఎస్‌ఐ జీవీ.చౌదరి, ట్రైనీ ఎస్‌ఐ పి.గోపి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

### కుటుంబసభ్యుల చెంతకు వృద్ధురాలు

పర్చూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు వెంబడి నిస్సాయ స్థితిలో పడి ఉన్న ఓ వృద్ధురాలను పోలీసులు కుటుంబసభ్యుల చెంతకు చేర్చిన ఘటన పర్చూరులో శనివారం చోటుచేసుకుంది. కదల లేని స్థితిలో పర్చూరు బొమ్మలసెంటర్ సమీపంలోని కూడలిలో ఓ వృద్ధురాలు సాయం కోసం వచ్చే పోయే వారిని చేతులెత్తి వేడుకుంటుంది. వృద్ధురాలి దీనావస్థను గమనించిన ఆంధ్రజ్యోతి పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో మార్టూరు రూరల్ సీఐ జీఎల్.శ్రీనివాసరావు, ఎస్‌ఐ జీ.వి.చౌదరి, ట్రైనీ ఎస్‌ఐ పి.గోపిలు సిబ్బందితో వృద్ధురాలు వద్దకు చేరుకుని 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలు అందించారు. ఈ క్రమంలో వృద్ధురాలు కారంచేడుకు చెందిన కొత్తకోట కోటిరత్నంగా గుర్తించారు. దీంతో శనివారం కుటుంబ సభ్యులకు వృద్ధురాలిని అప్పగించారు. వృద్ధురాలి సమస్యపై స్పందించి కుటుంబసభ్యుల చెంతకు చేర్చిన పోలీసులను ప్రజలు కొనియాడారు.

# యూరియా ఏదయ్యా?

వ్యవసాయ అధికారులను నిలదీసిన రైతులు



గాజుల్లంక పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఎగబడుతున్న రైతులు

కొల్లూరు, భట్టిప్రోలు, అమృతలూరు సెప్టెంబరు 06 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందించాల్సిన యూరియాను పక్కదారి పట్టిస్తున్నారా అంటూ వ్యవసాయాధికారిని రైతులు నిలదీశారు. శనివారం ఆవులవారిపాలెంలోని గాజుల్లంక సొసైటీకి యూరియా వచ్చిందని తెలిసి పెద్దసంఖ్యలో రైతులు వచ్చారు. అడిగినంత ఇవ్వకుండా ఎక్కడికి తరలిస్తున్నారంటూ వ్యవసాయాధికారి నరేంద్రబాబుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుల సిఫార్సులు ఉన్న వారికి కావాల్సినంత అందిస్తున్నారన్నారు. సొసైటీకి వచ్చే క్రమంలో మధ్యలోనే దారి మళ్లించి ఎక్కడికి పంపుతున్నారంటూ ఏవోను నిలదీశారు. దీంతో జోక్యం చేసుకున్న పోలీసులు రైతులను సముదాయించారు. భట్టిప్రోలు మండలంలోని ఐలవరం, ఓలేరు గ్రామాలకు 220 బస్తాల చొప్పున యూరియా లోడు రాగా పెద్దసంఖ్యలో రైతులు తరలి వచ్చారు. వ్యవసాయాధికారుల నిర్లక్ష్యం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో మండలానికి 800 టన్నుల యూరియా వస్తుందని ఏవో బ్రహ్మారెడ్డి రైతులకు తెలిపారు. అమృతలూరు మండలం యలవర్రులో రైతు సేవా కేంద్రానికి 440 బస్తాలు, గోవాడలో సొసైటీకి 220 బస్తాల యూరియా సరఫరా కాగా రైతులకు పంపిణీ చేశారు. అయితే ఆధార్ కార్డుకు ఒక బస్తా చొప్పున ప్రకటించడంతో రైతులు తమ కుటుంబంలో ఉన్న అందరి కార్డులు చూపి యూరియా తీసుకున్నారు. దీంతో ఎక్కువ మంది రైతులకు యూరియా అందలేదు. గాజుల్లంక సొసైటీ సిబ్బంది యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపించారు. సొసైటీ అధ్యక్షుడు వెంకటతిరుపతయ్య అక్కడకు చేరుకుని రైతులకు మిగిలిన చిల్లర ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.



పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

## ప్రతి ఇంటికీ తాగునీరు

● పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రతి ఇంటికీ రోజూ తాగునీరు అందించాలని, ఆదిశగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. సమావేశంలో ఆశాఖ ఇంజనీరింగ్ చీఫ్ ఎం.ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్ సుధాకర్, నెల్లూరు సర్కిల్ సూపరింటెండెంట్ మోహన్, ఒంగోలు పబ్లిక్ హెల్త్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాససంజయ్, ఎస్ఈ నగేష్‌బాబు, డీఈ శ్రీనివాసరావు, గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ రమణబాబు, ఏఈలు సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు ప్రజలకు రోజువారీగా తాగునీరు అందించడం లక్ష్యమని, ఈ నీటి సరఫరా పథకం పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఏఐఐబీ నీటి సరఫరా పథకం అమలుపై సమీక్షించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు తక్షణమే తాగునీరు అందించాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

## పెండింగ్ బిల్లులు వసూలు చేయాలి

● విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు

ఎర్రగొండపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం విద్యుత్ సబ్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న నివాసగృహాల కరెంట్ బిల్లులను వారంలోపు వసూలు చేయాలని ఏపీడీసీఎల్ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు అన్నారు. సబ్ డివిజన్ ఎలక్ట్రికల్ ఉద్యోగులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. వైపాలెంలో 843 ఇళ్ల సర్వీసులు పెండింగ్ బిల్లులు రూ.60లక్షలు, త్రిపురాంతకం మండలంలో 280 సర్వీసులకు సంబంధించి రూ.1,5,072లక్షలు, పుల్లలచెరువు మండలంలో 287 సర్వీసులకు పెండింగ్ బిల్లులు రూ.1,4,060 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. డీఈ నాగేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రంగనాయక స్వామికి ప్రత్యేక పూజలు

రాచర్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీ చెరువు అటవీ ప్రాంతంలోని నెమలిగుండ్ల రంగనాయ స్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూజలు అనంతరం స్వామివారి ప్రసాదాలను అందజేశారు. దర్శనానికి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజల సందర్భంగా ఆలయంలోని పలు సత్రాల్లో భక్తులకు ఉచితంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు కన్నసాని గోపాలరావు, తోట చంద్రయ్య తెలిపారు.

## మొబైల్‌యాప్‌లో ఆర్‌టీఐ సేవలు

● ఆ శాఖ చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ మహబూబ్ బాషా

అద్దంకిటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రూ.1.80 కోట్లతో రానున్న రోజులలో ఫోను నుంచి ఆర్‌టీఐ సేవలను అందజేయనున్నట్లు ఆ శాఖ చీఫ్ సమాచార కమిషనర్ ఆర్‌మహబూబ్ బాష అన్నారు. శనివారం అద్దంకి వచ్చిన ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకర్లతో మాట్లాడారు. 2005లో పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడంతో ఆర్టీఐ చట్టం ఏర్పడిందన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వశాఖ కార్యాలయాలల్లో సమాచార ఆపిలేట్ అధికారులకు రూ.10 చెల్లించి స్టాంపుతో లెటర్ ద్వారా మనకు కావాల్సిన సమాచారాన్ని అడిగి 30 రోజులలోపు తీసుకోవచ్చన్నారు. త్వరలో మొబైల్‌లో కూడా సేవలు అందజేయనున్నట్లు తెలిపారు.



సుజాతనగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంను సన్మానిస్తున్న లైవ్ స్టాక్ సీఈవో శ్రీనివాసరావు

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తోడ్పాటు అందిస్తాం

బల్లికురవ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తమవంతు సహకారం అందిస్తామని ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ ఆథారిటీ సీఈవో ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని ఎస్ఎల్.గుడిపాడు గ్రామ పరిధిలోని సుజాతనగర్ ప్రభుత్వ పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏడాది పాటు విద్యార్థులకు తాము ఉచితంగా మినరల్ వాటర్ అందిస్తామన్నారు. ముందు ముందు విద్యార్థులకు పలు వసతులు కల్పించేలా చర్యలు చేపడతామన్నారు.

అనంతరం పాఠశాల హెచ్‌ఎం గుంటుపల్లి పార్థసారధితో పాటు మరో ఉపాధ్యాయురాలు లావణ్యను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గూగుల్ సంస్థ రీజనల్ ఈఫీసర్ ప్రణవి, ఉపాధ్యాయులు రాజశేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి

అద్దంకి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మండలంలోని మణికేశ్వరానికి చెందిన బండి అరుణ ఈ నెల 1న అద్దంకికి బ్యాంక్ పనినిమిత్తం వచ్చింది. అదే గ్రామానికి చెందిన మురికిపూడి అయ్యన్న మోటార్‌సైకిల్‌పై తిరిగి వెళ్తుండగా నామ్‌రోడ్డులో అద్దంకి పట్టణంలోని వాసవినగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆమెను ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు స్థానిక పోలీసులకు సమాచారం అందింది.



బండి అరుణ (ఫైల్)

# రోగులకు మెరుగైన వైద్య సేవలు

**సీహెచ్‌సీ 50 పడకల ఆసుపత్రిగా మార్పునకు ప్రతిపాదనలు**

**డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మావతి**

అద్దంకిటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యశాలలో మరిన్ని వసతులు, అభివృద్ధి చర్యలు చేపట్టినట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పి. పద్మావతి తెలిపారు. 30 పడకలుగా ఉన్న అద్దంకి సీహెచ్‌సిని 50 పడకల ఆసుపత్రిగా మార్పునకు ప్రతిపాదించినట్లు తెలిపారు. శనివారం సాధారణ తనిఖీలో భాగంగా అద్దంకి సిహెచ్‌సిని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని ల్యాబ్‌లో ఉన్న అధునాతన మిషన్ పనిచేయకపోవడాన్ని ఆమె గమనించారు. వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. వైద్యశాలలో సాధారణ కాన్పులు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వహిల చౌదరి తెలిపారు. ప్రతి రోజు వచ్చే ఓపీలు, ఇన్‌పేషట్‌లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వైద్యశాల అభివృద్ధికి సంబంధించి రూ.40 లక్షలు మంజూరయ్యాయని, సంబంధిత కాంట్రాక్టర్ ఇంకా పనులు ప్రారంభించలేదని వాహిల చౌదరి తెలియజేశారు. త్వరలో పనులు జరిగేలా చూడాలన్నారు. ఆ మె వెంట వైద్యాధికారులు డాక్టర్ అనిత, డాక్టర్ ప్రదీప్తి, డాక్టర్ తేజశ్వని, డాక్టర్ ప్రదీప్‌కుమార్ తదితరులు ఉన్నారు. వైద్యాధికారులు డాక్టర్ పద్మావతిని శాలువతో సత్కరించారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మావతి

## నిర్లక్ష్యమే.. శాపం

(5వ పేజీ తరువాయి)

ఏవీ చేపట్టిన దాఖలాలు లేవు.

**జూలైలో 10 మంది మృతి**

మరణాల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లం అవుతుంది. ఈ ఏడాది జూలైలో తురకపాలెం గ్రామానికి చెందిన 10 మంది వరుసగా మరణించారు. వారిలో అన్ని వయసుల వారు ఉన్నారు. పొలంపల్లి వెంకటేశ్వర్లు(52) గుంటూరు ఫీవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ తర్వాత వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మేల్కొన్నా కొన్ని ప్రాణాలు దక్కి ఉండేవి అన్న వాదన స్థానికంగా వినిపిస్తుంది. గ్రామానికి చెందిన మరణ నివేదిక ప్రతీ నెల చివరిలో ఆరోగ్య కార్యకర్తలు జిల్లా కార్యాలయానికి పంపుతారు. కేవలం 2300 మంది జనాభా ఉన్న చిన్న గ్రామంలో ఒకే నెలలో 10 మంది మరణిస్తే అక్కడ అసాధారణ పరిస్థితి ఉన్నట్లు భావించాలి. అయినా ఏ అధికారి కూడా ఈవిషయం పెద్దగా పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు.

**ఆగస్టులోనూ మరణ మృదంగమే..**

ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం తురకపాలేనికి శాపంగా మారినట్లు కనిపిస్తుంది. జూలైలో అధిక సంఖ్యలో మరణాలు సంభవించిన తర్వాత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి అందరికీ పరీక్షలు నిర్వహిస్తే పెను ప్రమాదం తప్పి ఉండేది. అటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆగస్టులో కూడా గ్రామానికి చెందిన 10 మంది మరణించారు. సెప్టెంబరు నెల మరణాలకు సంబంధించిన వివరాలు అధికారులు ఇంకా బయటకు వెల్లడించలేదు.

**ఫోన్ చేసినా పట్టించుకోలేదు..**

తురకపాలెంలో వరుస మరణాలు సంభవిస్తున్న విషయాన్ని కొందరు ప్రజాప్రతినిదులు ఆరోగ్యశాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలుస్తుంది. జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి కూడా ఫోన్‌లో పరిస్థితిని వివరించినట్లు సమాచారం. అయినా ముఖ్య అధికారులు పెద్దగా స్పందించలేదన్న ఆరోపణలున్నాయి. చివరికి అదే ప్రజాప్రతినిదులు విషయాన్ని రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో జిల్లా అధికారుల్లో కదలిక వచ్చింది. సుమారు 29 మంది మరణించిన తర్వాత వైద్య, ఆరోగ్య శాఖ మేల్కొందన్న విమర్శలున్నాయి.

**రక్తనమూనాలకు తెనాలిలో పరీక్షలు**

తురకపాలెంలో 2500 మందికి సంబంధించిన రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించేందుకు వైద్యఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో శనివారం వెయ్యి మంది నుంచి రక్తనమూనాలు సేకరించగా వాటిలో 189 మంది రక్త నమూనాలను తెనాలి జిల్లా వైద్యశాలకు పరీక్షల నిమిత్తం తరలించారు. కొన్నింటిని గుంటూరు సర్వజన ఆస్పత్రికి, మరికొన్ని నమూనాలను విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. వీటిని పరీక్షించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో శనివారం రాత్రి వరకు పరీక్షలు చేపట్టారు. ఇందుకోసం 8 మంది పాథాలజీ నిపుణులు, ఐదుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, డేటా ఎంట్రీ అపరేటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి రంగారావు తెలిపారు. ఆదివారం కూడా మరికొన్ని నమూనాలు తెనాలి వైద్యశాలకు రానున్నాయన్నారు. ఒక్కొక్క రక్త నమూనా నుంచి కంప్లీట్ బ్లడ్ కౌంట్, జీవ రసాయన పరీక్ష, లివర్ ఫంక్షన్ టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా మరణాల గుట్టును గుర్తించే అవకాశం ఉందని తెలిపారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తున్నట్లు ప్రోగ్రాం ఆఫీసర్, ప్రత్యేక అధికారి డాక్టర్ మజీదా తెలిపారు.

## తింటే.. తంటా

(5వ పేజీ తరువాయి)

చిక్కీలు, లడ్డూలు, రాగులు, జొన్నలు, సజ్జలుతో తయారుచేసే పదార్థాలు ఇవ్వాలని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ప్రత్యేకంగా సూచిస్తోంది. 14 ఏళ్ల లోపు పిల్లలకు ఇచ్చే ఆహారంలో కార్బోహైడ్రేట్లు ఉండాలి. ఉడికించిన ఆహార పదార్థాలు ఇవ్వాలి. పాలు, గుడ్లు తోపాటు రెండు రోజలకు ఒకసారి మాంసాహారాన్ని అందించాలి. ఆయా పదార్థాల్లో అధిక ఉప్పు, కారం, నూనె లేకుండా చూడాలి.


**ఆలకించరు.. పట్టించుకోరు**

మద్యపానం, ధూమపానంతో పాటు జంక్ ఫుడ్‌తో ఆరోగ్యానికి హానికరమని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నాయి. జంక్‌ఫుడ్ నుంచి పిల్లలను రక్షించాలంటూ భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ(ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) నిబంధనల్ని జారీ చేసింది. పాఠశాలలకు, వసతిగృహాలకు 50 మీటర్ల వరకు చిరుతిళ్ల దుకాణాలపై నిషేధించారు. దుకాణాల్లో అమ్మే చిరుతిళ్లపై అధికారులు తనిఖీలు చేయాలి. క్యాంటీన్‌లలో మిఠాయిలు, ఫ్రెంచ్‌ఫ్రైస్, బర్గర్లు, చిప్స్, పిజ్జా, సమోసాలు, నూడిల్స్, శీతలపానీయాలు పూర్తిగా నిషేధించింది. అయితే ఆ నిబంధనల్ని ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇక ప్రభుత్వ హెచ్చరికల్ని ఎవరూ ఆలకించడం లేదు. జంక్‌ఫుడ్‌లలో అతి ప్రమాదకరంగా ఉండే రసాయనాలను ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ 2016లో నిషేధించింది. కానీ అవి జంక్‌ఫుడ్ తయారీదారులు వాటిని వాడుతూనే ఉంటారు. రుచి, ఫ్లేవర్, కలర్స్ అధిక తీపి కోసం వాడుతుంటారు. నిషేధిత ప్రోఫైల్‌గానెట్, పోటాషియం బ్రిమెట్, మోనోసోడియం గ్లూటామెట్, డైఏసిటల్‌తో పాటు అధిక తీపిని ఇచ్చే హైఫ్రక్టోజ్‌కార్నసిరప్ వంటి రసాయనాలను జంక్‌ఫుడ్ తయారీదారులు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఈ రసాయనాల వల్ల షుగర్, కిడ్నీ సమస్యలు తలెత్తున్నాయని దీనిపై నిషేధించారు. అయితే వీటిని అటు తయారీదారులు.. ఇటు వ్యవస్థలు పట్టించుకోవడంలేదు. దీంతో మార్కెట్‌లో యథేచ్ఛగా విక్రయాలు జరుగుతున్నాయి.

**తల్లిదండ్రులదే బాధ్యత..**

ఆరోగ్యంపై ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయనుకోవడం అపోహ అవుతుంది. అన్ని చోట్ల అందుబాటులో ఉంటున్న జంక్‌ఫుడ్ నుంచి నుంచి పిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉంది. వారికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందుబాటులో ఉంచే బాధ్యత కూడా పెద్దలదే. సొంతంగా తయారు చేసుకునే ఆహారం నిల్వ ఉన్నా అది అంతగా శరీరంపై ప్రభావం చూపదు. కానీ జంక్‌ఫుడ్ శరీరంలోనే పేరుకుపోయి నాడీ, జీర్ణవ్యవస్థ, మెదడు, గుండెతో పాటు 18 రకాల అవయువాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. జంక్‌ఫుడ్‌కు అలవాటు పడిన పిల్లల ప్రవర్తన కూడా వింతగా ఉంటుంది. విపరీత మనస్తత్వంతోపాటు, చిన్న చిన్న కారణాలకు ఆవేదన చెందుతూ ఆత్మహత్యల వైపు వెళ్తా ఉంటారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

## తురకపాలెం గ్రామస్థులను ప్రభుత్వం ఆదుకోవాలి



చీరాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా తురకపాలెం గ్రామస్థులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వైసీపీ వైద్యుల విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఐ.బాబురావు డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా ఆ ప్రాంతంలో సుమారు 48 మంది కలుషితమైన నీరు తాగి మృత్యువాత పడ్డారన్నారు. ఈ క్రమంలో వెంటనే శుద్ధతాగునీటిని ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

## దేవాలయాలు మూత

అద్దంకి,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యహ్నం 12-30 నుంచి శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరశింహస్వామి దేవాలయాలు మూసివేయనున్నట్లు ఈవోలు తిమ్మానాయుడు, శ్రీనివాసరావులు తెలిపారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం దేవాలయాలు తెరవనున్నట్లు తెలిపారు.

## పలు రూట్లలో అదనపు ట్రిప్పులు

అద్దంకి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం అమలు తరువాత మహిళా ప్రయాణికుల ఆదరణ పెరిగిన నేపధ్యంలో అద్దంకి డిపోలో రోజువారి ఆదాయం రూ.10 లక్షల నుంచి రూ.12.50 లక్షలకు పెరిగిందని, డీఎం రామ్మోహనరావు తెలిపారు. అద్దంకి డిపో పరిధిలో పలు రూట్ల లో అదనపు ట్రిప్పులు నడుపుతున్నట్లు తెలిపారు. అద్దంకి-చిలకలూరిపేట వయా వలపర్ల రూటులో ఉదయం 11-15 గంటలకు, వయా వైదన రూట్‌లో సాయంత్రం 6 గంటలకు, అద్దంకి-ఇంకొల్లు వయా పంగులూరు రూటులో ఉదయం 8-45 గంటలకు, వయా చందలూరు రూటులో ఉదయం 10-15, మధ్యహ్నం 12-15 గంటలకు అదనపు ట్రిప్పులు నడుపుతున్నట్లు తెలిపారు. అద్దంకి-మణికేశ్వరం రూటులో ఉదయం 9-50, రాత్రి 7-30 గంటలకు బస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## 9న 'అన్నదాత పోరు'

అద్దంకి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 9న నిర్వహించే అన్నదాత పోరు కరపత్రాలను శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నాగార్జున ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు నరశింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జ్యోతి హనుమంతరావు, కాకాని రాధాకృష్ణమూర్తి, గునుపూడి రఘురామగుప్తా, ఈదా శ్రీనివాసరెడ్డి, అవిశన ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు శింగరకొండలో గిరి ప్రదక్షిణ

అద్దంకి, సెప్టెంబరు6( ఆంధ్ర జ్యోతి): పౌర్ణమి సందర్భంగా శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవాలయం వద్ద ఆదివారం ఉదయం 6 గంటలకు గిరి ప్రదక్షణ ప్రారంభమౌతోందని ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. గిరి ప్రదక్షణ పూర్తయిన తరువాత భక్తులకు స్వామి వారి దర్శనం ఉంటుందన్నారు.

## కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

అద్దంకి,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి):అద్దంకి పట్టణంలోని విద్యానగర్ లో నివాసం ఉండే కానిస్టేబుల్ భార్య ఉష(34)ఆత్మహత్య కు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తిరుపాల్‌రెడ్డి శనివారం విధులకు వెళ్లిన అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భార్య ఉష ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన ఉష కుమార్తె తాతకు ఫోన్ చేసింది.

భర్త, బంధువులు ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతి చెంది ఉంది.

మానసిక సమస్యతో బాధపడుతుండటంతో ఒంగోలు లోని ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

## గంజాయి అక్రమ రవాణాపై దాడులు

● నెల్లూరు, ఒంగోలు, చీరాల రైల్వేస్టేషన్లలో నలుగురి అరెస్ట్

● 17.600 కేజీల గంజాయి స్వాధీనం

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడిలో భాగంగా నెల్లూరు, ఒంగోలు, చీరాల రైల్వే స్టేషన్లలో పలు రైళ్లను తనిఖీ చేసి, 17.600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ మురళీధర్ తెలిపారు. శనివారం నెల్లూరు రైల్వేస్టేషనులోని తన కార్యాలయంలో ఆయన ఈ కేసుల పూర్వాపరాలను వెల్లడించారు. నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్‌లు తమ సిబ్బందితో కలిసి నెల్లూరు స్టేషన్‌లో పలు రైళ్లలో తనిఖీలు చేశారు. టాటా-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులో అనుమానాస్పదంగా ఉన్న కర్నాటక రాష్ట్రం కోలార్ జిల్లా చిక్‌బళ్లాపూర్‌కు చెందిన కె వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ఆయన బ్యాగులో నుంచి 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసినట్లు విచారణలో నిందితుడు తెలిపినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన, ఆర్పీఎఫ్ ఎస్ఐ కొండయ్య, సిబ్బందిని అభినందించారు.

● ఒంగోలులో పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న తమిళనాడులోని శాలిగ్రామ్ జిల్లాకు చెందిన ప్రేమ్‌చంద్, కొండితోపే ప్రాంతానికి చెందిన మనీష్ దూబేలను అరెస్ట్ చేసి, 7.600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అలాగే, చీరాల రైల్వేస్టేషన్‌లో ధనబాద్-అల్లెప్పి ఎక్స్‌ప్రెస్‌లో కేరళాలోని ఎర్నాకుళం జిల్లా కక్కనాడ్ ప్రాంతానికి చెందిన ఇబ్రహీమ్‌ను అరెస్ట్ చేసి, 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మహా సుదర్శన యాగంలో పాల్గొన్న భక్తులు

## వైభవంగా మహా సుదర్శన యాగం

చినగంజాం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామంలోని సీతారామాలయం ప్రాంగణంలో మహాసుదర్శన యాగం కార్యక్రమాన్ని భక్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. సీతారామాలయం ప్రాంగణంలో వేదపండితులు త్రినాథ్ చక్రవర్తి అయ్యావార్ల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు దంపతులతో సుదర్శన యాగాన్ని నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి అతి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. యాగంలో వేదపండితులు ప్రతి ఒక్క భక్తుడితో సంకల్పం చేయించారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించనున్నట్లు ఆలయ ధర్మకర్త మోటుమర్రి రామసుబ్బారావు, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వలివేటి వెంకట రామాంజనేయులు తెలిపారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈ.వో ఎం.శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, టీడీపీ నాయకులు నక్కల వీరరాఘవులు, సందు శ్రీనివాసరావు, కొండ్రగుంట శ్రీహరి, టి.జయరావు, తొగరు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



పెదరావిపాడులో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌వో పద్మశ్రీ

## నిత్యావసర సరుకుల పంపిణీని వేగవంతం చేయాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్‌షాపు డీలర్లు నిత్యావసర సరుకులను నిర్ణీత గడువులోగా ఎక్కువమంది కార్డుదారులకు అందించాలని డీఎస్‌వో పద్మశ్రీ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని పెదరావిపాడు రేషన్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు సరుకులు అందజేయాల్సి ఉందన్నారు. కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సరుకులు అందజేయాలని డీలర్ చించు వీరనారాయణను ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గేదెలు

## గుర్తుతెలియని వాహనం ఢీకొని 8 గేదెలు మృతి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని 8 గేదెలు మృతిచెందాయి. ఈఘటన శుక్రవారం రాత్రి సీఎస్‌పురం మండలం కంభంపాడు - కోవిలంపాడు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. రాత్రిపూట రహదారిపై గేదెలు సంచరిస్తుండటంతో కనపడక వాహనం ఢీ కొన్నట్లు తెలుస్తోంది.



మన మిత్ర యాప్‌పై కొల్లావారిపాలెంలో ఇంటింటా అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో వెంకటస్వామి

## మన మిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీడీవో వెంకటస్వామి

పర్చూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మన మిత్ర యాప్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో వెంకటస్వామి సూచించారు. శనివారం మండలంలోని కొల్లావారిపాలెం గ్రామ సచివాలయాలన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. సమయ పాలన పాటించాలని ప్రభుత్వ సర్వేలు అన్నీ పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న 709 రకాల సేవలను మన మిత్ర వాట్సాప్ 9552300009 నెంబర్ ద్వారా వివిధ శాఖలకు సంబంధించిన సేవలను పొందవచ్చన్నారు. అనంతరం యాప్‌ను ప్రజలు ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఇంటి తలుపులు పగులకొట్టిన దుండగులు

మద్దిపాడు,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం మల్లవరంలో ఉన్న సంతనూతలపాడు మాజీ ఎంఎల్‌ఏ టీజేఆర్ సుధాకర్ బాబు ఇంటి తలుపులను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి పగులకొట్టారు. వివరాల్లోకి వెళితే... ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో సుధాకర్ బాబు మల్లవరం గ్రామంలో ఇల్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం విజయవాడలో నివాసం ఉంటున్నారు.ఆ ఇంటికి కాపాలాగా ఓ వ్యక్తిని నియమించాడు. ఆ వ్యక్తి అనారోగ్య కారణంతో శుక్రవారం ఇంటివద్దనే ఉండిపోయాడు. ఇంటికి కాపలాలేని విషయాన్ని గుర్తించిన దుండగులు ఇంటి మెయిన్ తలుపులతో పాటు, లోపలి తలుపులను, గడియలను,తాళాలను గడ్డపారలతో పగులకొట్టారు. అయితే ఇంటిలో ఏమి దొంగతనం జరిగింది., దుండగులు ఏమి తీసుకువెళ్లారనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు వద్దసూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పైనం శ్రీనివాసరావు మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో దొంగతనం గురించి ఫిర్యాదు చేశారు.

## అవీ..ఇవీ..

### గుండెపోటుతో వైదన సర్పంచ్ జయలక్ష్మి మృతి



మేడా జయలక్ష్మి (ఫైల్)

బల్లికురవ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైదన గ్రామ సర్పంచ్ మేడా జయలక్ష్మి(65) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. వైదన గ్రామ సర్పంచ్‌గా నాలుగున్నరేళ్లుగా పనిచేస్తున్న జయలక్ష్మి ఉన్నట్టుండి ఒక్కసారిగా ఇంట్లో ఉండగానే గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు అమెకు ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు కలరు. సర్పంచ్ మృతదేహాన్ని పలువురు వైసీపీ నేతలు సందర్శించి నివాళులు అర్పించారు.

### ఔషధ మొక్కల పెంపకానికి ప్రోత్సాహం

- నర్సరీని పరిశీలించిన బోర్డు అధికారులు



ఔషధ నర్సరీను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రదీప్‌కుమార్

లక్ష్మీపురం (చీరాల), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఔషధ మొక్కల నర్సరీ పెంపకదారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందించ నున్నట్లు ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం వేటపాలెం మండలం లక్ష్మీపురంలో ప్రొటెక్ట్ సంస్థ ప్రతినిధులు నిర్వహిస్తున్న ఔషధ నర్సరీను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి కలిగిన రైతులకు తిప్పతీగ, తులసి, నిమ్మగడ్డి, కలబంద తదితర ఔషధ మొక్కలకు బోర్డు నుంచి ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. వాటి ఆవశ్యకతను వివరించారు. అధికారి వెంట నర్సరీ నిర్వాహకులు శవనం చంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

### అధ్యాపకురాలు కవితకు పీహెచ్‌డీ ప్రదానం



పీహెచ్‌డీ పత్రం అందుకుంటున్న కవిత

చీరాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామ కృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు చేతుల మీదుగా ఈసీఈ విభాగ అధ్యాపకురాలు కవితకు పీహెచ్‌డీ డిగ్రీ అందుకున్నారు. 'డిజైన్, ఫాబ్రికేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ మెమ్స్ బేస్డ్ కెపాసిటివ్ ప్రెజర్ సెన్సార్ ఫర్‌లో ప్రెజర్ బయో మెడికల్ అప్లికేషన్స్' అంశంపై పరిశోధన చేసిన నేపథ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పట్టా పొందారు. దీంతో శనివారం కళాశాలలో నిర్వాహకులు ప్రత్యేకంగా కవితను అభినందించారు.

### మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషిచేయాలి

మార్టూరు, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ మాదకద్రవ్యాల నిర్మూలనకు పొదుపుగ్రూపుల సభ్యులు, రైతులు, రైతు సంఘాల నాయకులు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ పి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మార్టూరులో వెలుగు శిక్షణ కార్యాలయంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, దిశ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ.సాగర్ ఆధ్వర్యంలో మండలంలోని పొదుపు సంఘాల వీవోలకు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిదిగా విచ్చేసిన పీడీ శ్రీనివాసరావు పలు విషయాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం రవీంద్రబాబు, సురేంద్రబాబు, మోహనరావు, నాయక్, సామ్రాజ్యం పాల్గొన్నారు.

### పశువులకు వైద్యపరీక్షలు

మార్టూరు, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కోనంకి పశువైద్యశాల ఆధ్వర్యంలో శనివారం వలపర్ల గ్రామంలో పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 52 పశువులకు గర్భకోశ వ్యాధులకు మందులును, 60 దూడలకు నులిపురుగులమందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్టూరు ఏడీఆర్ శ్రీనివాసరావు, పశువైద్యాధికారులు జగదీష్, శారద, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

### రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

మార్టూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో ఏడుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులను సత్కరించారు. రోటరీ క్లబ్ వారు ఉపాధ్యాయులు ప్రసాద్, తులసిలక్ష్మి, నాగేశ్వరరావు, పెద్దబ్బాయి, వెంకట శ్యామలాదేవి, సునీత, మణికుమారిలను శాలువా కప్పి సత్కరించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎంపీడీవో రాంబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు మాదాల సాంబశివరావు, రావి అంకమ్మచౌదరి, చెరుకూరి నాగేశ్వరరావు, జాష్టి సాంబశివరావు, ఇంటూరి ఆంజనేయులు, ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, షేక్ కాజాహుస్సేన్ పాల్గొన్నారు.

### నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రామ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ దామోదరం తెలిపారు. పట్టణంలోని రామ్‌నగర్, ఒంగోలు రోడ్డు, రాజీవ్‌కాలనీ, గ్యాస్‌గోడౌన్‌రోడ్డు, నర్రావారిపాలెం, బలిజపాలెం, శ్రీనగర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

# కోలాహలంగా వినాయక నిమజ్జనాలు

- లడ్డూలను దక్కించుకొనేందుకు భక్తుల పోటీ
- పర్చూరులో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

చీరాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని 24వ వార్డు తూర్పుకాపు బజారులోని శ్రీలక్ష్మీ గణపతి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి మహోత్సవాలు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేషుని నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కేరళ నృత్య ప్రదర్శనలు, చిన్నారుల కర్రసాము అందరినీ అలరించింది. భక్తులు ఆద్యాంతం భారీగా తరలి వచ్చారు. ఊరేగింపు ప్రారంభోత్సవానికి ముందు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**రూ. 48 వేలు పలికిన లడ్డూ**

బల్లికురవ : వినాయకచవితి పండగ సందర్భంగా గ్రామాలలో ఏర్పాటు చేసిన గణనాథుల నిమజ్జన వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని గుంటుపల్లి దక్షిణం బజారులో ఏర్పాటు చేసిన గణనాదుడు 9 రోజుల నవరాత్రులు పూజలు అందుకొని నిమజ్జనానికి తరలి వెళ్లాడు. ఈ గ్రామంలో గణేష్‌ని లడ్డును సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బిళ్లపాటి శ్రీనివాసరావు వేలంలో రూ.48 వేలకు దక్కించుకొన్నాడు. అలానే ముక్తేశ్వరం గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాధుడి నిమజ్జన వేడుకలను గ్రామస్తు లు సమష్టి కృషితో నిర్వహిం చారు. సమీపంలోని ఏబీసీ కాలవలో నిమజ్జనం చేశారు. అన్ని గ్రామాలలో గణేష్ విగ్రహాల నిమజ్జనం శనివారంతో పూర్తయ్యింది.

**కోలాహలంగా గణనాధుని నిమజ్జనం**

పంగులూరు : మండలంలోని తూర్పుకొప్పెరపాడు గ్రామంలో గణనాధుని నిమజ్జనోత్సవం గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొమ్మిదిరోజులుగా ప్రత్యేక మండపంలో కొలువుదీరిన గణనాదునికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన ఉత్సవ కమిటీ శనివారం నిమజ్జనో త్సవం నిర్వహించారు. కోలా హలంగా సాగిన ఈ ఉత్సవంలో యువత, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవకమిటీ అన్నదాన కార్యక్రమం నిర్వహించింది.

**దేవరపల్లి లడ్డూకు రికార్డు ధర**

దేవరపల్లి (పర్చూరు) : మండలంలోని దేవరపల్లిలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుని పందిరి వద్ద స్వామివారికి సమర్పించిన లడ్డూకు నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన తోకల నాగగౌతమ్ సాయి రూ.3.10 లక్షలకు దక్కించుకున్నారు. లడ్డూ కోసం వేలంలో పోటీ ఎక్కుగా సాగింది. వేలంలో దక్కించుకున్న లడ్డూతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వినాయక పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన స్వామివారి లడ్డూను దక్కించుకుంటే శుభం కల్గుతుందని భక్తుల నమ్మకం. అలాగే పర్చూరు లోని తూర్పువారి వీధిలో నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.40వేలకు ఆలా అనిల్ దక్కించుకోగా, టీనగర్‌లో నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.27 వేలకు గ్రామానికి చెందిన కాసా అశోక్ కుమార్ దక్కించు కున్నారు.



గుంటుపల్లిలో లడ్డూను దక్కించుకొన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీనివాసరావు

### ఆకట్టుకున్న శోభాయాత్ర



నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

అద్దంకి : నాగులపాడు గొట్టిపాటి యూత్ ఆధ్వర్యంలో వినాయకుడి శోభాయాత్ర శనివారం రాత్రి శోభాయమానంగా నిర్వహించారు. నాగులుప్పలపాడులో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామోత్సవం నిర్వహించి అన్నదానం చేశారు. రాత్రి 8 గంటలకు అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డు లో ప్రారంభమైన యాత్ర 12 గంటల వరకు సాగింది. విద్యుత్ దీపాల వెలుగు లో వినాయకుడి నిమజ్జనోత్సవం సాగింది. రామ్‌నగర్, శ్రీనగర్, ఆర్టీసీ బస్టాండ్, భవానిసెంటర్ మీదుగా దర్శి రోడ్డు లోని గుండ్లకమ్మ నది వరకు సాగింది. దారి పొడవునా భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఎన్‌టీఆర్ విగ్రహం, దేవతామూర్తుల వి గ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేరళ కళాకారుల వాయిద్య ప్రదర్శన సీతాకోక చిలుకల వేషధారణతో నృత్యాలు ఆకట్టుకున్నాయి. టీడీపీ క్లష్టర్ ఇన్‌చార్జ్ కరి పరమేష్, మాజీ సర్పంచ్ కరి శివానందబాబు తదితరులు పాల్గొన్నారు. అద్దంకి పట్టణంతో పాటు పలు గ్రామాల నుండి వేల సంఖ్యలో ప్రజలు తరలివచ్చి శోభాయాత్ర ను తిలకించారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



కేరళ కళాకారుల వాయిద్య ప్రదర్శన





ఊరేగింపులో గణేశుడు, కేరళ నృత్య ప్రదర్శనలు



కత్తితో మహిళ శరీరంపై కొబ్బరికాయను పగులగొట్టిన కళాకారుడి ప్రదర్శన



లడ్డూను దక్కించుకున్న నాగగౌతం సాయి

# పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- వృక్షాలను నరికి మొద్దులు తరలింపు
- అటవీశాఖ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన మాజీ కౌన్సిలర్

అద్దంకి,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): రోడ్ల వెంబడి నీడ ఉండాలన్న దృక్పథంతో ఎంతో శ్రమకోర్చి పెంచి పెద్ద చేసిన చెట్లను ఒక్క గొడ్డలి వేటుతో నేల మట్టం చేశారు. ఈ విషయంపై మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా అటవీ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. 2017 సంవత్సరంలో అప్పట్లో 19వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్న మహబూబ్‌బాషా పలు ప్రాంతాల నుంచి మొక్కలను తెప్పించి నాటి సంరక్షణ చర్యలు చేపట్టారు. సుమారు 7 సంవత్సరాలు పాటు పెరిగిన 4 చెట్లను శుక్రవారం రా త్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. విద్యుత్ లైన్‌లకు అడ్డువస్తే అధికారులు కొమ్మలను మాత్రమే నరికివేస్తుంటారు. కాని అక్కడ ఎలాంటి విద్యుత్‌లైన్‌లు కూడా లేవు. అయితే చెట్లను మొదలుతో సహా నరికి వేశారు. మొద్దులను తరలించి కొమ్మలు మాత్రం అక్కడ వదిలివేశారు. పగలు కాకుండా రాత్రి సమయంలో చెట్లను నరికి మొద్దులను తరలించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు మహబూబ్ బాషా తెలిపారు. ఇప్పటికే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించామన్నారు. ప్రభుత్వం మొక్కల పెంపకం పై ప్రత్యేక దృష్టి పెట్టి పెద్ద ఎత్తున మొక్కలు నాటుతుంటే బాగా పెరిగిన చెట్లు నరకటం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చెట్లు నరికి వేసిన వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మసీదు పక్క బజారులో నరికివేసిన చెట్లు



మొద్దులు తరలించి వదిలివేసిన కొమ్మలు

# అసంపూర్తిగా నిలిచిన తరగతి గదుల నిర్మాణం

- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నత్తనడకన పనులు

పంగులూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పంగులూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతిగదుల నిర్మాణపనులు అసంపూర్తిగా నిలిచాయి. రూ.1.18 కోట్ల నాబార్డునిధులతో 2020లో ప్రారంభించిన ఆరు తరగతి గదుల నిర్మాణపనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అర్ధంతరంగా నిలిచాయి. దీంతో తగిన వసతిలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏడాదికాలంలో నిర్మాణపనులు పూర్తిచేసేలా టెండర్ దక్కించుకున్న అయ్యప్ప కన్‌స్ట్రక్షన్స్‌కు 2023 మార్చి ఆఖరు వరకు గడువు పెంచినా రూ.34 లక్షలకు మించి నిర్మాణ పనులను పూర్తి చేయని పరిస్థితి ఉంది. సమగ్రశిక్షా అభియాన్ వారి పర్యవేక్షణలో సాగిన ఈ భవన నిర్మాణ పనులు గత వైసీపీ హయాంలో ఏళ్ల తరబడి నిర్వహించారు. ఈ నెల 1న పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేసేందుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాఠశాలకు వచ్చిన సందర్భంగా అసంపూర్తిగా నిలిచిన భవననిర్మాణ సమస్యను ఉపాధ్యాయులు మంత్రికి వివరించగా, చర్యలు చేపడతామన్నారు. నిధులుండి ఏళ్ళతరబడి నిర్మాణానికి నోచుకోని తరగతి గదుల నిర్మాణ పనులు మంత్రి గొట్టిపాటి చొరవతో త్వరితగతిన పూర్తయితే గదులకొరత తీరుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.



పంగులూరు ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనం

# కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు చేరిన సైకిళ్లు

బల్లికురవ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందించే కార్యక్రమం కొనసాగుతుంది. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రతి విద్యార్థికి సైకిల్ అందజేసేందుకు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగానే బల్లికురవ మండలంలోని పలు పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సైకిళ్లు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు 900 సైకిల్ కిట్‌లు చేరాయి. వాటిని బిగించి త్వరలో పలు పాఠశాలల్లో మంత్రి రవికుమార్ చేతుల మీదగా, అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యార్థులకు సైకిళ్లు అందజేయనున్నారు. ఈ సైకిళ్లు అందజేస్తే విద్యార్థులు పాఠశాలలకు రావడం ఎంతో సులభం అవుతుందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.



విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న సైకిళ్లు

### సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన



ముని్సిపల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ధర్నా

చీరాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వార్డు సచివాలయాల ఉద్యోగులు పని భారంతో అవస్థలు పడుతున్నారని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఇతర శాఖలకు సంబంధించిన సేవలను కూడా తమకే అప్పచెప్పడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. వారిక సంబంధించిన బాధ్యతలు మాత్రమే కేటాయించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవోస్ ప్రతినిధి శేషుబాబు, అనీల్ కుమార్, ప్రసాద్, ఉద్యోగులు సతీష్, రాధికా, శ్రీనివాసరెడ్డి, శ్రీను నాయక్ తదితర సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**సచివాలయ ఉద్యోగులు నిరసన**

అద్దంకి,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వేలు, వలంటీర్ల విధుల నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు విముక్తి కలిగించాలని ఉద్యోగులు శనివారం నిరసన తెలిపారు. ఆ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. అన్ని పనులకు సచివాలయ ఉద్యోగులను బాధ్యులను చేయడం ద్వారా పనిభారం పెరుగుతోందని సచివాలయ ఉద్యోగుల సంఘం నేత శ్రీనివాసరెడ్డి అన్నారు.

### టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

- వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ అంజమ్మకు ఎమ్మెల్యే సూచన



ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన మల్లెం అంజమ్మ

చీరాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. వడ్డెర కార్పొరేషన్ డైరక్టర్‌గా మల్లెం అంజమ్మను ప్రకటిస్తూ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేను ఆమె శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విశేషంగా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అంజమ్మ చెప్పారు. అలాగే డైరక్టర్‌గా నమ్మకం ఉంచి బాధ్యతలు కల్పించినందుకు తన కర్తవ్యం నిర్వహిస్తానని చెప్పారు. ఆమె వెంట నాయకులు వల్లెపు వేణు, తదితరులు పాల్గొన్నారు.

### సింగిల్‌యూజ్ కవర్లు స్వాధీనం

అద్దంకి,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ కవర్లు నిషేధించిన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు శనివారం అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్ లో పలుదుకాణాలను తనిఖీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి ఆధ్వర్యంలో దుకాణాల్లో కవర్లను స్వాధీనం చేసుకున్నారు. సింగిల్ యూజ్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



### మద్యం మత్తులో యువకుడి మృతి

మార్టూరు, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): మద్యం అతిగా సేవించి యువకుడు మృతిచెందిన ఘటన మార్టూరులోని కొణిదెన మద్యం దుకాణం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకొంది. స్థానిక విజయానగర్ కాలనీకి చెందిన కొమెర వెంకటేశ్వర్లు (38) బేల్దారి పనులకు వెళుతుంటారు. మద్యం సేవించే అలవాటు ఉన్న ఆయన శుక్రవారం సాయంత్రం అధికంగా మద్యం సేవించి, మద్యం దుకాణం సమీపంలో పడిపోయాడు. రాత్రి 11 గంటల తర్వాత స్థానికులు ఆయన్ను గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే అప్పటికే చనిపోయి ఉండటంతో కుటుంబసభ్యులు మృతదేహాన్ని విజయనగర్ కాలనీలోని ఇంటికి తీసుకువెళ్లారు. శనివారం కుటుంబసభ్యులు మృతునికి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

# విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

చినగంజాం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీ.హెచ్.సిరివెన్నెల సూచించారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలోని విద్యార్థినులకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎన్.సుమలత అధ్యక్షతన శనివారం సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ రుతుక్రమం అనేది సహజ ప్రక్రియ అని ప్రతి ఆడపిల్ల తగుజాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి ఇన్‌ఫెక్షన్స్ రాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమలత బాల్యవివాహాలు, ఫోక్సో యాక్ట్, ఆత్మరక్షణ, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి, హెల్త్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చీరాల : విద్యార్థులు ఆరోగ్యకర అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సీడీపీవో ఝాన్సీ అన్నారు. శనివారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల మాసిక శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ పర్యవేక్షకురాలు కుముద్వతి, అంగన్వాడీలు జ్యోతి, కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.





కొప్పెరపాడులో మాట్లాడుతున్న సీడీపీవో సుధ



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి సిరివెన్నెల

బల్లికురవ : కిశోర బాలికలు స్త్రీశక్తిగా ఎదగాలని ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు సీడీపీవో సుధ కోరారు. శనివారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థిని క్రమశిక్షణతో చదువులో రాణించాలని అలానే సమాజంలో పురుషులతో సమానంగా బాలికలు ఎదగాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సలోమి, అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నమ్మాయి, మల్లేశ్వరి, రోజా భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.





## 'సోమశిల'కు 25,822 క్యూసెక్కుల వరద

అనంతసాగరం సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 25,822 క్యూసెక్కుల వరద కొనసాగింది. డ్యాంలో 67.380 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,300, డెల్టాకు 1,850 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

## పరిశ్రమలకు శుద్ధిజలం

- ఇందుకు అవసరమైన డీపీఆర్‌ను రూపొందిస్తున్నాం
- పారిశుధ్య నిర్వహణపై పొరుగు రాష్ట్రాల్లో అధ్యయనం
- వంద అక్రమ భవనాలపై చార్జిషీట్
- లోక్ అదాలత్‌లో సెటిల్‌మెంట్ చేసుకోవాలి
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 200 ఆటోలు తెప్పిస్తున్నాం
- 'ఆంధ్రజ్యోతి'తో కార్పొరేషన్ కమిషనర్ నందన్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జిల్లాలోని కృష్ణపట్నం వద్దనున్న పరిశ్రమలకు నెల్లూరు నుంచి శుద్ధి చేసిన (ఎస్టీపీ) నీటిని సరఫరా చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ వైవో నందన్ తెలిపారు. అలాగే మురికివాడల్లో పారిశుధ్యం మెరుగును ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టబోయే పలు అభివృద్ధి అంశాలను కమిషనర్ తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



'అల్లీపురం, అక్కచెరువుపాడు, వెంకటేశ్వరపురం ప్రాంతాలలోని ఎస్టీపీల ద్వారా 40 ఎంఎల్డీ నీళ్లు శుద్ధి చేస్తున్నాము. వాటిని కృష్ణపట్నం వద్దనున్న పరిశ్రమలను సరఫరా చేసేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నాం. దీని ద్వారా ఎన్ఎంసీ ఖజానాకు ఆర్థిక లబ్ధి చేకూరుతుంది. అలాగే నగరంలోని మురికివాడల్లో పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాము. ఇందులో భాగంగా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో అమలవుతున్న పారిశుధ్య నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం నన్ను అధ్యయనానికి పంపింది. వాటిల్లో ఫలితాలిచ్చే అంశాలను నెల్లూరులో అమలు చేసేందుకు పరిశీలిస్తున్నాము. గండిపేటలో మురుగునీటిలోని వ్యర్థాల మేనేజ్‌మెంట్ ప్లాంటు ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. తెలంగాణలోని జవహర్‌నగర్‌లో చెత్తనుంచి కరెంట్ తయారీతో రోజుకు 5 లక్షల యూనిట్ల ఉత్పత్తి జరుగుతోంది. సిద్దిపేట, సూర్యపేట ప్రాంతాలలో ప్రజల భాగస్వామ్యంతో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ బాగుందని గుర్తించాము.

### వంద అక్రమ భవనాలపై చార్జిషీట్

దేశంలో ఎక్కడ లేనంతగా భవన నిర్మాణ అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం సులభతరం చేసింది. అయినా అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. నెల్లూరులో ఇలాంటి భవనాలను సచివాలయాల ద్వారా గుర్తించాము. 166 సచివాలయాల పరిధిలో 100 భవనాలను గుర్తించి వాటి యజమానులపై చార్జిషీట్ దాఖలు చేశాము. వీరంతా త్వరలో జరుగు లోక్‌అదాలత్‌లో సెటిల్‌మెంట్ చేసుకోవాలి. అనధికారికంగా వేసిన లేఅవుట్లు, అక్రమంగా నిర్మించిన భవనాలు ఎప్పటికైనా సమస్యేనన్న విషయం వాటి యజమానులు గుర్తించాలి. నెల్లూరులోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో దుకాణాలన్నీ ఆన్‌లైన్ చేస్తున్నాము. ఎవరైనా అద్దె చెల్లించకపోతే ఆ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో తెలిసిపోతుంది. ఇప్పటి వరకు అద్దె ఎందుకు వసూలు చేయలేదో సంబంధిత అధికారులను గుర్తించి షోకాజు నోటీసులు జారీ చేస్తున్నాం.

### రోజుకు 850 కి.మీ మేర రోడ్లు శుభ్రం

నెల్లూరు నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాము. 26 యంత్రాల ద్వారా నిత్యం నగర పరిధిలో 850 కి.మీ విస్తీర్ణంలో శుభ్రం చేస్తున్నాం. గతంతో పోల్చితే ప్రస్తుతం రోడ్లు క్లీన్‌గా కనబడుతున్నాయి. నూటికి నూరు శాతం ఇళ్ల వద్దే చెత్తను సేకరించేందుకు యంత్రాలను రంగంలోకి దింపనున్నాం. ఇందులో భాగంగా 200 ఈ ఆటోలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా తెప్పిస్తున్నాము. ప్రస్తుతం ట్రాక్టర్లు ఉన్నా అవి ఇళ్ల వద్దకు వెళ్లలేక చెత్తసమీకణ సవాల్‌గా మారింది. ఆటోలు వస్తే ఆ సమస్య ఉండదు.' అని కమిషనర్ అన్నారు.

- నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)



## ఏందుకంత నిర్లక్ష్యం!



- పీహెచ్‌సీల పనితీరుపై గ్రేడ్‌ల కేటాయింపు
- జిల్లాలో ఒక్క కేంద్రానికీ దక్కని ఏ గ్రేడ్
- బీ గ్రేడ్‌లో 8, సీలో 32, డీలో 11 కేంద్రాలు
- ఆఖరిస్థానం ఈ గ్రేడ్‌లో దుత్తలూరు
- రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా దక్కని ఫలాలు
- సరైన వైద్యసేవలు అందక గ్రామీణుల అవస్థలు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రతినెల గ్రేడ్‌లను ప్రకటిస్తుంది. ఆయా కేంద్రాల పనితీరు ఆధారంగా ఈ గ్రేడ్‌లను కేటాయిస్తుంటారు. తాజాగా జూలై మాసానికి సంబంధించిన గ్రాడ్‌లను ప్రకటించగా, జిల్లాలోని ఏ పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ దక్కలేదు. బీ, సీ, డీ, ఈ గ్రేడ్‌లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆయా ఆసుపత్రులకు ప్రతి రోజూ ఎంతమంది అనారోగ్యంతో వస్తున్నారు. వారికి అందించే వైద్య పరీక్షలు, గర్భిణు లకు అందుతున్న సేవలు, ప్రస వాలు వంటి వాటిని పరిశీలించి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ గ్రేడ్‌లు కేటాయిస్తుంది. జిల్లావ్యాప్తంగా 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా దుత్తలూరు కేంద్రం ఈ గ్రేడ్‌లో పూర్తిగా వెనుక బడి ఉంది. ఇక్కడ ప్రజలకు వైద్య సేవలు సరిగ్గా అందటం లేదన్న విషయంపై ఎవరెన్ని విమర్శలు చేసినా.. అధికారులు అక్షింతలు వేస్తున్నా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మాత్రం మార్పు రావడం లేదు. యేటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పల్లెజనానికి మాత్రం సరియైన వైద్యం అందనంటోంది. ఇందుకు నిదర్శనం తాజాగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసిన గ్రేడ్‌ల జాబితానే. జిల్లావ్యాప్తంగా 52 పీహెచ్‌సీలు ఉండగా ఒక్క దానికి కూడా 'ఏ' గ్రేడ్ దక్కలేదు. చెప్పుకోదగ్గ స్థాయిలో బీ గ్రేడ్‌లో 8 కేంద్రాలు ఉన్నాయి. దుత్తలూరు పీహెచ్‌సీకి చివరి గ్రేడ్ దక్కింది. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే చిరమన, మహ్మదాపురం, వలేటివారిపాళెం, సీతారామపురం వంటి 29 కేంద్రాలలో అసలు ప్రసవాలే జరగలేదని ఆరోగ్య శాఖ తాజా బులెటిన్ వెల్లడిస్తోంది. కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించాలన్న ఉద్దేశంతో ప్రతి ఏడాది నేషనల్ రూరల్ హెల్త్ కింద జిల్లాకు రూ.30 కోట్లకుపైగా విడుదల చేస్తుంది. ఒక్కో పీహెచ్‌సీకి ఆసుపత్రుల నిర్వహణ అత్యవసర మందుల కోసం రూ.1.75 లక్షలు వంతున కేటాయిస్తారు.



దుత్తలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

### ఏ గ్రేడ్ పీహెచ్‌సీలు ఏవి..?

తాజా బులిటెన్‌లో జిల్లాలోని ఏ పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ రాలేదు. దీన్నిబట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు ఎలా ఉందో తెలుస్తోంది. రాష్ట్రంలోని 1,145 పీహెచ్‌సీలలో 163 వ స్థానంలో రామతీర్థం, 204వ స్థానంలో విడవలూరు (జిల్లాలో 1, 2 స్థానాలు) వైద్యసేవల్లో మెరుగ్గా నిలిచాయి. చిరమన, మహ్మదాపురం, మాచవరం, జగదేవిపేట, వలేటివారిపాళెం, సీతారామపురం, లింగసముద్రం పీహెచ్‌సీలు తరువాత స్థానాలలో నిలిచాయి. ఇక బీ గ్రేడ్‌లో 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీ గ్రేడ్‌లో 32, డీ గ్రేడ్‌లో 11 పీహెచ్‌సీలు నిలిచాయి. ఈ గ్రేడ్‌లో 1 దుత్తలూరు పీహెచ్‌సీ మాత్రమే ఉంది. మొత్తం మీద జిల్లాలోని పీహెచ్‌సీలు 55 శాతం ప్రజలకు వైద్య సేవలు అందించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఓపీ వైద్యసేవలలోపాటు 1 ప్రసవం, 5,17 రకాల పరీక్షలు నిర్వహించినందుకు రామతీర్థం అగ్రస్థానంలో నిలిచింది.

### ప్రత్యేక దృష్టి పెడుతున్నాం

పీహెచ్‌సీలను ఏ గ్రేడ్‌లో నిలిపేందుకు కృషి చేస్తున్నాము. ప్రతిరోజూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును పరిశీలిస్తూ ఎక్కడ లోపాలు ఉన్నాయో తెలుసుకుని వాటిని సరిదిద్దుతున్నాము. గర్భవతులకు అందించే వైద్యసేవలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ప్రతి పీహెచ్‌సీలలో ప్రసవాలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. అలాగే సాధారణ వైద్య చికిత్సలకు ప్రాధాన్యత ఇవ్వాలని కూడా సూచిస్తున్నాము.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

## యూరియా కొరత లేదు!

### 2,471 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయ్!

**కలెక్టర్ ఆనంద్ వెల్లడి**

నెల్లూరు (వ్యవసాయం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దాదాపుగా 2,471 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిరంతరాయంగా యూరియాను సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు తప్పనిసరిగా తమ వేలిముద్రలు నమోదు చేసి యూరియా కొనుగోలు చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల సిఫార్సు చేసిన మోతాదు మేరకే యూరియాను వినియోగించాలని రైతులకు సూచించారు. అధికంగా ఎరువులు వాడటం వల్ల చీడపీడలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తుంటే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే 8331057285 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

## డీకేడబ్ల్యూ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గృహ విజ్ఞానశాస్త్ర విభాగం పర్యవేక్షణలో న్యానీ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో కుటుంబంలోని తల్లిదండ్రులిద్దరూ వారివారి వృత్తుల కారణంగా పిల్లల సంరక్షణకు సరైన సమయం కేటాయించలేకపోతున్న సంఘటనలు చూస్తున్నామన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఏడాది కాలం ఉండే న్యానీ సర్టిఫికెట్ కోర్సు ను ఈనెల 15 నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. టెన్త్ ఉత్తీర్ణత సాధించి, 40 ఏళ్ల లోపు ఉండే మహిళలు కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

## స్కూల్‌గేమ్స్ ఎంపికల షెడ్యూల్ విడుదల

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే స్కూల్‌గేమ్స్ ఎంపికల షెడ్యూల్ విడుదల చేసినట్లు డీవీఈవో కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17, 19 బాలబాలికలకు ఈనెల 10న ఆర్చరీ, గట్కా, సెపక్ తక్రా ఎంపికలుంటాయన్నారు. 11న ఫెన్సింగ్, కురాష్, ఊషు, ఫుట్‌బాల్, 14న సైక్లింగ్, కరాటే, మాల్‌కంబ్, సాఫ్ట్‌బాల్, 15న జూడో, కలారియపట్టు, షూటింగ్, నెట్‌బాల్, 16న స్క్వాష్, టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, 17న బాక్సింగ్, మోడరన్ పెంథలాన్, టేబుల్‌టెన్నిస్, వాటర్‌పోలో, రగ్బీ, 18న జిమ్నాస్టిక్స్, తైక్వాండో, స్విమ్మింగ్, 19న మార్షల్ ఆర్ట్స్, స్కేటింగ్, రెజ్లింగ్ ఎంపికలు చేపడతామన్నారు. ఎంపికలు పూర్తయిన తరువాత ఈనెల 23 నుంచి 26 వరకు అంతర్‌జిల్లాల పోటీలుంటాయని తెలిపారు.

## నేడు రాహుగ్రస్త చంద్ర గ్రహణం

- రాత్రి 9.57 గంటలకు ప్రారంభం.. తెల్లవారుజాము 1.26 గంటలకు ముగింపు
- మధ్యాహ్నం నుంచే ఆలయాల మూత

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం సంభవిస్తోంది. ఈసారి గ్రహణం ప్రజలందరికీ స్పష్టంగా కనిపించనుంది. రాత్రి 9.57 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభం కానుండగా, తెల్లవారుజాము 1.26 ముగుస్తుంది. గ్రహణ కాలంలో ఉపవాసం, మంత్రజపం, దానధర్మాలు చేయాలని పండితులు చెబుతున్నారు. తద్దినాలు పెట్టుకునే వారు ఆదివారం మధ్యాహ్నం 1.20 గంటలలోపు జరుపుకోవాలి. గర్భిణులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలి. కత్తెర, సూది పనులు చేయరాదు. ఈ గ్రహణం కొందరికి ఆధ్యాత్మిక పరంగా శ్రేయస్కరమైతే, మరికొందరికి శాంతి జపాలు అవసరం. చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలోని అన్ని ఆలయాలను ఆగమాలను బట్టి మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8.30 గంటలలోపు మూసివేయనున్నారు. సంప్రోక్షణలు అనంతరం సోమవారం ఉదయం భక్తులకు దర్శనఅవకాశాలు కల్పిస్తారు.

## రోడ్డు మార్గాన కాదు.. రైళ్లలోనే!

- ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి రవాణా
- ఏడు నెలల వ్యవధిలో 11 కేసులు
- 103 కేజీల గంజాయి స్వాధీనం, 12 మంది అరెస్ట్
- వైసీపీ హయాంలో గాలికి వదిలేసిన వైనం
- ఐదేళ్లలో కేవలం ఆరు కేసులే నమోదు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అక్రమ రవాణాను కూకటి వేళ్లతో సహా పెకలించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా సాధ్యం కావడం లేదు. మొన్నటిదాకా రోడ్డు మార్గాన రవాణా చేస్తున్న అక్రమార్కులు ఆ వైపు పోలీస్ తనిఖీలు ఎక్కువవడంతో రైళ్లను ఎంచుకున్నారు. ఇక్కడ పెద్దగా తనిఖీలు ఉండవన్న భావనతో ఏజెన్సీ ప్రాంతాల నుంచి గుట్టు చప్పుడు కాకుండా జిల్లాకు దిగుమతి చేస్తున్నారు. గత వైసీపీ హయాంలో నెల్లూరు, గూడూరు రైల్వేస్టేషన్లు అడ్డాగా మారి గంజాయి అక్రమ రవాణా జోరుగా సాగింది. ఇక్కడ దిగుమతి చేసుకున్న స్మగ్లర్లు జిల్లా వ్యాప్తంగా చిన్న చిన్న ప్యాకెట్లు చేసి అమ్మకాలు సాగించారు. ఆ ఐదేళ్లలో కేవలం ఆరు కేసులు మాత్రమే నమోయ్యాయి. 2022లో ఒకటి, 2023లో 4, 2024 ఒక కేసు మాత్రమే నమోదవడం చూస్తుంటే అప్పట్లో గంజాయి రవాణా నిరోధంలో ఏమటుకు గాలికి వదిలేశారో అర్థమవుతోంది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్‌తోపాటు జీఆర్పీఎస్ పోలీసులు, రైల్వే, స్థానిక పోలీసులు నాలుగు విభాగాలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గంజాయి రవాణాపై వరుసగా దాడులు చేస్తున్నారు.

### రైల్వేస్టేషన్లలో నిఘా

ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక బృందాలు వరుస దాడులు నిర్వహిస్తూ గంజాయిని తరలిస్తున్న వారిని అరెస్ట్ చేస్తున్నారు. ఒడిశా, విశాఖ ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లపైనే ప్రత్యేక రైల్వే పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు 11 కేసుల్లో 103 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని, 12 మందిని అరెస్ట్ చేశారు.

### నిరంతర తనిఖీలు

ఈగల్, జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో నిరంతరం దాడులు చేస్తున్నాము. ఒడిశా, రాయగడ్, విశాఖపట్నం ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము. గంజాయి విక్రయాలపై సమాచారం ఉంటే రైల్వే పోలీసులకు అందించాలని ప్రజలను కూడా కోరుతున్నాము.

- జీ మురళీధర్, రైల్వే డీఎస్పీ



నిందితుల వివరాలు తెలుపుతున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

## నెల్లూరు, ఒంగోలు, చీరాల స్టేషన్లలో నలుగురి అరెస్ట్

- 17,600 కేజీల గంజాయి స్వాధీనం

మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి లో భాగంగా నెల్లూరు, ఒంగోలు, చీరాల రైల్వే స్టేషన్లలో పలు రైళ్లను తనిఖీ చేసి, 17.600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ మురళీధర్ తెలిపారు. శనివారం నెల్లూరు రైల్వేస్టేషనులోని తన కార్యాలయంలో ఆయన ఈ కేసుల పూర్వాపరాలను వెల్లడించారు. నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్‌లు తమ సిబ్బందితో కలిసి నెల్లూరు స్టేషన్‌లో పలు రైళ్లలో తనిఖీలు చేశారు. టాటా- ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులో అనుమానాస్పదంగా ఉన్న కర్నాటక రాష్ట్రం కోలార్ జిల్లా చిక్‌బళ్లా పూర్‌కు చెందిన కె వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ఆయన బ్యాగులో నుంచి 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసినట్లు విచారణలో నిందితుడు తెలిపినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన, ఆర్పీఎఫ్ ఎస్ఐ కొండయ్య, సిబ్బందిని అభినందించారు.

### ఒంగోలులో పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో..

అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న తమిళనాడులోని శాలిగ్రామ్ జిల్లాకు చెందిన ప్రేమ్‌చంద్, కొండితోపే ప్రాంతానికి చెందిన మనీష్ దూబేలను అరెస్ట్ చేసి, 7.600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అలాగే, చీరాల రైల్వేస్టేషన్‌లో ధనబాద్-అల్లెప్పి ఎక్స్‌ప్రెస్‌లో కేరళాలోని ఎర్నాకుళం జిల్లా కక్కనాడ్ ప్రాంతానికి చెందిన ఇబ్రహీమ్‌ను అరెస్ట్ చేసి, 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఓ ముఠా గుట్టురట్టు!

- ఆరుగురి అరెస్ట్.. 23 కిలోల గంజాయి స్వాధీనం
- సూత్రధారి జైలులో ఉన్న ఓ ఖైదీ
- విచారణలో వెల్లడించిన నిందితులు

గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఓ ముఠాను నెల్లూరులోని వేదాయపాలెం పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 23.470 కేజీల గంజాయి, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన కొందరు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారని వేదాయపాలెం సీఐ శ్రీనివాసరావుకు శుక్రవారం రాత్రి పక్కా సమాచారం అందింది. దీంతో ఆయన నెల్లూరు రూరల్ మండలం దొంతాలి అడ్డరోడ్డు సమీపంలో తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా వెళుతున్న ఓ కారును పరిశీలించగా, రూ.2.50 లక్షల విలువ చేసే 23.470 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న నెల్లూరు ముత్యాలపాలెంకు చెందిన పి మహేష్, డి వినీత్, హరనాథపురానికి చెందిన బి సూర్యసాయి, మాగుంటలేఅవుట్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి, గాంధీనగర్‌కు చెందిన షేక్ ఫిరోజ్, సోమశేఖరపురానికి చెందిన టి మల్లికార్జునలను అదుపులోకి తీసుకున్నారు. కారు ముందు బైక్‌పై పైలెట్‌గా వెళుతున్న జాకీర్ మాత్రం పరారయ్యాడు. నిందితలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, తమదైన శైలిలో పోలీసులు విచారించగా ఇప్పటికే మరో కేసులో జైలులో ఉన్న జగదీష్ గంజాయిని దిగుమతి చేసుకుని తమద్వారా విక్రయిస్తున్నట్లు నిందితులు వెల్లడించారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. పరారీలో ఉన్న జాకీర్ కోసం గాలిస్తున్నారు.

**చికెన్ ధరలు**
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 115 |
| స్కిన్ చికెన్ | 212 |
| స్కిన్‌లెస్ | 234 |

కోడిగుడ్ల ధర (100): 545

## నల్లతుమ్మ చెట్ల కోసం చెరువు గట్టు తొలగించడం దారుణం

దగదర్తి (బిట్రగుంట) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొందరు తమ స్వప్రయోజనం కోసం చెరువులో నల్లతుమ్మ చెట్లను నరికేందుకు చెరువు గట్టును తొలగించి వేయడం దారుణమని గ్రామస్తులు అన్నారు. దగదర్తి చెరువులో అక్రమంగా కొన్ని రోజుల నుంచి నల్లతుమ్మ చెట్లను నరికేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో దగదర్తి ట్యాంక్ నీటి సంఘం అధ్యక్షుడు మాలేపాటి సుధాకర్‌నాయుడు స్థానిక రైతులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా చెరువులో చెట్లను నరకడమే కాకుండా, గట్టును తొలగించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక టీడీపీ నాయకులు కంచర్లకృష్ణ, వట్టిగుంటగోపాల్ డిమాండ్ చేశారు. వర్తినేనికృష్ణ, చావ వెంకటేశ్వర్లు, ముప్పాల సురేష్, ముప్వ సుధాకర్ నాయుడు, బత్తల ఏడుకొండలు, షేక్ బషీర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

**న్యూస్ బాక్స్**



### ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు 35 శాతం రాయితీ

● ఏపీఎం ఎం. కృష్ణయ్య

ఉలవపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక మహిళా పొదుపు గ్రూపు సభ్యులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పుటకు కేంద్ర ప్రభుత్వం పీఎంఈజీవైలో భాగంగా బ్యాంకుల నుంచి 35 నుంచి 40 శాతం వరకు రాయితీ రుణాలు ఇవ్వనున్నట్లు ఏపీఎం కృష్ణయ్య తెలిపారు.

?. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహకాలు అందిస్తుంది.

!: గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు గ్రూపు మహిళలు ముందుకు వస్తే యూనిట్ ధరను బట్టి రూ. లక్ష నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి.

?. మండలంలో ఎన్ని స్వయం సహాయక పొదుపు గ్రూపులు ఉన్నాయి.

!: 1510 స్వయం సహాయక మహిళా పొదుపు గ్రూపులు, 45 గ్రామా సమైఖ్య సంఘాలు ఉన్నాయి. వీవోఏల ఆధ్వర్యంలో గ్రామ సమైఖ్య పొదుపు సంఘాలు పనిచేస్తున్నాయి.

?. ఎస్సీ, ఎస్టీలకు అందించే ఉన్నతి పరిస్థితి ఏమిటి.

!: మండలంలోని ఎస్సీ, ఎస్టీ పొదుపు గ్రూపు సభ్యులకు ఇప్పటికి రూ. 16 లక్షల వరకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడం జరిగింది. మొత్తం మీద సభ్యులు ఉన్నతి రుణాన్ని సకాలంలోనే చెల్లిస్తున్నారు.

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందచేయాలి



తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసత్తా నేత శోభన్‌బాబు

కావలి,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి) అర్హులైన లబ్ధిదారులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తప్పకుండా అందేలా చూడాలని ప్రజా సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం కావలి తహసీల్దార్ పీ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఒంటరి మహిళలు, పురుషులకు రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఒంటరి మహిళలకు 35 సంవత్సరాలకే పింఛన్ ఇవ్వాలన్నారు. నివేశన స్థలాలు, ఇళ్ల మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సత్తా నాయకులు మూరబోయిన శ్రీరామచంద్రయ్య, ఎం లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు అభినందనలు

కందుకూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కందుకూరుకు చెందిన జీ ఈశ్వరమ్మ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకుంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మను పలువురు అభినందించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఈశ్వరమ్మ

## గిరిజనుల గ్రీవెన్స్‌కు అర్జీల వెల్లువ

**భూ సమస్యలకు సంబంధించి 62 వినతుల స్వీకరణ**

కావలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతున్నా.. కింది స్థాయిలో చాలావరకు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో గిరిజనుల భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శనివారం కావలి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. కావలి డివిజన్‌లోని పలు మండలాల నుంచి గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చారు కనీసం కుర్చీలు, షామియానాలు కూడా ఏర్పాటు చేయకపోవటంతో బాధితులు ఇబ్బందులు పడ్డారు. ఎండలో కార్యాలయం మెట్ల మీద కూర్చుని నిరీక్షించారు. భూ సమస్యలపై 62 అర్జీలను అందజేశారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌లో ఆయా మండల తహసీల్దార్ కార్యాలయాలలో అర్జీలు స్వీకరిస్తున్నా.. ప్రత్యేక గ్రీవెన్స్‌కు 62 అర్జీలు వచ్చాయంటే అధికారులు సమస్యలను పరిష్కరించడం లేదన్నది స్పష్టమవుతోంది.



ఆర్డీవోకు వినతిపత్రాలు అందజేస్తున్న గిరిజనులు

## వైసీపీని వీడి టీడీపీలోకి...

**ఎమ్మెల్యే సమక్షంలో 110 కుటుంబాల చేరిక**

జలదంకి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం చామదల పంచాయతీలో 110 కుటుంబాలకు చెందిన వైసీపీ సానుభూతిపరులు శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మునగాల వెంకటేశ్వరరెడ్డి, జలదంకి మండల తెలుగుయువత అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డిల ఆధ్వర్యంలో వీరు చామదల నుండి ర్యాలీగా ప్రత్యేక వాహనాలలో వింజమూరుకు తరలివెళ్లారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పసుపు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో కోట కోటిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వి రమణయ్య, డి చెంచురామయ్య, పి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. సంక్షేమ పథకాలతో పాటు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని, అందుకే తాము టీడీపీలో చేరామని వారు తెలిపారు. చామదల పంచాయతీలో ఎమ్మెల్యే తోడ్పాటుతో స్థానిక టీడీపీ నేతలు మునగాల వెంకటేశ్వరరెడ్డి, మునగాల తిరులమరెడ్డిలు పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తూ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారన్నారు. చామదలలో వైసీపీని వీడి భారీసంఖ్యలో టీడీపీలో చేరడంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి పెద్ద షాక్ తగిలినట్లయింది.



ఎమ్మెల్యే కాకర్ల సురేష్, అబ్దుల్ అజీజ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ సానుభూతిపరులు, నాయకులు

### వీఎస్ఆర్‌పేటలో ఓల్టేజ్ సమస్య ఇక లేనట్లే..

బిట్రగుంట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో ఇక నుంచి విద్యుత్‌లో ఓల్టేజ్ సమస్య ఉండదని ఆ శాఖ ఏఈ జడరాయ శనివారం తెలిపారు. లో ఓల్టేజ్ సమస్యను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో వెంటనే సమస్యను పరిష్కరించాలని ఏఈని ఆదేశించారు. లైన్‌మెన్ బ్రహ్మయ్య, సిబ్బందితో కలిసి మసీదు సమీపంలో నూతన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లేల్లపల్లి సుదీర్‌బాబు ప్రారంభించారు. విద్యుత్ లోడ్ డివైడ్ చేయడంతో విశ్వనాథరావుపేట ప్రజలకు ఇక లోటల్టేజ్ సమస్య ఉండదని ఏఈ తెలిపారు.

### మాలకొండ ఆదాయం రూ. 8,35,851

వలేటివారిపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 8,35,851 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 6,650, కుంకుమార్చన ద్వారా రూ. 19,560, వివాహముల ద్వారా రూ. 4 వేలు, తలనీలాలు ద్వారా రూ. 47,875, వాహన పూజలు ద్వారా రూ. 3400, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,07800, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 450, రూముఅద్దెలు ద్వారా రూ. 31,990, కవర్లు ద్వారా రూ. 8,900, లడ్డుప్రసాదం ద్వారా రూ. 1,72,425, అన్నదానం ద్వారా రూ. 2,31,791, విరాళముల ద్వారా రూ. 1000 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ చంద్రశేఖర్ తెలియజేశారు.

### సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులది కీలక పాత్ర

అల్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు పరోక్షంగా కీలక పాత్ర పోషిస్తారని తహసీల్దారు లక్ష్మీనారాయణ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా అల్లూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానసభ ఏర్పాటు చేశారు. ఉత్తమ ఉపాధ్యాయులు కే. హనుమంతరావు, ఏ. ఝాన్సీ, బీ. చంద్రశేఖర్, ఎస్‌డీ పర్వీన్, వై రమేష్, పి సంపూర్ణమ్మ, పీ నాగరాజు, కే సాధనలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాథ్, రామకృష్ణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

### బీజేపీ మండలాధ్యక్షుడిగా కర్రా మధు



కలిగిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లా వద్ద శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్ష ఎంపిక జరిగింది. మండలంలోని క్రాకుటూరుకి చెందిన కర్రా మధును కలిగిరి మండల బీజేపీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మధు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ప్రగతిని ఇంటింటికీ తీసుకెళ్ళి మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బ్రహ్మారెడ్డి, కలిగిరి సొసైటీ చైర్మెన్ కదిరి వెంకట రంగారావు, నాయకులు నందనవనం ప్రభాకర రావు, మేకపాటి మాల్యాద్రి, బెల్లంకొండ మాల్యాద్రి పాల్గొన్నారు.

### జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ చర్యలు

● కావలి నుంచి ఉలవపాడుకు వచ్చే మార్గం మూసివేత

ఉలవపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణలో భాగంగా ఉలవపాడు జాతీయ రహదారిపై డేంజర్ రూట్ మార్గాలను స్థానిక ఎస్సై అంకమ్మ, హైవే అథారిటీ లోకల్ రూట్ అధికారి నర్సింగరావు, రోడ్డు సేఫ్టీ సూపర్‌వైజర్ మధుబాబులు శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా జాతీయ రహదారిపై కావలి నుంచి ఉలవపాడులోకి వాహనాలు వచ్చే ఓపెన్ డివైడర్‌ను సిమెంట్ బ్లాక్‌లతో మూసేశారు. మలుపు తిరిగి ఉలవపాడులోకి వచ్చే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నందున ఆ మార్గాన్ని మూసివేసినట్లు పోలీసులు తెలిపారు. కావలి వైపు నుంచి పట్టణంలోకి వచ్చే వాహనదారులు కొల్లురుపాడు అండర్ పాస్ బ్రిడ్జి మార్గాన తిరిగి ఉలవపాడులోకి రావాలని, ఈ విషయాన్ని వాహన చోదకులు గమనించాలని కోరారు. ప్రమాదాల నివారణ బట్టి సౌత్ బైపాస్ మలుపు మార్గం మూసివేతపై పునరాలోచన ఉంటుందని రోడ్డు భద్రతా అధికారులు తెలిపారు.



నార్త్ బైపాస్‌పై మూసేసిన యూటర్న్ మార్గం

### భావిభారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

లింగసముద్రం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని తహసిల్దార్ ఎం కోటేశ్వరరావు, ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు పేర్కొన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మండ లంలోని 15 మంది సీనియర్ ఉపాధ్యాయులను తహసిల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ-1, 2 కె మాల్యాద్రి, ఎంవి శివకు మార్‌లు ఘనంగా సన్మానించారు.



విద్యా వనరుల కేంద్రంలో సీనియర్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవోలు

### విద్యార్థులకు జీవిత పాఠాలు నేర్పించాలి

● ఉపాధ్యాయులకు సబ్ కలెక్టరు హిమవంశీ సూచన

కందుకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు పుస్తకాల్లోని పాఠ్యాంశాలతో పాటు జీవిత పాఠాలు నేర్పించాలని కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీ సూచించారు. కందుకూరు మండలంలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం శనివారం సాయంత్రం స్థానిక డీఆర్సీలో జరిగింది. ఎంఈఓ ఎం నాగ కుమారశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ కలెక్టరు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధనలో కూడా వినూత్న పద్ధతులు అవలంబించాలన్నారు. ఈసందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి సుశీల, ఎంఈఓ 2 సుబ్బారెడ్డి, చినగంజాం ఎంఈఓ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టరు హిమవంశీని సత్కరిస్తున్న విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు

## కార్మిక చట్టాలను సవరించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మోహనరావు

కావలి(టౌన్) సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను తెచ్చి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు మోహనరావు ఆరోపించారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ 5వ పట్టణ మహాసభ జరిగింది. సీఐటీయూ నాయకురాలు జయంతి కుమారి అధ్యక్షతన జరిగిన మహాసభలో ముఖ్య వక్తలుగా మోహనరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్‌కే రెహనా బేగం పాల్గొని ప్రసంగించారు. కార్మిక యూనియన్లకు సీఐటీయూ అండగా నిలబడి, హక్కుల సాధనకు ఎనలేని కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పెంచలయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, సుభాషిణి, సౌందర్య, వెంకటేశ్వర్లు, రూబెన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు మోహనరావు

### క్లస్టర్ మ్యాపింగ్‌కు వ్యతిరేకంగా సచివాలయ ఉద్యోగుల నిరసన

కావలి, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): వలంటీర్లు చేసే క్లస్టర్ మ్యాపింగ్‌ను సచివాలయ ఉద్యోగుల చేత చేయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం పట్టణంలో సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వలంటీర్లు చేస్తుండిన సేవలను కూడా సచివాలయ ఉద్యోగులపై మోపి పనిభారం పెంచుతు న్నారన్నారు. దీనిపై గ్రామ సచివాలయ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక తీర్మానం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపా లిటీలలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో ఒక క్లస్టర్‌కు ఒక వలంటీర్ చేస్తున్న అన్ని సర్వేలను ఇప్పుడు ఒక సచివాలయ ఉద్యోగికి 2-3 క్లస్టర్లు ఇచ్చి సర్వేలు చేయిస్తున్నారన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

### విజ్ఞానం.. విషయ పరిజ్ఞానం అందించేదే అసలైన విద్య

● విద్యావేత్త, మోటివేటర్ వాసిరెడ్డి అమరనాథ్

కావలి(టౌన్)సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి) విజ్ఞానంతో పాటు విషయ పరిజ్ఞానం అందించేదే నిజమైన విద్య అని ప్రముఖ విద్యావేత్త మోటివేటర్ వాసిరెడ్డి అమరనాథ్ (బాలమిత్ర)పేర్కొన్నారు. స్థానిక పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాకశాల ఆధ్వర్యంలో పాతూరు శివాలయం పక్కన ఉన్న కల్యాణ మండపంలో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఆత్మవిశ్వాసం, సంకల్పంతో పాటు, భావ వ్యక్తీకరణ, సృజనాత్మక నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లుకోదర్, డైరెక్టర్లు ఎస్ వెంకయ్య, నందనవనం మధుసూదన్‌రావు, పీవీఎస్ ప్రసాద్, మట్టా కొండయ్య, మల్లికార్జునరావు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపన్యసిస్తున్న వాసిరెడ్డి అమరనాథ్

## ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన పోకూరి

కందుకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్‌గా నియమితుడైన పోకూరి రాంబాబు శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించటంలో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యేని శాలువాతో ఘనంగా సత్కరించారు.



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును శాలువాతో సత్కరిస్తున్న పోకూరి రాంబాబు

### ఆంజనేయరాజుకు ప్రత్యేక జ్యూరీ అవార్డు

అల్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అల్లూరుకు చెందిన ఆంజనేయరాజుకు మరో ప్రత్యేక జ్యూరీ అవార్డు దక్కింది. ఏకపాత్రాభినయం పోటీల్లో ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఈనెల 5న శ్రీ రామకృష్ణ నాట్యమండలి ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన పోటీల్లో ప్రదర్శించిన 'పెద్దోడు' పాత్రకు ఆయనకు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు.



ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా అవార్డును స్వీకరిస్తున్న ఆంజనేయరాజు

## ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

కలిగిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో శనివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పీ కరుణాకరన్ (పీజీటీ బాటనీ)ను ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ ఏ శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కరుణాకరన్‌ను సన్మానిస్తున్న మోడల్ స్కూల్ సిబ్బంది

## యోగాతో 'ఆరోగ్య' భాగ్యం

కొండాపురం, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్య భాగ్యం లభిస్తుందని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీ రాధాక్రిష్ణ పేర్కొన్నారు. రోజూ యోగా చేస్తే మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుందని, విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత ఉంటుంద న్నారు. శనివారం గరిమెనపెంట జడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, యోగా గురు రవిచంద్ర విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. విద్యార్థులతో పాటు పలువురు ఉపాధ్యాయులు యోగాసనాలు సాధన చేశారు.



యోగాసనాలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

### ఆర్టీవోగా మురళీధర్ బాధ్యతల స్వీకరణ

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): కావలి రీజనల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్‌గా పి. మురళీధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఆర్టీవోగా పనిచేసిన వై. సుధాకర్ రెడ్డి జూలై 31వ తేదీన పదవీ విరమణ చేశారు. అప్పటి నుండి ఎంవీఐ సుందర్‌రావు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం ఆర్టీవోగా పని చేస్తున్న మురళీధర్ బదిలీపై కావలికి వచ్చారు. దీంతో ఎంవీఐ సుందర్‌రావు, అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీభాయ్ ఆర్టీవోను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయ ఏవో సుభాషిణి, సిబ్బంది సునేత్ర, సుబ్రమణ్యం, రమేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు



ఆర్టీవో మురళీధర్‌ను సన్మానిస్తున్న ఎంవీఐ సుందర్‌రావు



## కోనలో శాస్త్రోక్తంగా
# పవిత్రోత్సవాలు

రాపూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో పవిత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఉదయం స్వామివార్లకు చతుస్థానార్చన, వేద, దివ్య ప్రబంధ పారాయణ, విశేష హోమాలు, నివేదన, శాత్తుముర్రై నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, శాత్తుముర్రై ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించామని పెంచలకోన ఆలయ ఉపకమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

# స్త్రీశక్తి... విజయోత్సాహం!

**వింజమూరులో మహిళల భారీ ప్రదర్శన ● పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్**

వింజమూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చంద్రన్న సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ అయ్యాయని, స్త్రీశక్తి పథకం బంపర్ హిట్ అంటూ ఉదయగిరి నియోజకవర్గంలోని నారీమణులు శనివారం వింజమూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బంగ్లా సెంటర్ నుంచి ఎస్వీఎస్ కల్యాణ మండపం వరకు చంద్రన్న నినాదాలతో హోరెత్తించారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితర ముఖ్య నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని అన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని చంద్రబాబు నెరవేరుస్తున్నారని అన్నారు. గడిచిన సంవత్సర కాలంలో ఉయదగిరిలో సుమారు రూ.200 కోట్ల అభివృద్ధి




ర్యాలీలో మహిళలతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల, అజీజ్ తదితరులు

కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. మహిళల ఉపాధి కోసం ప్రయత్నం చేస్తున్నారని, పరిశ్రమల ద్వారానే అది సాధ్యమన్నారు. అనంతరం ఎస్వీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు మన్నేటి వెంకటరెడ్డి, ఎల్సీ రమణారెడ్డి, ఎంపీపీ శిరీషా తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి,భూదేవి సమేత రంగనాథుడు

## కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శనివారం నాటికి ఆరో రోజుకి చేరాయి. ఈ సందర్భంగా ఉదయం నిత్యహోమాలు, తీర్థ ప్రసాదాల వినియోగం, సాయంత్రం గోపురోత్సవం, రాత్రి హోమాలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయకర్తలుగా తల్పగిరి రంగనాథస్వామి భక్త బృందం వ్యవహరించింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు. కాగా పవిత్రోత్సవాలు ఆదివారం ముగుస్తాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



# సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు

**వంద మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి టెండర్లు**

**స్థల సేకరణలో అధికారులు**

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే సబ్సిడీపై గృహాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునేలా పెద్దఎత్తున చర్యలు చేపట్టిన ప్రభుత్వం, తాజాగా ప్రతి జిల్లాలోనూ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో పెద్దఎత్తున విద్యుత్ ఉత్పత్తిని చేసేలా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లాలోనూ తొలివిడతలో వంద మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుడుతున్నది. విద్యుత్ శాఖ, నెట్‌క్యాప్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో జిల్లాలో త్వరలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి.

**● వంద మెగావాట్ల ఉత్పత్తికి శ్రీకారం**

జిల్లాలో సోలార్ విద్యుత్‌ను పెద్దఎత్తున ఉత్పత్తి చేయడం ద్వారా విద్యుత్ సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పెరుగుతున్న జనాభాతో విద్యుత్ వినియోగం ప్రతిఏటా అధికమవుతూ వస్తోంది. ఏసీలు, కూలర్లు వంటి వాడకంతోపాటు పరిశ్రమల ఏర్పాటవుతుండడంతో విద్యుత్ అవసరం రోజురోజుకు పెరిగిపోతోంది. ఈ సమస్య పరిష్కారానికి సోలార్ విద్యుత్ ఉత్పత్తి ఎంతగానో ఉపయోగపడనుంది. దీంతో జిల్లాలోనూ పెద్దఎత్తున సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నది. దాదాపుగా వంద మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని తొలిదశలో చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా జిల్లాలోని కావలి, సంగం, మర్రిపాడు, సీతారామపురం ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను అధికారులు గుర్తిస్తున్నారు. దాదాపుగా అన్నీ ప్రాంతాల్లో 400 నుంచి 500 ఎకరాల మేర ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిల్లో వంద మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుడుతున్నారు. ప్రభుత్వ స్థలాలను ఏర్పాటు చేసి సోలార్ ప్లాంట్లు ప్రైవేటు వ్యక్తుల ద్వారా ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు. ప్రభుత్వ స్థలాలు ఇవ్వడం ద్వారా కాంట్రాక్టర్లకు ఖర్చు తగ్గే అవకాశమున్నందున వారి ద్వారా ప్లాంట్లు ఏర్పాటు చేసి ఒక్కో యూనిట్‌ను రూ.3.17పైసలకు ప్రభుత్వం తీసుకునేలా ప్రణాళికలు రూపొందించారు. దీంతో స్థల సేకరణ పూర్తి కాగానే జిల్లాలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. తద్వారా జిల్లాకు భారీగా విద్యుత్ అందుబాటులో ఉండే అవకాశం ఉండడంతో కొంత మేర ధరలు తగ్గడంతోపాటు విద్యుత్ సమస్యను పూర్తిగా అధిగమించే అవకాశముంది.



విద్యుత్ సోలార్ ప్లాంట్(ఫైల్)

## 11న ఆక్వా రైతుల
# రాష్ట్ర సదస్సు

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న విజయవాడలో ఆక్వా రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నామని, ఈ సదస్సుకు రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య పిలుపు నిచ్చారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు అధ్యక్షతన సంఘం జిల్లా ఆఫీసు బ్యారర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే జిల్లాలో రైతులు పండించిన ధాన్యం విక్రయాల్లో రైతులు రూ. 6వేల నుంచి రూ. 4వేలు నష్టపోతున్నారన్నారు. ఈ సమస్యలపై ఈనెల 9న నగరంలోని గాంధీ బొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు వెంకట కృష్ణయ్య, గోపసాని రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర రాజగోపాల్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## దుత్తలూరులో
# క్షుద్రపూజల కలకలం



ఇంటి ముంగిట పసుపు, కుంకుమ

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలోని కట్టకిందపల్లి కాలనీలో శనివారం క్షుద్రపూజల కలకలం రేగింది. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన వరాలు అనే వ్యక్తి ఇంటి ముందు ముగ్గు వేసి కుంకుమ, పసుపుతోపాటు బొమ్మ గీసి పూజలు చేసినట్లుగా ఉండటంతో కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఉదయం అటుగా వెళుతున్న ఒక మహిళ పూజలు చేసినట్లు గుర్తించి ఇంటి యజమాని వరాలకు విషయం తెలిపింది. అతను ఇంటి బయటకు వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందజేశాడు. దీంతో ఏఎస్ఐ ఇస్మాయిల్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. క్షుద్రపూజలు చేసిన వారిని పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

# వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**● యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్**



ప్రముఖ కవి మోపూరి పెంచల నరసింహను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ వైద్య కళాశాల సమావేశ మందిరంలో యూనియన్ సమావేశం జరిగింది. గౌరవ అధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్, గౌరవ సలహాదారుడు కమ్మటి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మాట్లాడారు. ఉద్యోగుల రివిజన్ కమిషన్‌ను వెంటనే పునరుద్ధరించాలని, ఉద్యోగుల మధ్యంతర భృతి విడుదల చేయాలని, పెండింగ్ కరువు భత్యం, సరెండర్ లీవ్ మొత్తం ఇవ్వాలని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. అలాగే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని, పారిశుధ్య, భద్రత ఉద్యోగులు వేతనాలు రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ చేసిన కమ్మటి శ్రీనివాసులు, ప్రముఖకవి మోపూరు పెంచలనరసింహలను సన్మానించారు. అనంతరం యూనియన్ కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఉరూజ్, సంధానిబాషా, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రసన్న కుమార్, పార్థసారధి, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా గౌడ భాస్కర్ తదితరులు ఎంపికయ్యారు.

# ఎస్సీ రుణాల రికవరీపై చర్చ

**● పాల్గొన్న కులసంఘాల నాయకులు**

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్‌లో రూ.కోట్ల రుణాలు వసూలు కాకుండా ఉండటంతో, వాటిని రికవరీ చేయలేని అధికారులు ఎట్టకేలకు కులసంఘం నాయకులతో శనివారం చర్చ జరిపారు. రుణ రికవరీకి సహకరించాలని వారిని కోరారు. ఒక అజెండా తయారు చేసి రావాల్సిన రుణ రికవరీపై చర్యలు తీసుకుంటామని వారు నాయకులకు తెలిపారు.

**● అందచేసిన రుణాల వివరాలు**

టీడీపీ ప్రభుత్వంలో 2016 నుంచి 19 సంవత్సరాల మధ్య ఎన్ఎస్ఎఫ్‌డీసీ(ట్రాన్స్‌పోర్టు) పథకం కింద 79 మందికి రూ.9.16కోట్ల విలువైన ఇన్నోవా కార్లను, 70 మందికి రూ. 3.84 కోట్ల విలువైన ఎతియాస్ కార్లను అంద చేసింది. ఇతర వాహనాల కింద ఎక్స్‌కవేటర్‌కు రూ.30లక్షలు, ఈ- ఆటోలు తదితర 39 వాహనాలకు రూ.2.21 కోట్ల రుణాలను అందచేసింది. ఇటుకల తయారీ, మినీడైయిరీ, కిరాణా షాపులు తదితరాలకు 615 మందికి రూ. 10.44కోట్లు అందచేసింది. భూమి కొనుగోలు పథకం కింద 118 మందికి రూ.2.55 కోట్లు అందచేసింది. మొత్తం 921 యూనిట్లకు రూ.28.22కోట్లను సబ్సిడీ రుణాలుగా అందచేసింది. ఈ రుణాల్లో ఇప్పటి వరకు రూ. 5.33 కోట్లను మాత్రమే అధికారులు రాబట్ట గలిగారు. ఇంకా రూ. 22.88 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది. అదే విధంగా ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ(ట్రాన్స్‌పోర్టు) పథకం కింద రెండు ఇన్నోవా వాహనాలకు రూ.24.90లక్షలు, ఒక యతియాస్ కారుకు రూ. 6.12 లక్షలు, 14 ట్రాక్టర్లు-ట్రాలీలకు రూ. 69.20లక్షలు, 99 ఈ-ఆటోలకు రూ.84.11 లక్షలు, 18 ఎండీసీఎంఎస్‌లకు రూ. 1.97 కోట్లు, రుణాలుగా అందచేశారు. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ(నాన్-ట్రాన్స్‌పోర్టు-సెల్ఫ్ ఎంప్లాయిమెంటు) పథకం కింద 256 మందికి రూ. 2.33కోట్లు రుణాలుగా ఇచ్చారు. ఈ పథకం కింద మొత్తం 390 యూనిట్లకుగాను రూ. 6.15కోట్లు అందచేశారు. ఈ మొత్తంలో కేవలం రూ. 36.99 లక్షలను మాత్రమే రాబట్ట గలిగారు. ఇంకా రూ.5.78కోట్లు రాబట్టాల్సి ఉంది. ఈ రెండు పథకాల కింద ఇంకా రూ. 28.66 కోట్లను లబ్ధిదారుల నుంచి రాబట్టాల్సి ఉంది. ఇన్నోవా, ఎతియాస్, జేసీబీ వాహనాలను తీసుకునే సమయంలో లబ్ధిదారులకు కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ష్యూరిటీ ఇచ్చారు. మరికొందరు తమ ఇంటి పత్రాలను, భూమి పత్రాలను ష్యూరిటీ కింద ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు ఇచ్చారు.

**● రికవరీపై చర్చ**

ఈ రుణాల విషయమై కుల సంఘం నాయకులతో ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ శోభారాణి, ఈవో మురళిలు శనివారం నాటి చర్చలో సమగ్రంగా వివరించారు. అనంతరం సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాట్లాడుతూ లబ్ధిదారులు తీసుకున్న రుణాలకు సంబంధించి కేంద్ర రుణాన్ని రద్దు చేయాలని, రాష్ట్ర వాటా రుణాన్ని వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చేను సుజాత మాట్లాడుతూ తమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య ఎస్సీ కార్పొరేషన్ ముఖ్యకార్యదర్శి శ్రీనివాస నాయక్‌ను కలిసి వన్



చర్చలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శోభారాణి, ఈవో మురళి తదితరులు

టైం సెటిల్‌మెంట్ ద్వారా రుణ సమస్యను పరిష్కరించాలని కోరారన్నారు. ఈ విషయంలో వన్‌టైం సెటిల్ మెంటే మంచిదని చెప్పారు. నాయకుల మాటలు విన్న అధికారులు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతామని చెప్పారు. చర్చలో ఎస్సీ కమిషన్ మాజీ డైరెక్టర్ బద్దెపూడి రవీంద్ర, నాయకులు కొప్పోలు రఘు, జెల్లి పద్మాకర్, బాలచెన్నయ్య, కుడుముల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల భూ సమస్యలపై మండలాల్లో సదస్సులు పెట్టాలి

**ప్రత్యేక గ్రీవెన్స్‌లో వివిధ సంఘాల నాయకులు**

**బలవంతంగా భూములు సేకరించం : సబ్‌కలెక్టర్**

కందుకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం మండలాల్లో సదస్సులు పెట్టాలని వివిధ సంఘాల నాయకులు కోరారు. కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీ నేతృత్వంలో స్థానిక కార్యాలయంలో శనివారం గిరిజనుల భూసమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ గిరిజనసంఘం, రైతు కూలీ సంఘం (సీపీఎం), గిరిజనుల చైతన్యవేదిక నాయకులు జీవీబీ కుమార్, ఆర్. మోహన్, వీసం విజయ్, జీ. వెంకటేశ్వర్లు, మల్లవరపు లలిత, కత్తి మహేశ్వరి, బాలకోటయ్య, మాణికల సుజాత తదితరులు మాట్లాడుతూ మండలస్థాయిలో సదస్సులు నిర్వహించటం ద్వారా అక్కడికక్కడ సమస్య పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకుని గిరిజనులకు న్యాయం చేయాలని సబ్ కలెక్టరుకు విజ్ఞప్తిచేశారు. కోటిరెడ్డికుంట, తిరుపతికుంట, మర్రిచెట్ల సంఘాల గిరిజనులకు ఇంటిస్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. కరేడులోని ఇందిరానగర్, మర్రిచెట్టు సంఘాలలో యానాదులకు శ్మశాన సౌకర్యం కల్పించాలన్నారు. చిల్లాకాలువ పోరంబోకు భూములకు కన్వర్షన్ చేయించి రామకృష్ణాపురం గిరిజనులు పట్టాలు మంజూరు చేయించాలని, మన్నేటికోట శంకర్‌నగర్ కాలనీలో అన్యాక్రాంతమైన గిరిజనుల భూములను వారికే ఇవ్వాలని, ఉలవపాడులో గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఆధార్‌కేంద్రం పెట్టించాలని కోరారు.

**● మా భూములు ఇవ్వం**

కరేడులోని వివిధ గిరిజన సంఘాలకు చెందిన యానాదులు సబ్ కలెక్టరు వద్ద ఇండో సోల్ సోలార్ కంపెనీ కోసం తమ భూములు ఇవ్వబోమని, ఇళ్లను కూడా ఖాళీచేసే ప్రశ్నేలేదని స్పష్టంచేశారు. భూమి పోతే తమ జీవన విధానం దెబ్బతింటుందని, తమకు భృతి లేకుండా పోతుందని యానాదులు ఆందోళన వ్యక్తంచేశారు. కరేడులో 30 పోలీసుయాక్టును తక్షణం ఎత్తివేయాలని గిరిజనులు కోరారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ భూములను బలవంతంగా ఎవరూ తీసుకోరని, మీజోలికి ఎవరూ రారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజనసంఘాల నాయకులు సీహెచ్ దుర్గాప్రసాద్, నాంచార్లు, కత్తి సుజాత, పోట్లూరి రవి పాల్గొన్నారు.

## ఇండియా స్కిల్స్ కాంపిటేషన్
# గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్ తదితరులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఇండియా స్కిల్స్ కాంపిటేషన్-2025 గోడపత్రికను కలెక్టర్ ఆనంద్ శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూం మాట్లాడుతూ 16 నుంచి 25 ఏళ్ల లోపు యువత ఈ కాంపిటేషన్‌కు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 30 లోగా ఈకేవైసీ ధ్రువీకరణతోపాటు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ పోటీల్లో పాల్గొన్నవారికి అంతర్జాతీయ స్థాయిలో అవార్డు అందచేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారి ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా
# ఉచిత వైద్యం

**రూ. 25 లక్షల విలువైన చికిత్సలు**

**ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్**

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలు అందించటమే యూనివర్సల్ హెల్త్ పాలసీ లక్ష్యమని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్. శివప్రసాద్ తెలిపారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 1.63 లక్షల కుటుంబాలకు 2493 నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా 31 స్పెషాలిటీ విభాగాల్లో నిర్వహించే 3257 రకాల చికిత్సలు ఈ పాలసీ ద్వారా పూర్తిగా ఉచితమని చెప్పారు. హైబ్రిడ్ మోడ్‌లో బీమా సంస్థల ద్వారా నగదు రహిత వైద్యసేవలు రాష్ట్ర ప్రజలకు అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. ఊబకాయం, మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు ఘనణీయంగా పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందు చూపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పాలసీకి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు రూ. 8480 కోట్ల అంచనాలతో నివేదిక తయారు చేసి, రూ. 4948 కోట్ల నాబార్డు నిధులు, సీఎస్ఎస్, కేంద్రం ప్రత్యేక నిధులను పొంది రూ. 1451 కోట్ల ఖర్చు చేసి గత ప్రభుత్వం 25 శాతం కూడా పనులు చేపట్టలేదన్నారు. పిపిపి విధానం ద్వారా 10 వైద్య కళాశాల నిర్మాణం, నిర్వాహణ వాటికి అనుబంధంగా ఆసుపత్రులను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకు తీసుకురావటం శుభపరిణామన్నారు.





విలేకరులతో మాట్లాడుతున్న శివప్రసాద్

## మరిన్ని సేవలపై
# ప్రత్యేక దృష్టి

**● విద్యుత్‌శాఖ ఎస్ఈ**

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు సమర్థవంతమైన మరిన్ని సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వీ. విజయన్ తెలిపారు. నగరంలో శనివారం సబ్ డివిజన్ అధికారులు, సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చేపట్టిన వినూత్న కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశకాలను, కంపెనీ ఆర్థిక స్థితిని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆయన తెలియజేశారు. ప్రభుత్వం ఆశించిన విధంగా వినియోగదారులకు సకాలంలో ఎలాంటి సేవలు అందిస్తున్నారో తెలుసుకోవడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరులోపు అన్నీ విద్యుత్ స్తంభాలపై ఉన్న అనధికార కేబుల్స్‌ను తొలగించాలన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నప్పటికి సంస్థకు రావాల్సిన రెవెన్యూ బకాయిలు పూర్తిగా రావడం లేదని, ప్రతి ఒక్కరూ రెవెన్యూ వసూళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వెంటనే వేగవంతమైన వసూళ్ల కోసం చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రవర్తన, భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. వినియోగదారులకు మరింత నాణ్యమైన, భద్రతాయుక్తమైన విద్యుత్ సేవలను అందించే దిశగా ప్రతిఒక్కరూ అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ఈఈ ఎం శ్రీధర్, డీఈలు సునీల్‌కుమార్, కిరణ్, ఏఈలు విజయ్, కృష్ణవేణి, మునిశేఖర్, సురేష్, గోపాలకృష్ణ, నస్రుల్లా, రమణ, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

## మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

**● జేసీకి రైతు సంఘం వినతి**



జేసీ కార్తీక్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నేతలు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పుట్టి రూ. 19,720 కి కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. శనివారం జేసీ కే. కార్తీక్‌కు ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు దామా అంకయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్‌వాజ్ మాట్లాడారు. జిల్లాలో ఆగస్టు 15 నుంచి ఎడగారు ధాన్యం మార్కెట్‌లో వస్తున్నదన్నారు. ఇప్పటికే 30 శాతం వరికోతలు పూర్తయ్యాయని చెప్పారు. అయితే చెన్నై, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల వ్యాపారులు ధాన్యాన్ని పుట్టికి రూ. 16,700లకు మాత్రమే కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రోకర్లు, ఏజెంట్‌లు నేరుగా కల్లాల్లోకి వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. సివిల్‌సప్లయ్ శాఖ అధికారులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయక పోవటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జీ. రమణయ్య, వై. మధు తదితరులు పాల్గొన్నారు.